ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-2-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 28 పేజీలు: 10+4 వెల: 6.50


కోల్‌కతాలో భూకంపం.. జనం పరుగులు 5లో

సోషల్ మీడియాపై నియంత్రణా, నిషేధమా?



# కేజ్రీవాల్, కవితకు క్లీన్-చిట్

## ఢిల్లీ లిక్కర్ స్కాంలో సిసోడియా సహా 23 మందిపై అభియోగాలు కొట్టివేత

- సిబిఐ ఛార్జిషీట్‌లో మెరిట్‌లేదన్న రౌస్ అవెన్యూ కోర్టు
- దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన విచారణకు ఆదేశం
- ట్రయల్ కోర్టు తీర్పును హైకోర్టులో సవాల్ చేసిన సిబిఐ
- రాజకీయ కుట్రతోనే కేసు: కేజ్రీవాల్

**దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ సిఎం ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఆయనపై ఉన్న అభియోగాలను కొట్టివేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు ఇచ్చింది. అంతేకాదు ఆయనతో పాటు మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవిత తదితరులు 23 మందిపై ఉన్న అభియోగాలను కూడా తొలగించినట్టు పేర్కొంది. ఈ కేసు విచారణ సందర్భంగా సిబిఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో మెరిట్ లేదని రౌస్ అవెన్యూ కోర్టు స్పష్టం చేసింది.**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** లిక్కర్ పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా అందరు నిందితులను విడుదల చేశారు, ఢిల్లీ కోర్టు సిబిఐని తప్పుపట్టింది. లిక్కర్ పాలసీ కుంభకోణానికి సంబంధించిన అవినీతి కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను శుక్రవారం ఢిల్లీ కోర్టు విడుదల చేసింది. రౌస్ అవెన్యూ కోర్టుల ప్రత్యేక న్యాయమూర్తి జితేంద్ర సింగ్ కూడా ఈ కేసులో ఆప్ నాయకుడు మనీష్ సిసోడియాను విడుదల చేశారు. ముఖ్యంగా, ఈ కేసులో నిందితులైన 23 మందినీ న్యాయమూర్తి విడుదల చేశారు. వారు కుల్దీప్ సింగ్, నరేందర్ సింగ్, విజయ్ నాయర్, అబిషేక్ బోయిన్‌పల్లి, అరుణ్ పిళ్లై, మూత గౌతమ్, సమీర్ మహేంద్రు, మనీష్ సిసోడియా, అమన్‌దీప్ సింగ్ ధాల్, అర్జున్ పాండే, బుచ్చిబాబు గోరంట్ల, రాజేష్ జోషి, దామోదర్ ప్రసాద్ >>2



# హైకోర్టు కొత్త సిజెగా జస్టిస్ లీసా గిల్

## 'సుప్రీం' కొలీజియం సిఫారసు

**విజయవాడ,ఫిబ్రవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి(సీజె)గా జస్టిస్ లీసా గిల్‌ను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ప్రస్తుత సిజె జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ మరో 2 నెలల్లో రిటైర్ కానున్నారు. ఈ నేపథ్యంలో కొలీజియం ఈ నిర్ణయం తీసుకుంది. జస్టిస్ లీసా పంజాబ్ హర్యానా హైకోర్టులో న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్నారు. బి.ఎ. బిఎల్. ఎల్ఎల్ఎం పూర్తి చేసిన ఈమె 1990లో న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 2014లో పంజాబ్ హర్యానా జడ్జిగా నియమితులయ్యారు.



# కొత్త సిఎస్‌గా జి.సాయిప్రసాద్

## నేడు బాధ్యతలు స్వీకరణ

**విజయవాడ,ఫిబ్రవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జి.సాయి ప్రసాద్ నియమితులయ్యారు.ఆయన శనివారం ఎపి సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.రాష్ట్ర ప్రభుత్వం గత నవంబరు 29వ తేదీన జిఓఆర్టి సంఖ్య 2230 ద్వారా ప్రస్తుత సిఎస్ విజయానంద్ పదవీ కాలాన్ని మూడు మాసాలు అనగా ఈనెల 28వ తేదీ వరకూ పొడిగిస్తూ తదుపరి సిఎస్ గా ప్రస్తుతం జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా మరియు ఇఒ స్పెషల్ సిఎస్ టు సిఎంగా ఉన్నసాయి ప్రసాద్‌ను >>2

# గురుకులంలో డయేరియా


## మన్యం జిల్లాలో తల్లిదండ్రుల ఆందోళన

**కురుపాం (పార్వతిపురం మన్యం జిల్లా), ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో డయేరియా వ్యాప్తి చెందడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురిచేస్తోంది. ఇది ఫుడ్ కారణంగా వ్యాపించి ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఆరో తరగతి చదువుతున్న విద్యార్థులు మండలి హేమలత,కోలక అనసూయ, కొండ గొర్రె అనుశ్రీలకు డయేరియా వ్యాపించడంతో విద్యార్థుల్లో కలకాలం రేగింది. వెంటనే వీరికి పాఠశాల ఆవరణలోనే >>2

# ప్రేమ పెళ్లి విషాదం

## పెళ్లిరోజునే సోదరి భర్తను కొట్టి చంపిన సోదరులు

### వేములపల్లిలో పరువు హత్య



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** ఇద్దరూ చిన్నప్పటినుండి కలసి చదువుకున్నారు, వేర్వేరు కులాలు, అయినా ప్రేమించి పెళ్లి చేసుకున్నారు, అయితే యువతి కుటుంబ సభ్యులకు ఈ వివాహం ఇష్టం లేకపోవడంతో ఆమె సోదరులు యువకుడి ఇంటికి వెళ్లి రాళ్లతో పాసవికంగా దాడి చేసే హత్య చేశారు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా >>2

# ఉద్యాన హబ్‌గా 'సీమ'

## సాగుకు ఉచిత విద్యుత్ కోసం రూ.13,722 కోట్లు

## ఏలూరు వద్ద అతిపెద్ద కోకో సీటీ

## ఆక్వాకల్చర్ హబ్‌గా రాష్ట్రం అభివృద్ధి

### వ్యవసాయం, అనుబంధ రంగాల పద్దులపై అసెంబ్లీలో సిఎం చంద్రబాబు



**విజయవాడ.ఫిబ్రవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయరంగంలో ఆంధ్ర ప్రదేశ్ విప్లవాత్మక విధానాలు పాటిస్తుందని సీఎం చంద్రబాబు తెలిపారు.అనేక సంస్కరణలను అమలు చేస్తోందన్నారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించే దిశలో చర్యలు తీసుకుందన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, హౌసింగ్ బడ్జెట్ పద్దుపై శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ జాతీయ స్థూల ఉత్పత్తిలో 10 శాతం మేర వ్యవసాయం నుంచి ఏపీ కంట్రిబ్యూట్ చేస్తోంది అన్నారు.వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్, ప్రభుత్వ మద్దతు అనే పంచ సూత్రాల విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. 22.5 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. ఈ ఏడాది 69 వేల కనెక్షన్లు కొత్తగా ఇచ్చామన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం 2025-26ఆర్థిక సంవత్సరంలో రూ.13,722 కోట్లు కేటాయించాని పేర్కొన్నారు. 1250 మెట్రిక్ టన్నుల మైక్రో న్యూట్రియెంట్లను కూడా వ్యవసాయానికి సరఫరా చేశామని, అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల మొత్తాన్ని రైతులకు మూడు విడతల్లో ఇస్తున్నామన్నారు. గతంలో రూ.7500 మాత్రమే రైతులకు ఇచ్చారు. దానికి రెండింతలు మేర రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.14వేలు ఇస్తున్నామన్నారు.47లక్షలమంది రైతులకు రూ.310 కోట్లు >>2



# స్థానిక ఎన్నికలపై కౌంటర్ దాఖలు చేయండి

## ప్రభుత్వానికి, ఇసికి హైకోర్టు నోటీసులు

**విజయవాడ,ఫిబ్రవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని 13,325 గ్రామపంచాయతీలు, 123 పట్టణ స్థానిక సంస్థలకు త్వరలో కాల పరిమితి ముగియనున్నది. ఈ క్రమంలో సకాలంలో ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం, ఎస్ఈసీని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో >>2



మహేంద్ర యాదవ్

# వివేకా హత్యకేసు వడివడిగా సిబిఐ దర్యాప్తు



కిరణ్ కుమార్ యాదవ్

## మహేంద్ర యాదవ్, కిరణ్ యాదవ్‌ను ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు

## తమ ప్రాణాలకు ముప్పు ఉందన్న కిరణ్

**పులివెందుల, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** వివేకా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ మరోసారి వేగాన్ని పెంచింది. మాజీ మంత్రి వైయస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత సుప్రీం కోర్ట్ నందు విచారణపై చేసిన అభ్యంతరాల మేరకు సీబీఐ అధికారులు ముఖ్య నిందితుడైన వైయస్ కుటుంబ బంధువులైన అర్జున్ రెడ్డి, సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ యాధవ్, మహీంద్రా యాదవ్ లను శుక్రవారం సిబిఐ అధికారులు నేరుగా పులివెందులకు చేరుకుని విచారించా రు.యాదాటి కిరణ్ కుమార్ యాదవ్, గొర్ల మహేంద్ర యాదవ్‌లకు హైదరాబా దులోని సీబీఐ కార్యాలయం లో విచారణకు హాజరుకా వాలంటూ ముందుగా నోటీసులు జారీ అయ్యాయి. వారు హాజరు కాలేమని తెలియజేయడంతో సీబీఐ అధికారులు పులివెందుల పోలీస్ స్టేషన్‌లోనే విచారణ చేపట్టారు.మొదటగా గొర్ల మహేంద్ర యాదవ్ సీబీఐ అధికారుల ముందు హాజరై సుమారు రెండు గంటల పాటు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అనంతరం స్టేషన్ నుంచి వెళ్లిపోయారు.అనంతరం వివేకా హత్య కేసులో ఏ2గా ఉన్న సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ కుమార్ యాదవ్ కూడా విచారణకు హాజరయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో కూడా ఆయనను అర్జున్ రెడ్డితో కలిసి ప్రశ్నించినట్లు సమాచారం.ఈసారి పులివెందులలో సీబీఐ అధికారి రోహిత్ యాదవ్ సుమారు రెండు గంటల పాటు కిరణ్ యాదవ్‌ను విచారించారు. సునీత రెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయిస్తూ కిరణ్ యాదవ్, అర్జున్ రెడ్డి కాల్‌డేటాపై విచారణ జరపాలని కోరిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ అంశంపై దృష్టి సారించింది. కిరణ్ యాదవ్ పై అర్జున్ రెడ్డి ల మధ్య గల సంబంధం కాల్ డేట్ పై పలు ప్రశ్నలు వర్షం కురిపించినట్టు తెలిసింది. వివేకా హత్య కేసులో వరుసగా జరుగుతున్న సీబీఐ విచారణలు కేసును మరింత కీలక దశకు తీసుకెళ్తున్నాయి. కాల్‌డేటా విశ్లేషణ, కోర్టు ఆదేశాలు, ప్రత్యక్ష విచారణలతో దర్యాప్తు ముమ్మరమైంది. పులివెందులలో జరిగిన తాజా పరిణామాలు కేసు దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వివేక హత్య కేసులో ఎటు నిందితులుగా ఉన్న సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ కుమార్ యాదవ్‌ను సీబీఐ అధికారుల విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన కిరణ్ తో మాట్లాడుతూ సీబీఐ అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చానన్నారు. కాల్‌డేటాపై ప్రశ్నలు అడిగినట్లు తెలిపారు.విచారణకు పూర్తిగా సహకరిస్తానని చెప్పారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందని ఆరోపించారు.



# కౌన్సిల్ విపక్షనేత బొత్సకు బ్రెయిన్ స్ట్రోక్

## హైదరాబాద్‌కు తరలింపు

**విజయవాడ.ఫిబ్రవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్ సీపీ. నాయకుడు , ఏపీ శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్య నారాయణ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. ఆయన నిన్న రాత్రి ఉన్నట్లుండి కుప్పకూలి పోయారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు.హుటాహుటిన వైద్యులు ఆయనకు వైద్య పరీక్షలు చేసారు. ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు గుర్తించారు.దీంతో ఆయనను నిన్న హైదరాబాద్‌కు తరలించారు. సిటీ న్యూరో సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బొత్స ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. గతేడాది జూన్ లో కూడా వెన్నుపోటు దినం సందర్భంగా విజయనగరం జిల్లా చీపురుపల్లిలో నిర్వహించిన నిరసనలో కుప్పకూలిన బొత్స డీహైడ్రేషన్ కాస్త జ్వరంతో ఉండగా బీపీ షుగర్ పెరిగిపోవడంతో అపస్మారక స్థితిలోకి బొత్స వెళ్ళారు.అప్పట్లో ఆయన కోలుకుని, క్రియాశీలకమయ్యారు. ప్రస్తుతం బొత్స పరిస్థితి అన్ని విధాలుగా బాగుందని, రెండు ,మూడు రోజుల్లో బొత్సా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఎయుని టాప్ 10లోకి తెస్తాం



## వర్సిటీలో మ్యాన్‌పవర్ ఆడిట్..30 రోజుల్లో అక్రమ నియామకాలపై వేటు: మంత్రి లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని (ఏయూ) పూర్తిగా వైసీపీ ప్రభుత్వ హయాంలోపార్టీ కార్యాలయంగా మార్చేశారని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో గత ఐదేళ్లలో జరిగిన అక్రమ నియామకాలపై ప్రత్యేకంగా ఖిమ్యాన్‌పవర్ ఆడిట్‌ఖి నిర్వహిస్తామని, 30 రోజుల్లో నివేదిక తెప్పించుకుని అనర్హులపై వేటు వేస్తామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో విశాఖపట్నం ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఏయూలో గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, కాంట్రాక్ట్, రోజువారీ వేతన సిబ్బంది సర్వీసులను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ.. గత ప్రభుత్వంలో వర్సిటీల్లో వైసీపీ కార్యకర్తలను విచ్చలవిడిగా నియమించుకున్నారని, ఈ అక్రమాలపైనే మ్యాన్‌పవర్ ఆడిట్ చేపడుతున్నామని తెలిపారు. ఈ ఆడిట్ పూర్తయ్యాక, ఆర్థిక శాఖతో చర్చించి ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. అదేవిధంగా, ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని, మరో 45 రోజుల్లో ఆ నివేదిక ప్రభుత్వానికి అందుతుందని మంత్రి వెల్లడించారు. ఆ రిపోర్టు ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గత ప్రభుత్వ నిర్వాకం వల్లే ఏయూ కీర్తి ప్రతిష్ఠలు మసకబారాయని లోకేశ్ విమర్శించారు. 2019లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 29వ స్థానంలో ఉన్న ఏయూ, 2023 నాటికి 76వ ర్యాంకుకు పడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చాక ఇప్పటికే 41వ ర్యాంకుకు మెరుగుపడిందని, త్వరలోనే వర్సిటీని టాప్ 10లోకితీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.వర్సిటీ వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సభ్యులు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. రేపటివిశాఖ పర్యటనలో వీసీతో సమావేశమై శతాబ్దిఉత్సవాల నిర్వహణపై సమీక్షిస్తానని, సభ్యుల సలహాలు కూడా తీసుకుని వేడుకలను నిర్వహిస్తామని మంత్రిహామీ ఇచ్చారు.

# వ్యవసాయ కూలీల బొలెరో బోల్తా 2లో



# క్రేన్-కారు ఢీ ముగ్గురు మృతి

## డోన్ పరిధిలో దుర్ఘటన

**డోన్ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా డోన్ మండల పరిధిలోని జగదుర్తి గ్రామ స్టేజి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలైనట్లు డోన్ రూరల్ సిఐ రాకేష్ తెలిపారు. వివరాలకు వెళితే బెంగళూరు చెందిన ప్రమోద్ అతని భార్య శాంత సిద్ధార్థ భార్గవ్ ఇద్దరు పిల్లలతో తిరుపతికి వెళ్లి అక్కడనుండి శ్రీశైలం వెళ్తున్న సమయంలో డోన్ సమీపంలోని జగదుర్తి వద్దకు రాగానే రాంగ్ రూట్లో ఎదురుగా వస్తున్న క్రేన్ను తప్పించిపోయి క్రేన్ ముందు భాగంలో ఢీకొనడంతో పక్కనే ఉన్న పొలాల్లోకి కారు దూసుకెళ్లింది. కార్‌లో ఉన్న ప్రమోద్ భార్య అతని ఇద్దరు పిల్లలు అక్కడకక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ప్రమోదును స్థానికులు బయటకు తీశారు. కారులో ఎయిర్ బ్యాగ్ ఓపెన్ అయినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. ఈదుర్ఘటన ప్రాంతానికి రూరల్ సీఐతో పాటు పట్టణ సీఐ ఇంతియాజ్ భాష రూరల్ ఎస్సై మమత సంఘటన స్థలానికి వెళ్లి మృతులను పోస్టుమార్టం నిమిత్తం డోన్ ప్రభుత్వ తరలించారు. తీవ్రంగా గాయపడిన ప్రమోదును ప్రథమ చికిత్స ప్రభుత్వ ఆసుపత్రిలో చేయించి మెరుగైన వైద్యం కొరకు కర్నూల్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ రాకేష్ తెలిపారు.


ఏపి సిఎం చంద్రబాబుతో తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

## ఏపి సిఎం చంద్రబాబుతో తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి భేటీ

● కుమారుడి వివాహానికి ప్రత్యేక ఆహ్వానం

**విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి సిఎం చంద్రబాబును తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమారుడి వివాహానికి హాజరు కావాలని చంద్రబాబును భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ఆహ్వానించారు. భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం మార్చి 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనుంది. ఈ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు కలిసి చంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల నేతలు కాసేపు ముచ్చటించు కున్నారు. ఈ సమావేశం పూర్తిగా మర్యాద పూర్వకంగానే జరిగిందని, ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని స్పష్టమవుతోంది. తన కుమారుడి వివాహ వేడుకకు హాజరై వధూ వరులను ఆశీర్వదించాలని చంద్రబాబును భట్టి విక్రమార్క కోరారు. ఏపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క, తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అయ్యన్న పాత్రుడిని కలిశారు. ఈ సందర్భంగా తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి రావాల్సిందిగా భట్టి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం వారు కాసేపు ముచ్చటించుకున్నారు. కాగా, మార్చి 5వ తేదీన హైదరాబాద్‌లో భట్టివిక్రమార్క తనయుడి వివాహం జరగనుంది.

## యుద్ధ హెలికాప్టర్ ప్రచండలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము విహారం!

**జైసల్మేర్, ఫిబ్రవరి 27:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం లైట్ కంబాట్ హెలికాప్టర్ ప్రచండ్‌లో విహరించారు. సుమారు 25 నిమిషాల పాటు ఆమె స్తోర్టీ నిర్వహించారు. భారత్, పాకిస్థాన్ బోర్డర్‌లో ఉన్న జైసల్మేర్ జిల్లాలో ముర్ము విహరించారు. జైసల్మేర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి హెలికాప్టర్ టేకాఫ్ తీసుకున్నది. టేకాఫ్‌కు ముందు ఆ హెలికాప్టర్ గురించి రాష్ట్రపతి ముర్ముకు కెప్టెన్ బ్రీఫింగ్ ఇచ్చారు. కాక్‌పిట్ నుంచి ఆమె చేతులు ఊపారు. సైనిక దళాల సుప్రీం కమాండర్ హోదాలో ముర్ము విహరించా రు. స్వయం సమృద్ధికి శక్తివంతమైన సంకేతంగా ప్రచండ హెలికాప్టర్ నిలుస్తుందని, జైసల్మేర్ జిల్లాలో విహరిస్తున్నానని, మన వీరోచిత సైనికు లకు హృదయపూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నానని ముర్ము ఆ హెలికాప్టర్ కాక్‌పిట్ నుంచి సందేశం వినిపించారు. సైనికులకు సెల్యూట్ చేస్తున్నానని, జై హింద్, జై భారత్ అని ఆమె అన్నారు. పోక్రాన్ ఫైరింగ్ రేంజ్ సమీపంలో హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. ఇక్కడే ఇవాళ సాయంత్రం వాయు శక్తి పేరుతో విన్యాసాలు నిర్వహించను న్నారు. ఇవాళ్టి సోర్టీతో యుద్ధ హెలికాప్టర్‌లో ప్రయాణించి తొలి భారత రాష్ట్రపతిగా ముర్ము రికార్డు క్రియేట్ చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో ఆమె అంబాలా ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి రఫేల్ యుద్ధ విమానంలో విహరించిన విషయం తెలిసిందే. 2023 ఏప్రిల్‌లో ఆమె సుఖోయ్ 30 ఎంకేఐ ఫైటర్ ప్లేన్‌లో ఎగిరారు. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ ఎల్‌సీహెచ్ ప్రచండ హెలికాప్టర్ ను నిర్మించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని డిజైన్ చేసి డెవలప్ చేశారు. అడ్వాన్స్‌డ్ ఏవియానిక్స్, స్టీల్త్ ఫీచర్స్, నైట్ అటాక్ కెపాసిటీ, ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్ తీసుకెళ్లే సామర్థ్యం ఉన్నది.


యుద్ధ హెలికాప్టర్ ప్రచండలోకి ఎక్కిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ము


బాలీవుడ్ నటుడు సంజయ్ దత్‌తో నారా లోకేశ్...

## సంజయ్ దత్‌ను కలిసిన నారా లోకేశ్

● రాష్ట్రంలో సినిమా పరిశ్రమ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ఇరువురు నడమ చర్చ
● 'లెజెండరీ బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్‌ను కలవడం చాలా ఆనందంగా ఉందంటూ లోకేష్ ట్వీట్

**విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ముంబైలో పర్యటిస్తున్నారు. ఈ టూర్ లో భాగంగా ప్రముఖ బాలీవుడ్ నటుడు సంజయ్ దత్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సినిమా పరిశ్రమ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ఇరువురూ కాసేపు చర్చించుకున్నారు. ముఖ్యం గా ఏపీలో సినిమా షూటింగ్‌లకు అనుకూలమైన వాతావరణం కల్పించడంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఏపిలో అంతర్జాతీయ ప్రమాణా లతో కూడిన కొత్త ఫిలిం సిటీని ఏర్పాటు చేసే అవకాశాలపై సంజయ్ దత్‌తో లోకేశ్ చర్చించా రు. రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లు జరుపుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వేగంగా అనుమతులు మంజూరు చేసేందుకు సింగిల్ విండో విధానాన్ని తీసుకురావాలనే ఆలోచనను ఆయన పంచుకున్నారు. ఈ విధానం వల్ల నిర్మాతల సమయం ఆదా అవ్వడంతో పాటు, ఏపీ వైపు సినీ పరిశ్రమ ఆకర్షితమవుతుందని భావిస్తున్నారు. ఈ భేటీ అనంతరం నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "లెజెండ రీ బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్‌ను కలవడం చాలా ఆనందంగా ఉంది. ఏపీలో సినిమా షూటింగ్ ఎకోసిస్టమ్‌ను సృష్టించే అవకాశాలపై నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను" అని పేర్కొన్నారు. పరిశ్రమలు, పెట్టుబడుల ఆకర్ష ణలో భాగంగానే వినోద రంగాన్ని కూడా ఏపీలో బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే లోకేశ్ బాలీవుడ్ ప్రముఖులను కలుస్తూ రాష్ట్రంలోని వనరులను, అవకాశాలను వారికి వివరిస్తున్నారు.

## వ్యవసాయ కూలీల బొలెరో బోల్తా

● ముగ్గురి పరిస్థితి విషమం ● 22 మందికి తీవ్రగాయాలు
● ఆదోని కర్నూలు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

**ఆస్పరి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలో మొక్కజొన్న కోతకు వెళుతున్న వ్యవసాయ కూలీల బొలెరో వాహనం బోల్తా పడడంతో 25 మంది కూలీలు గాయలపాలయ్యారు. శుక్రవారం మండల పరిధిలోని పుటకలమర్రి బస్‌స్టాప్ వద్ద జరిగిన ఈ సంఘటనలో బోయ చెన్నకేశవ, రాధమ్మ, అనిత పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. 22 మందిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. పుటకలమర్రి గ్రామానికి చెందిన 45 మంది వ్యవసాయ కూలీలు పత్తికొండ మండలం నలకదొడ్డి గ్రామంలో మొక్కజొన్న కోత కోసేందు కు ఉదయం ఆరు గంటలకే గ్రామం నుంచి బయలుదేరారు. గ్రామానికి సమీపాన ఉన్న కర్నూలు బళ్ళారి రోడ్డుకు డ్రైవర్ అతి వేగంతో మలుపు తిప్పగా దీంతో కంట్రోలు తప్పి బొలె రో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడిన 22 మందిలో చంద్ర, సువర్ణ, యువరాజ్, అశోక్, రాఘవేంద్ర, రంజిత్, నాగరాజు, ముని రంగమ్మ, అరవింద్, పవన్‌కుమార్, వీరేష్, వెంక ట్రాముడు, లక్ష్మన్న, జయలక్ష్మి, లక్ష్మి, హనుమంతమ్మ, నారాయణ, చిన్న ముసళి, రామలక్ష్మి, లక్ష్మన్, లక్ష్మినారాయణ, రంగస్వా మి, అశ్వినిలను నాలుగు అంబులెన్స్‌లలో ఆదోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సి.ఐ.గంగాధర్ తెలిపారు. బాధితుడు వీరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## కొత్త సిఎస్‌గా జి. సాయిప్రసాద్

>> నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమేరకు శనివారం ఉ.11.33 గం.లకు ఎపి సచివాలయంలో సాయి ప్రసాద్ నూతన సిఎస్ గా పదవీ బాధ్యతలు చేపడతారు. 1991 ఐఏ ఎస్ బ్యాచ్ ఎపి క్యాడర్‌కు చెందిన సాయి ప్రసా ద్ ఎంటెక్ పట్టభద్రులు కాగా 1991 సెప్టెంబరు 15న ఐఏఎస్‌కు ఎంపికై 1992 జూన్ నుండి 1993 మే వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరం గల్ అసిస్టెంట్ కలక్టర్‌గా పని చేశారు. అనం తరం 1993 సెప్టెంబరు నుండి 1995 ఏప్రిల్ వరకు పాడేరు అసిస్టెంట్ కలక్టర్‌గా, 1995 ఆగ స్టు నుండి 1997 మార్చి వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌గా పని చేశా రు. అనంతరం 1997 మే నుండి 1998 ఆగ స్టు వరకు కడప జాయింట్ కలక్టర్‌గా, 2000 జూలై నుండి 2003 జూన్ వరకూ కర్నూల్ కలక్టర్‌గా, 2003 జూన్ నుండి 2003 అక్టోబ రు వరకు చిత్తూరు జిల్లా కలక్టర్‌గా పనిచేశారు. 2003 అక్టోబరు నుండి 2004 ఆగస్టు వరకు ఎపి ట్రాన్సుకో జెఎండిగా, 2004 ఆగస్టు నుండి 2006 మే వరకు ఇపిడిపిసిఎల్ సిఎండ గా, 2006 మే నుండి 2010 ఫిబ్రవరి వరకు ఎపి సిపిడిసిఎల్ సిఎండిగా పనిచేశారు. 2010 ఫిబ్రవరి నుండి 2011 అక్టోబరు వరకు ఎపి హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్‌గా పనిచేశారు. అనంతరం 2011 అక్టోబరు నుండి 2014 జూన్ వరకు కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. తదుపరి 2014 జూన్ నుండి 2016 ఫిబ్రవరి వరకు సియం కార్యద ర్శిగా, 2016 ఫిబ్రవరి నుండి 2019 మే వరకు సిఎం ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. తదుపరి 2020 జనవరి నుండి 2022 ఫిబ్రవరి వరకు ఎపి సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రవేట్ లిమిటెడ్ కు సిఎండిగా మరియు ఇంధన శాఖ ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీగాను పనిచేశారు. అనంతరం 2022 ఫిబ్రవరి నుండి 2024 జూన్ వరకు సిసిఎల్‌ఏగా పనిచేశారు. తదుపరి 2024 జూన్ నుండి 2025 జనవరి జలవరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ 2025 జనవరి నుండి అదే హోదాలో పనిచేస్తూ సిఎం ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న సాయి ప్రసాద్ శనవారం నూతన సిఎస్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ఉద్యాన హబ్‌గా 'సీమ'

>> పంటనష్టపోయిన రైతులకు పెట్టబడి రాయితీ, రూ.10,816 కోట్ల మేర 24 గంటల్లో ధాన్య కొనుగోళ్ల కోసం రైతులకు చెల్లించాం అన్నారు. గత పాలకులు రైతులకు చెల్లించాల్సిన రూ.1670 కోట్ల ధాన్యం బకాయిలు కూడా మేమే చెల్లించాం అన్నారు. రైతు ఆత్మహత్యలు కూడా గత ప్రభుత్వ హయాంలో జరిగాయి అన్నారు. ఇప్పుడు వాటిని నియంత్రించేలా ప్రతీ ఘటననూ ఆడిట్ చేయించేలా నిర్ణయం తీసుకున్నాం. వ్యవసాయ యాంత్రీకరణ పెద్ద ఎత్తున తీసుకురావటంతో పాటు ఏఐ ఆగ్రాన మిస్టు సేవలు కూడా అందేలా చేస్తాం. 14,230 కోట్ల మేర ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడు లు రాష్ట్రానికి వచ్చాయి అన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్‌పై పెద్ద ఎత్తున దృష్టి పెట్టాం అన్నారు. 8,168 గ్రామాల్లో 15 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. త్వరలో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసేలా ప్రోత్సాహం ఇస్తున్నాం అన్నారు. ప్రస్తుతం రాయలసీమలో ఉద్యాన పంటలు 400 మిలియన్ టన్నుల మేర సాగవుతున్నాయన్నారు. వెయ్యి మిలియన్ మెట్రిక్ టన్నుల మేర ఉత్పత్తి అయ్యేలా లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు క్లస్టర్ విధానం ద్వారా ప్రభుత్వం రూ.30 వేల కోట్లతో ఈ ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. ప్రైవేటు రంగంలో మరో 70 వేల కోట్లతో మొత్తం లక్ష కోట్ల మేర పెట్టుబడులతో రాయలసీమను ఉద్యాన హబ్‌గా తయారు చేస్తాం, ఏలూరు వద్ద ప్రపంచంలోనే అత్యంత కోకో సిటీ ఏర్పాటు, రూ.1.50కే యూనిట్ విద్యుత్ ఇచ్చి ఆక్వా రంగాన్ని కూడా పూర్తి స్థాయిలో ప్రోత్సహిస్తున్నామన్నారు. ఏపీ ఆక్వా కల్చర్ హబ్‌గా మారుస్తాం అన్నారు.

**ఉత్పత్తిలో దేశంలోనే తొలి స్థానంలో ఉన్నాం**

సమర్థ నీటి నిర్వహణ వల్ల భూగర్భ జలాలు పెరుగుతున్నాయని సీఎం తెలిపారు. రైతులకు పూర్తిగా అండగా ఉంటామని సీఎం చంద్రబాబు తెలిపారు. రైతులు ముందే మాట్లాడుకుని భిన్నమైన పంటలు వేయాలన్నారు. ప్రత్యామ్న య పంటల ద్వారా మార్కెట్ పరిస్థితులను సానుకూలం చేసుకోవడంతో డిమాండ్ పెంచవ చ్చు అన్నారు. ఈసారి కొంతమేర వర్షపాతం తగ్గే అవకాశం ఉందన్న అంచనాలు ఉన్నాయి అన్నారునీటి భద్రతపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాం, అన్నమయ్య జిల్లాలో సమర్థ నీటి నిర్వహణ ద్వారా 6.67 మీటర్లకు భూగర్భ జలాలు పెరిగాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సగటున 7.31 మీటర్ల మేర భూగర్భ జలాలు, భూగర్భ జలాలు పెరిగిన కారణంగా రూ.95 కోట్ల మేర విద్యుత్ ఆదా అయ్యింది. అన్నారు 20 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు కూడా పెరిగాయి. రూ.1634 కోట్ల మేర జీఎస్డీపీ కూడా పెరిగింది అన్నారు.

## కేజ్రీవాల్, కవితకు క్లీన్ చిట్

>> శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ కుమార్ సింగ్, చాన్‌ప్రీత్ సింగ్, కె కవిత, అరవింద్ కేజ్రీవాల్, దుర్గేష్ పాఠక్, అమిత్ అరోరా, వినోద్ చౌహాన్, ఆశిష్ చంద్ మాథుర్, శరత్ రెడ్డి. దర్యాప్తులో జరిగిన లోపాలకు సిబిఐని కోర్టు తీవ్రంగా విమర్శించింది. ఈ 'భారీ చార్జిషీట్'లో ఏ సాక్షి లేదా వాంగ్మూలం లేకుండా అనేక లోపాలు ఉన్నాయని కోర్టు పేర్కొంది. సిసోడియాపై ప్రాథమికంగా కేసును రూపొందించడంలో సిబిఐ విఫలమైందని కోర్టు పేర్కొంది. కేజ్రీవాల్‌ను ఎటువంటి ఆధారాలు లేకుండానే నిందితుడిగా చేర్చారని న్యాయమూర్తి తెలిపారు. తీర్పు ప్రకటిస్తూ, వేల పేజీల సిబిఐ చార్జిషీట్‌లో సాక్షుల వాంగ్మూలాలకు మద్దతు ఇవ్వని అంశాలు ఉన్నాయని కోర్టు పేర్కొంది. చార్జిషీట్‌లో తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు ఉన్నాయని కూడా న్యాయమూర్తి అన్నారు. సాక్షులు లేదా ఆధారాలు లేని లోపాలు చార్జిషీట్‌లో ఉన్నాయని కోర్టు తెలిపింది. ప్రధాన నిందితుడు కుల్దీప్ సింగ్‌ను విడుదల చేస్తూ, అతనిపై ఎటువంటి ఆధారాలు లేనప్పుడు అతన్ని మొదటి నిందితుడిగా ఎందుకు ఇరికించడం ఆశ్చర్యకరమని న్యాయమూర్తి అన్నారు. మద్యం పాలసీని రూపొందించడం, అమలు చేయడంలో బాధ్యత వహించిన వ్యక్తిగా సిసోడియాపై, అతని ప్రమేయాన్ని చూపించే ఆధారాలు లేవని, ఎటువంటి రికవరీ కూడా లేదని కోర్టు పేర్కొంది. ఈ చార్జిషీట్‌లో అంతర్గత వైరుధ్యాలు ఉన్నాయని, కుట్ర సిద్ధాంతం మూలాలను తాకుతున్నాయని కోర్టు పేర్కొంది. కేజ్రీవాల్ గురించి, న్యాయమూర్తి ఎటువంటి స్పష్టమైన ఆధారాలు లేకుండా ఆయనను ఇరికించారని తేల్చారు, ముఖ్యంగా రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తికి సంబంధించినప్పుడు ఇది చట్ట నియమాలకు విరుద్ధంగా ఉంటుంది. ఏ విధమైన ప్రకటన లేదా ఆధారాలు లేకుండా ప్రాథమిక ఆధారాలు లేనందున, కుట్రలో కేజ్రీవాల్‌ను ఆరోపించడాన్ని నిలబెట్టలేమని న్యాయమూర్తి అన్నారు. సిబిఐ అధికారిపై శాఖాపరమైన విచారణకు కూడా కోర్టు ఆదేశించింది. సీనియర్ న్యాయవాది రెబెక్కా ఎం జాన్, న్యాయవాది వివేక్ జైన్‌తో కలిసి మనీష్ సిసోడియా తరపున హాజరయ్యారు. సీనియర్ న్యాయవాది ఎన్ హరిహరన్, న్యాయవాది ముదిత్ జైన్ కేజ్రీవాల్ తరపున హాజరయ్యారు. అభిషేక్ బోయిన్‌పల్లి తరపున న్యాయవాది సుమేర్ సింగ్ బొపరాయ్ హాజరయ్యారు.

ఇక ఢిల్లీ లిక్కర్ స్కామ్, మనీ లాండరింగ్ ఆరోపణలతో అరవింద్ కేజ్రీవాల్‌ను మార్చి 21, 2024న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్ చేసింది. ఈ కేసులో 9 సార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ కేజ్రీవాల్ విచారణకు హాజరు కాకపోవడంతో నేరుగా ఆయన ఇంటికి వెళ్లిన ఈడీ అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. అనంతరం తీహార్ జైలుకు తరలించారు. అయితే ఆయన తీహార్ జైల్లో ఉండగానే అవినీతి ఆరోపణ కేసులో జూన్ 26, 2024న సీబీఐ కూడా కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసింది. ఈ కేసులపై కేజ్రీవాల్‌ను సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం ఆయనకు 2024 సెప్టెంబర్‌లో బెయిల్ మంజూరు చేసింది. ఇప్పుడు తాజాగా ఈ కేసులో ఆయనకు ఎలాంటి సంబంధం లేదని రౌస్ అవెన్యూ కోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది. సిసోడియా దాదాపు 530 రోజులు జైలులో ఉన్నారు. అరవింద్ కేజ్రీవాల్ రెండు కాలాల్లో దాదాపు 156 రోజులు జైలులో గడిపారు. సిబిఐ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన తర్వాత, ఇడి కేసులో ఇప్పటికే తాత్కాలిక బెయిల్ పొందిన ఆయన చివరకు సెప్టెంబర్ 13, 2024న విడుదలయ్యారు.

ట్రయల్ కోర్టు తీర్పును హైకోర్టులో సవాలు చేసిన సిబిఐ మద్యం పాలసీ కుంభకోణానికి సంబంధించిన అవినీతి కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, ఇతరులను విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ట్రయల్ కోర్టు న్యాయమూర్తి ఈ ఉత్తర్వు జారీ చేసిన కొన్ని గంటల తర్వాత ఈ మేరకు రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. ట్రయల్ కోర్టు, దర్యాప్తులోని అనేక ముఖ్యమైన అంశాలను విస్మరించిందని, ఆ విషయాన్ని తగినంతగా పరిగణించలేదని కేంద్ర దర్యాప్తు సంస్థ పేర్కొంది.

**మోడీ, షాలు ఇప్పుడేం చెబుతారు: కేజ్రీవాల్**

ఢిల్లీ మద్యం కేసులోతనను నిరపరాధిగా స్థానిక రౌస్ ఎవెన్యూ కోర్టు ప్రకటించడం పట్ల ఢిల్లీ మాజీ సిఎం, ఆయన కేబినెట్లోని మాజీ మంత్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేసు నమోదైనప్పుడే.. తనకు ఎలాంటి సంబంధం లేదని, అసలు ఇది కేసే కాదని, ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయమని దీనిలో ఎవరికీ మేలు జరిగేలా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పానని కానీ, ఆనాడు తన మాటను ఎవరూ పట్టించుకోలేదని కేజ్రీవాల్ అన్నారు. అంతేకాదు. తనను అక్రమార్కుడిగా, అవినీతిపరుడిగా చిత్రీకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్‌షా, బిజెపి నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. నిజం ఇప్పటికి బయటకు వచ్చింది. కానీ, జరగాల్సిన అన్యాయం మాత్రం జరిగిపోయింది. ఇప్పుడు ఎవరు మాకు సమాధానం చెబుతారు? ప్రజలు ఇప్పటికైనా నిజాలు తెలుసుకోవాలి అని కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు వెలువరించిన తర్వాత.. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఊరేగింపుగా కేజ్రీవాల్‌ను తన నివాసానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మీడియా ముందు మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. ఆమ్ ఆద్మీ పార్టీని లేకుండా చేసేందుకు కుట్రలు చేశారని వ్యాఖ్యానించారు. ప్రజల్లోనూ తమ పరువు పోయేలా వ్యవహరించారని తెలిపారు. తనతోపాటు ఐదుగురు మంత్రులను జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందారని అన్నారు. కానీ, నిజాలు ఎప్పుడూ బయటకు వస్తాయని.. కాక పోతే తమ విషయంలో మరింత ఆలస్యమైందని అన్నారు. ఇప్పటికైనా కోర్టు తమను నిర్దోషులుగా పేర్కొనడం ఆనందంగా ఉందన్నారు. దర్యాప్తు సంస్థలకు తమకు నచ్చినట్టుగా, తమ ఇష్టాను సారంగా వినియోగించుకుంటున్నారని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. సిబిఐ, ఇడిల పరువు ఇప్పుడు పోయిందని, ఇప్పటికైనా దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా పనిచేయాలన్నారు. రాజకీయ వేధింపులకు సంస్థలను వినియోగించుకుంటున్న మోడీ, షాలు కళ్లు తెరవాలని, రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కొనాలని, దొడ్డిదారిలో కేసులు పెట్టడం సరికాదని అన్నారు.



## మాజీ మంత్రి బొత్స త్వరగా కోలుకోవాలి: పవన్ కళ్యాణ్

**విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ మేరకు జనసేన కార్యాలయం నుంచి విడుదలైన ప్రకటనలో పవన్ కళ్యాణ్ బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డానని పేర్కొన్నారు. ఆయనకు సంపూర్ణ ఆయు రారోగ్యాలు అందించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలిపారు.

## స్థానిక ఎన్నికలపై కౌంటర్ దాఖలు చేయండి

>> ప్రతివాదులుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్. రఘునందన రావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వు లు ఇచ్చింది. న్యాయవాది తాండవ యోగేష్ దాఖలు చేసిన ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణకు రాగా పార్టీ ఇన్ పర్సన్‌గా ఆయనే స్వయంగా వాదనలు వినిపించారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు ఏప్రిల్ 2, పట్టణ స్థానిక సంస్థలకు మార్చి 17తో కాలపరిమితి ముగియ నుంది. రాజ్యాంగంలోని అధికరణ 243ఇ (3), 243యు (3) ప్రకారం కాలపరిమితి ముగియడా నికి ముందే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంద్ది అని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొ కేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందు బీసీ జనాభా లెక్కింపునకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. 2023లో కమిషన్ ఏర్పాటైనప్పటికీ నివేదిక సమర్పించ లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కమిషన్‌ను పునర్ వ్యవస్థీకరించింది. బీసీ జనాభా లెక్కింపు ప్రక్రి య పూర్తి చేసిన తరువాతే స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరు తూ మరో పిల్ దాఖలైంది అని వివరించారు. వివరాలు జతచేసి కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. అంగీకరించిన ధర్మాసనం విచారణను మూడువారాలకు వాయిదా వేసింది.

## గురుకులంలో డయేరియా

>> వైద్య చికిత్స అందించగా హారిక ప్రవళిక, శృతి దేవిలను కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి చికిత్సనిమిత్తం తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనికి కారణము హాస్టల్లో కలుషిత నీరు, ఆహార పరిశుభ్రతపై తీవ్రమైన ఆరోపణలు, అనుమానాలు వస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతు న్నారు. విద్యార్థుల ఆరోగ్యం పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా పచ్చకామెర్లతో పదుల సంఖ్యలో విద్యార్థులు అస్వస్థకు గురైన కొద్ది నెలలోనే మరలా ఇలా జరగడంపై అక్కడ ఉద్యోగుల నిర్లక్ష్యమే కారణమని సిపిఎం నాయకులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వెంటనే అప్రమత్తమై అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

## ప్రేమ పెళ్లి విషాదం

>> మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లిలో చోటుచేసుకుంది. మండపేట రూరల్ సీఐ దొరరాజు ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. ద్వార పూడి వేములపల్లికి చెందిన పోలిపల్లి సూర్య ప్రకాష్, సమీపంలో ఉన్న జడ్.మేడపాడకు చెందిన అయినవిల్లి సంధ్య క్లాస్మేట్స్ దాంతో గత కొన్ని సంవత్సరాల నుండి ప్రేమించు కుంటున్నారు. సంధ్య రాయవరం మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీలా రిగా పనిచేస్తుంది. సూర్యప్రకాష్ ద్వారపూడిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో వస్త్ర వ్యాపారి. అయితే సంధ్య కుటుంబ సభ్యులకు వివాహం ఇష్టం లేదు. దాంతో గురువారం అన్నవరం వెళ్లి సత్యనారాయణ స్వామి సన్నిధిలో వివాహం చేసుకున్నారు. ఈ వివాహంపై అభ్యంతరం వ్యక్తం చేసిన సంధ్య సోదరులు. అయినవిల్లి చంద్రపాల్, గిరిబాబులు గురువారం రాత్రి పెళ్లి కొడుకు ఇంటికి వెళ్లి రాళ్లతో దాడి చేయడంతో పోలిపల్లి సూర్యప్రకాశ్ తీవ్ర గాయాలకు గురై మృతి చెందాడు. ఈ గొడవను చూసి స్థానిక యువకులు కొంతమంది అడ్డు వెళ్లి చంద్రపాల్, గిరిబాబులను పట్టుకొని అక్కడే కట్టివేసి పోలీసులకు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న మండపేట రూరల్ ఎస్సై వి కిషోర్, సీఐ దొరరాజు సిబ్బందితో వెంటనే ద్వారపూడి ఘటనా స్థలంని చేరుకుని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ విద్య సంఘటనా స్థలాన్ని పరిశీలించినారు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### వారం - వర్జ్యం

28-02-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
ద్వాదశి రా. 8.45
పునర్వసు ఉ.9.35
వర్జ్యం : సా.5.15-6.47
దు.ఉ.6.27-8.02
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం:** మీరు చేపట్టే కార్యక్రమములకు చిన్నచిన్న ఆటంకములు ఎదురం అవుతాయి. మిత్రుల కలయిక.

**వృషభం:** మీ అభిప్రాయములను కొన్ని సలహాలను, ఉన్నతాధికారులు సైతం పాటించడం మీకు సంతృప్తిని కలిగిస్తుంది.

**మిథునం:** గతములో మీరు పోగొట్టుకున్న ఉద్యోగమును తిరిగి పొందగలుగుతారు. ఆహారము పట్ల తగిన జాగ్రత్తలను తీసుకోండి.

**కర్కాటకం:** విధానపరమైన ముఖ్య విషయములయందు మీ అభిప్రాయాలలో రాజీ ధోరణి ఏర్పడుతుంది.

**సింహం:** ముఖ్య చర్చలు పురోగమిస్తాయి. వ్యవహారాలలో స్పష్టత లోపిస్తుంది. మాటమీద నిలబడే వ్యక్తిగా పేరును సంపాదిస్తారు.

**కన్య :** వ్యాపారంలో రొటేషన్స్ బాగున్నప్పటికీ లాభాలు మీరు ఆశించిన స్థాయిలో ఉండవు. చేతివృత్తి పనివారికి అనుకూలం.

**తుల :** ఒదిగి ఉంటేనే ప్రయోజనాలు చేతికి అందివస్తాయని భావిస్తారు. అదే విధంగా నడుచుకుంటారు. సోదరులను కలుస్తారు.

**వృశ్చికం:** ఇ-మెయిల్స్ ద్వారా లేక ఫోన్ సంభాషణ ద్వారా మీకు ఉపకరించే సమాచారం అందుకుంటారు. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

**ధనుస్సు:** రాజకీయ, పారిశ్రామిక వర్గాలవారికి అన్ని విధాల ప్రోత్సాహం లభిస్తుంది, తనఖా వస్తువులను విడిపిస్తారు.

**మకరం :** గృహం మార్పుచేయటం కానీ, మరమ్మత్తు చేయడం గానీ జరుగుతుంది. ఉద్యోగస్థులకు అనుకూలం.

**కుంభం:** పెండింగ్‌లో రిజిస్ట్రేషన్ పనిపైన దృష్టిని సారిస్తారు. విద్య, వారసత్వ వాణిజ్య రంగాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**మీనం:** జీవిత భాగస్వామితో సలహాలు సంప్రదింపులు సాగిస్తారు. మీ కష్ట సుఖాలను చర్చించుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## మార్చినెలాఖరులోనే టిటిడి బడ్జెట్!

**- నేడు సాధారణ సమావేశంలోనే పలు కీలక నిర్ణయాలు**

**తిరుమల,ఫిబ్రవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి 2026-27వార్షిక బడ్జెట్ రూపొందించే ప్రతిపాదనల సమావేశం వచ్చేనెల మార్చి నెలాఖరుతో జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. సుమారుగా 5,300కోట్లరూపాయలుపైగా అంచనాలతో వార్షిక పద్దును తయారు చేసేందుకు శుక్రవారం సుదీర్ఘంగా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,జెఇఒలు డాక్టర్ శరత్, వీరబ్రహ్మం, ఇతర అధికారులతోసమీక్షించారు. కొన్ని సంస్థ పరంగా విధాన నిర్ణయాలు తీసుకుని బడ్జెట్ అంచనాలు రూపొందించేందుకు సమయం లేకపోవడంతో మార్చి నెలాఖరుకు వాయిదావేసుకున్నట్లు సమాచారం. శనివారం జరిగే బోర్డు సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా రోజుకు ఐదులక్షల వరకు లడ్డూలు నాణ్యతతో, రుచిగా తయారుచేసేందుకు పోటులో సూపర్‌వైజర్ల నియామకం, ఒక వర్గం అర్చకులకు, టిటిడి కాంట్రాక్టు డ్రైవర్లకు టైమ్‌స్కేల్ వేతనాలు అమలుచేసే దిశగా బోర్డులో ఆమోదం తెలియజేయనున్నారు.ఇక లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా విషయంలో ఏకసభ్యకమిటీ నియామకంపై కూడా చర్చించే సూచనలు ఉన్నాయి.రానున్న వేసవికాలం సెలవులు,భక్తుల రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు, ,దాతల సహాకారంతో కాటేజీల పున:నిర్మాణం, దర్శనాలు వంటి అంశాలతోబాటు రానున్న మూడునెలలకు అవరమైన ముడిసరుకులు కొనుగోళ్ళు, విద్యుత్ బస్సుల వినియోగం, అలిపిరి వద్ద బేస్‌క్యాంప్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## తిరుపతిలో కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదు

**మున్సిపల్ మంత్రి నారాయణ**

**విజయవాడ,ఫిబ్రవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపట్టే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదని మున్సిపల్‌శాఖా మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేసారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణంపై అసెంబ్లీ లో సమాధానం ఇచ్చిన మంత్రి నారాయణ. మాట్లాడుతూ తిరుపతి లో 4.5 లక్షల జనాభా ఉన్నారని వివరించారు.ప్రతిరోజూ 75,000 నుంచి లక్ష మంది తిరుపతికి వస్తుంటారన్నారు..ప్రతిరోజూ 54.5 లీలిడీ ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటాయి.మొత్తం 408.4 కిమీ ల పరిధిలో యూజీడీ అవసరం ఉంది.ప్రస్తుతం 284.3 కిమీ పరిధిలో నెట్వర్క్ ఉండగా...మరో 125 కిమీ చేయాల్సి ఉంది అన్నారు.పాత నెట్వర్క్ లో 60 కి.మీ పరిధిలో మార్చాల్సిన అవసరం ఉంది అన్నారు.పాత వాటిని మార్చడం తో పాటు కొత్తగా లైన్ వేయాలంటే 152.45 కోట్లు అవసరం అని అంచనా వేశారు.అన్నారు.పాత వాటిలో 7.5 కి.మీ లైన్ మార్చేందుకు మార్చిలో టెండర్లు పిలుస్తున్నాంఅన్నారు.మిగతా ప్రాంతంలో గెబిడీ కోసం నిధులపై కేంద్రం తో సంప్రదించి ముందుకెళ్తాం.అన్నారు..రాష్ట్రవ్యాప్తంగా21,170 కి.మీ మేర అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మించాల్సి ఉంది అన్నారు.దీని కోసం 24,000 కోట్లు అవసరం అవుతుంది అన్నారు..ప్రస్తుతం 3,334 కి.మీ మేర యూజీడీ వ్యవస్థ ఉంది.అన్నారు.మరో 2,860 కి.మీ మేర పనులు జరుగుతున్నాయిఅన్నారు.స్వచ్ఛ ఆంధ్ర సాధించాలంటే అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పూర్తి చేయాల్సి ఉంది.అన్నారు.

## జనసేన కేంద్ర కార్యాలయంలోకి చొరబడిన ఆగంతకుడు

**అదుపులోకి తీసుకున్న రోప్ పార్టీ సిబ్బంది**

**విజయవాడ,ఫిబ్రవరి 27,ప్రభాతవార్తప్రతినిధి :** జనసేన కేంద్ర కార్యాలయంలోకి చొరబడి ఓ వ్యక్తి హల్ చల్ చేశాడు. నేరుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయంలోకి వెళ్లాడు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నించడంతో వాళ్లను పక్కకు నెట్టి అక్కడే ఉన్న కర్రతో పవన్ కల్యాణ్ వాహన శ్రేణిలోని కార్ల అద్దాలు ధ్వంసం చేశాడు. రోప్ పార్టీ సిబ్బంది అతనిని అదుపులోకి తీసుకుని మంగళగిరి పోలీసులకు అప్పగించారు.
జనసేన కేంద్ర కార్యాలయంలోకి చొరబడిన వ్యక్తిని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన నీలాద్రిగా పోలీసులు గుర్తించారు. ఇవాళ ఉదయం 9:30 గంటల సమయంలో కార్యాలయంలోకి చొరబడటమే కాకుండా అక్కడి ప్రాంగణంలో కార్ల అద్దాలు ధ్వంసం చేశాడు. విజయవాడ నుంచి ఆటోలో వచ్చి నీలాద్రి నేరుగా పవన్ కల్యాణ్ సీఎస్ ఓ గదిలోకి వెళ్లారు. అక్కడ సుమారు పావుగంట సేపు అటూ ఇటూ తిరిగారు. కాసేపటికి ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నించడంతో వాళ్లను పక్కకు తోసి అక్కడే ఉన్న కర్రతో ఉపముఖ్యమంత్రి వాహన శ్రేణిలోని కార్ల అద్దాలు ధ్వంసం చేశాడు. రోప్ పార్టీ సిబ్బంది అతనిని అదుపులోకి తీసుకుని మంగళగిరి పోలీసులకు అప్పగించారు. సమాచారం అందుకున్న ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళగిరి స్టేషన్‌కు వచ్చారు. నీలాద్రిని పోలీసులు ప్రశ్నించగా నిందితుడిని పొంతనలేని సమాధానం చెప్పాడు. తనకు ఇది మూడో జన్మని పవన్ కల్యాణ్ ఆఫీసుకు అమ్మవారే పంపించారని నిందితుడు తెలిపాడు. దీంతో అతను మతిస్థిమితం లేని వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ వ్యక్తి ఎవరు? ఎందుకు అలా అలా చేశాడనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దీని వెనుక ఏమైనా రాజకీయ కుట్ర ఉందా అనే కోణంలో ఐజీ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు.



మంత్రి మత్స్యకార సంఘాల సమాఖ్యలో వివిధ భాగాల నేతలకు ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

## మత్స్యకార వర్గాల అభివృద్ధి లక్ష్యంగా కలిసి పని చేద్దాం : మంత్రి కొల్లు రవీంద్ర

**- మత్స్యకారులు వేటకు మాత్రమే పరిమితమవుతున్నారు**

**విజయవాడ,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఉన్న మత్స్యకార వర్గాలన్నీ ఏకతాటిపైకి వచ్చి కలిసి పని చేసినపుడే అభివృద్ధి దిశగా అడుగులు వేయగలమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విజయవాడలోని బసవ పున్నయ్య మెమోరియల్ హాల్లో జరిగిన సంప్రదాయ మత్స్యకార సంఘాల సమాఖ్య రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాల వారీగా కార్యవర్గం ఏర్పాటు చేసుకోవడం ద్వారా సంఘాన్ని బలోపేతం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుందాం. ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చిన నడకుదిటి నరసింహారావు గారు మత్స్యకారులందరినీ ఏకం చేయడం లక్ష్యంగా 2017లో ఈ సంఘాన్ని ఏర్పాటు చేశారు. గతంలో నరసింహారావు గారు మంత్రిగా ఉన్న సమయంలోనే మత్స్య కారులకు డీజిల్ సబ్సిడీ, ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూల్స్, వేట నిషేధ సమయంలో భృతి అమలు చేశారు. అదే సమయంలో మత్స్య కారుల కోసం బందరు హార్బర్‌కు శంకుస్థాపన చేశారు. వారి కృషికి గౌరవంగా బందరు హార్బర్‌కు నడకుదిటి నరసింహారావు పేరు పెడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. త్వరలోనే అక్కడ కాంస్య విగ్రహం కూడా ఏర్పాటు చేసుకుంటాం. మన లక్ష్యం మన వర్గాల అభివృద్ధి. జిల్లాల వారీగా మత్స్యకారుల వివరాలను సేకరించి, వారి సమస్యలను తెలుసుకుని బలోపేతానికి చర్యలు తీసుకోవాలి. అవసరమైతే సంఘం తరఫున సభ్యత్వం ఇచ్చి, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుద్దాం. ఏం జరిగినా మేమున్నాం అనే నమ్మకం కలిగిద్దాం. మత్స్యకార వర్గాల జనాభా ఇంత భారీగా ఉన్నప్పటికీ.. ఉద్యోగాలు, రాజకీయాల్లో మన స్థానం ఎం? మన పిల్లలకు ఉచితంగా శిక్షణ అందించే ఏర్పాటు చేద్దాం. పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలనే కోరిక ఉన్న వారికి ప్రభుత్వం నుండి అందే తోడ్పాటుకు దారి చూపిద్దాం. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ..
మనం వినియోగించుకోలేక పోతున్నాం. ఫిష్ సీడ్ తయారీలో మత్స్యకార వర్గాల వారిలో ఎంత మంది ఉన్నారు? ఫిష్ ప్రాసెసింగ్ రంగంలో ఎంత మంది స్థిరపడ్డారు? మనకు అపారమైన అవకాశాలు ఉన్నప్పటికీ మనం సద్వినియోగం చేసుకోలేకపోతున్నాం. ప్రభుత్వ పథకాల గురించి ప్రతి ఒక్కరికీ వివరిద్దాం. సబ్సిడీలు అందేలా సహకారం అందిద్దాం. అప్పుడే అందరం ఎదుగుతామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## తిరుపతి లడ్డూకు ప్రపంచ ఖ్యాతి:లొల్లితో అపఖ్యాతి

**ప్రాంతీయ పార్టీలతో సంక్షోభంలో సంక్షేమం**

**మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చింతామోహన్

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త** తిరుపతి లడ్డు అంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తుల్లో ఎంతో భక్తి భావం ఉందని నేడు నిత్యం లొల్లితో అపఖ్యాతి వస్తుందని భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారౌతారని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతామోహన్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన శ్రీకాళహస్తిలో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తిరుమలేశుని పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ప్రాంతీయ పార్టీలతో ప్రజల సంక్షేమం సంక్షభంలో పడిందని చింతామోహన్ అభిప్రాయపడ్డారు.కేంద్రంలో కూటమి ప్రభుత్వం అమెరికాతో ఒప్పందాలు భారత దేశానికి తీరని నష్టం కల్గిస్తుందని ధ్వజమెత్తారు. నరేంద్రమోదీ పాలన అంతా విదేశీ పర్యటనలకే సరిపోతుందని ఎద్దెవా చేసారు. భెల్ ప్రాజెక్టుకు దిక్కులేదు:నడికుడి రైల్వేలైన్ కేటాయింపులకే పరిమితం శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో తాము అధికారంలో ఉన్నపుడు ఈ ప్రాంత ప్రజల కు ఉద్యోగవకాశాల కోసం మన్నవరం వద్ద 6వేల కోట్లుతో భెల్,ఎన్‌టిపిసి ప్రాజెక్టును తెచ్చి పనులు ప్రారంభించామని కానీ 17 సంవత్సరాలు దాటిని అతీగతీ లేదని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ప్రాజెక్టును కేంద్రం అటకెక్కించిందని దానిని గురించి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించటం లేదని చింతామోహన్ ప్రశ్నించారు. ఇక్కడ పాలకులు పరిశ్రమను కేంద్రం మెడలు వంచి సాధించాల్సింది మాని ఇక్కడ పరిశ్రమకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకుంటామని ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పటం విడ్డూరం అన్నారు.ఈ పరిశ్రమ ఇప్పటకే కేంద్రంలోని ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ధారాదత్తం చేసిందన్నారు. మరి ఈ జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎందుకు దీనిని గురించి పట్టించుకోవటం లేదని చింతామోహన్ ప్రశ్నించారు. ఇక ఇక్కడ గెలిచిన కూటమి ఎంఎల్‌ఏ ఎన్నో సార్లు డిల్లికి వెళుతున్నారు. ఆయన ఎందుకు దీనిని గురించి కేంద్రంలో నిలదీయలేదని ప్రశ్నించారు. ఇక శ్రీకాళహస్తి-నడికుడి రైల్వే లైన్‌కు ప్రతి ఏడాది కూటమి ప్రభుత్వం వందలకోట్లు కేటాయిస్తున్నారని కానీ పనులు ఇంచి కూడా జరగటం లేదని ం ఆవేదన వ్యక్తం చేసారు. దేశంలోని ప్రాంతీయ పార్టీల పాలనలో సంక్షేమం సంక్షోభంగా మారిందని చింతామోహన్ ఆవేదన వ్యక్తం చేసారు.కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఇందిరాగాంధీ హాయంలో ఏర్పాటు చేసిన ఎస్ సి కార్పొరేషన్, బిసి కార్పొరేషన్ ఎస్‌టి కార్పొరేషన్, ఓబిసి కార్పొరేషన్‌లు మూత దిశగా పయనింపజేస్తున్నారని ధ్వజమెత్తారు. నిరుపేదలకు ఆర్థిక సహాయం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నిరుపేదలకు ఉన్నత చదువులు అరచేతిలో స్వర్గంగా మారిందన్నారు. పేదలకు గుండెజబ్బు వస్తే చనిపోవాల్సిందే. ఆరోగ్యశ్రీకి అనారోగ్యం చేసిందన్నారు.నేడు ప్రతి ఇంటిలో నిరుద్యోగం రాజ్యమేలుతుందన్నారు.

## మార్చి 4న స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉద్యోగ మేళా

**తిరుపతి,ఫిబ్రవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పిడిసిఎల్) కార్పొరేట్ కార్యాలయంలో మార్చి 4వ తేదీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి శుక్రవారం తెలిపారు.ఎస్పిడిసిఎల్ లో పొరుగుసేవల కింద ఉద్యోగాల కోసం అభ్యర్థులు ప్రజా ప్రతినిధులు, అధికారుల ద్వారా ఒత్తిడి తీసుకు వస్తున్నారని తెలిపారు. ఎస్పిడిసిఎల్ లో ఉద్యోగ నియామకాలకు అవకాశం లేదని స్పష్టంగా తెలియజేస్తున్న ప్పటికీ అభ్యర్థులు ప్రజాప్రతినిధులతో ఒత్తిడి తెస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ నియామకాల కోసం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపిఎస్‌ఎస్ డిసి)ను సంప్రదించ ామని తెలియజేశారు.. ప్రైవేటు సంస్థల ద్వారా ఉద్యోగ నియామక ప్రక్రియను చేపట్టేందుకు ఎపిఎస్‌ఎస్‌డిసి ముందుకు వచ్చిన నేపథ్యంలో వివిధ ప్రైవేటు సంస్థల ప్రతినిధులు మార్చి 4వ తేదీ తిరుపతిలోని ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగే ఉద్యోగ మేళాకు హాజరై అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. అర్హులైన అభ్యర్థులను వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పదవతరగతి, ఐటిఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ/బి.టెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ ముఖాముఖికి హాజరై ప్రైవేటు కంపెనీలైన డిక్సన్ టెక్నాలజీస్, హీరో మోటాకార్ప్, అమరరాజా గ్రూప్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, ఎనర్జీ హార్వెస్ట్, అపోలో ఫార్మసీ, టివిఎస్ సుందరం ఫాస్ట్నర్స్, ఇండో ఎంఐఎమ్, డైకిన్, జెఎస్‌డబ్ల్యు సిమెంట్స్, రామ్ కో సిమెంట్స్ తదితర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని ఆయన తెలిపారు.

## పారిశ్రామిక అభివృద్ధిలో ఏపి ముందంజలో ఉంది : మంత్రి టిజి భరత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టి.జి.భరత్

**సచివాలయం,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త :** పారిశ్రామిక అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టిజి భరత్ అన్నారు.శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డిసెంబర్ 11న ఆర్‌బిఐ విడుదల చేసిన హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్,రిపోర్టుపై వైసీపి సభ్యులు ఈ రిపోర్టును సరిగ్గా హోంవర్క్ చేయకుండా తమకు అనుకూలంగా ఉందని భావించి ప్రస్తావించారని కానీ,వాస్తవాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని మంత్రి తెలిపారు.450పేజీల రిపోర్టును వివరించగా అధ్యాయనం చేసిన తర్వాత కీలక వాస్తవాలు బయటపట్టాయని టిజి భరత్ వెల్లడించారు.2019-20లో ఆంధ్రప్రదేశ్‌లో 16,924పరిశ్రమలు ఉండగా,2023-24నాటికి కేవలం 16,011కు తగ్గిపోయాయని అంటే వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రభుత్వ హాయాంలో 913కంపెనీలు వెళ్ళిపోయాయని ఆయన చెప్పారు.ఇతర రాష్ట్రాలన్నీ పారిశ్రామిక వృద్ధిని సాధించగా ఏపి మాత్రం క్షీణత చూడడం బాధాకరమని మంత్రి అన్నారు.వైసీపీ సభ్యులు 2019-24కాలం ఫాంటాస్టిక్ అని చెప్పడం సెల్ఫ్‌గోల్ వేసుకోవడమేనని ఆయన వ్యంగ్యంగా అన్నారు.2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిందని మంత్రి తెలిపారు.ఎన్నికల ముందు వాగ్ధానం చేసిన 20లక్షల ఉద్యోగాలను సృష్టించడానికి ముఖ్యమంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ప్రత్యేక జీవో ఏర్పాటు చేశామని,పార్టనర్‌షిప్ సమ్మిట్ మరియు క్యాబినెట్ క్లియరెన్స్ పొందిన ప్రాజెక్టులతో సహా రూ.20లక్షల కోట్లు పెట్టుబడులు రాబోతున్నాయని ఆయన వెల్లడించారు. ఫోర్బ్స్ డేటా ప్రకారం ఏప్రిల్ 2025నుండి డిసెంబర్ 2025 వరకు 9నెలల్లో రూ.ఒక కోటి పైబడిన పెట్టుబడల ఆకర్షణలో ఏపి 25.3శాతంతో అగ్రస్థానంలో నిలిచిందని టిజి భరత్ గర్వంగా తెలిపారు. అర్సెల్లార్ మిట్టల్ ప్రాజెక్టు పునాది వేడుకను వచ్చే నెలలో నిర్వహించనున్నామని భారత్ పెట్రోలియం ప్రాజెక్టు 2024లోనే ఖరారైందని,పిసిబిఎల్ కంపెనీ 2019-24కాలంలో కర్నాటకకు వెళ్ళిపోయి ఇప్పుడు చంద్రబాబు తిరిగి రావడంతో ఏపికి తిరిగి వస్తున్నారని,ప్రీమియర్ ఇంజనీరింగ్ కంపెనీ రూ.50,000కోట్లు మార్కెట్ క్యాప్‌తో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు మారిందని మంత్రి వెల్లడించారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం వల్ల సాధ్యమైందని,యువత ఎన్‌డిఏ కూటమిపై అపారమైన నమ్మకం ఉందని మంత్రి అన్నారు.అర్‌బిఐ రిపోర్టు కాపీలను సమర్పిస్తున్నామని,వాస్తవాలు రుజువులతో సహా అందుబాటులో ఉన్నాయని,వైసీపీ ని ప్రజలు ఎప్పటికీ నమ్మవద్దని చెప్పారు.

## ఆయేషామీరా అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగించిన సిబిఐ

**తెనాలిలో ఆయేషా శరీర అవశేషాలకు ఇస్లాం పద్ధతిలో అంత్యక్రియలు**

**భారీగా పాల్గొన్న ప్రజలు, షేమ్ షేమ్ సిబిఐ అంటూ నినాదాలు**



**గుంటూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన బి ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసు విచారణ ఆమె శరీర అవశేషాల అంత్యక్రియలతో ముగిసింది. 19 ఏళ్ల సుదీర్ఘ విచారణ తర్వాత విజయవాడలోని సీబీఐ కోర్టు నిందితులను గుర్తించడానికి తగిన ఆధారాలు లేవని కేసును మూసివేసింది.గతంలో రీ పోస్టుమార్టం సమయంలో సేకరించి భద్రపరిచిన ఆయేషా మీరా శరీర అవశేషాలను ఆమె తల్లిదండ్రులకు అప్పగించాలని కోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో శుక్రవారం అయేషా శరీర అవశేషాలను తల్లిదండ్రులు సయ్యద్ ఇక్బాల్ బాషా, షంషాద్ బేగంలకు విజయవాడలోని సిబిఐ ప్రత్యేక కోర్టు అందజేసింది. ఆయేషా శరీర అవశేషాలను అందుకున్న ఆమె తల్లిదండ్రులు తీవ్ర భావోద్వేగానికి గురై విలపించారు. అవశేషాలను విజయవాడ నుండి ప్రత్యేక వాహనంలో స్వస్థలం తెనాలికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని వీఎస్‌ఆర్ కాలేజీ వద్ద నుండి చెంచుపేట ముస్లిం ఖబరస్తాన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయేషా మీరాకు అంతిమ యాత్రలో ప్రజా సంఘాలు , భారీ ఎత్తున ముస్లిం మత పెద్దలు , ప్రజలు పాల్గొన్నారు. ఖననం చేసే ఈద్గా ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. ప్రజలందరూ షేమ్ షేమ్ సిబిఐ అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఈద్గా వద్ద తెనాలి డిఎస్పి బి. జనార్దన్ రావు ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ముస్లిం మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించి ఆయేషా శరీర అవశేషాలను తిరిగి ఖననం చేశారు.

## కర్నూలుప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కాశ్మీర్ విద్యార్థినులకు వేధింపులు

**- సిఎం చంద్రబాబుకు కాశ్మీర్ స్టూడెంట్స్ అసోసియేషన్ లేఖ - రంజాన్ ఏర్పాట్లు, హిజాబ్‌పై ఆంక్షలు విధించారని ఆరోపణ**

**విజయవాడ,ఫిబ్రవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో చదువుతున్న కశ్మీరీ విద్యార్థినులపై వేధింపులు జరుగుతున్నాయని, ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని జమ్మూ కశ్మీర్ స్టూడెంట్స్ అసోసియేషన్ (జేకేఎస్ఏ) ఏపీ సీఎం చంద్రబాబు కోరింది. రంజాన్ మాసంలో ప్రత్యేక ఏర్పాట్లు నిరాకరించడం, హిజాబ్ ధరించవద్దని ఒత్తిడి చేయడం, మాటలతో దూషించడం వంటివి చేస్తున్నారని ఆరోపిస్తూ ఇవాళ సీఎంకు లేఖ రాసింది. జేకేఎస్ఏ జాతీయ కన్వీనర్ నాసిర్ ఖుహెమీ తెలిపిన వివరాల ప్రకారం... కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న దాదాపు 24 మంది కశ్మీరీ విద్యార్థినులు ఈ ఫిర్యాదులు చేశారు. వీరిలో చాలామంది ప్రధానమంత్రి స్కాలర్‌షిప్ స్కీమ్ (పీఎంఎస్ఎస్) కింద చదువుతున్న యువతులే. రంజాన్ మాసంలో సెహ్రీ, ఇఫ్తార్ కోసం ఏర్పాట్లు చేయమని కోరగా, "మతపరమైన ఆచారాలు పాటించాలనుకుంటే కాలేజీలో ఎందుకు చేరారు?" అని యాజమాన్యం ప్రశ్నించిందని విద్యార్థులు ఆరోపించారు. తమ కశ్మీరీ గుర్తింపు, మతం ఆధారంగా లక్ష్యంగా చేసుకుని వివక్ష చూపు తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

# తిరుమల సమాచారం

## మార్చి 19న ఉగాది ఆస్థానం - విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు



**తిరుమల,ఫిబ్రవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మార్చి 19వతేదీ గురువారం తెలుగు నూతన "పరాభవనామ సంవత్సర"ఉగాది పర్వదిన ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 19వతేదీ ఆలయంలో విఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దు చేసింది. అలాగే మార్చి 18న విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సులేఖలు స్వీకరించబడవు. శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన ఆనందనిలయానికి ముందు బంగారువాకిలిలో 19వతేదీ గురువారం తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతం అనంతరం ఆలయ శుద్ధి చేస్తారు. ఆ రోజు ఉదయం 6గంటలకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్ప స్వామివారికి ,విశ్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరుగుతుంది. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు విమానప్రాకారం,ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తరువాత వెంకన్న మూలవిరాట్టుకు ,ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. ఆ తరువాత పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలివద్ద ఆగమ పండితులు, అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి జరిగే ఆర్జితసేవలు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం టిటిడి రద్దు చేసింది.

## టిటిడి గోసంరక్షణట్రస్ట్‌కు రూ.కోటి విరాళం



**తిరుమల,పిబ్రవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టుకు దాత భూరీ విరాళమిచ్చారు. హైదరాబాద్‌కు చెందిన రాచమల్లు వెంకట సుజిత శుక్రవారం కోటి రూపాయలు విరా ళం చెక్కును టిటిడి చైర్మన్ .ఆర్. నాయు డుకు అందజేశారు. దాతను చైర్మన్ అభినందించారు.

## తిరుమలలో పెరిగిన ఎండవేడి

**- భగభగలతో భక్తులకు ఉపశమనం కోసం కూల్‌పెయింట్**



**తిరుమల,ఫిబ్రవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి కాలం సరిగా అరంభం కాకముందే సప్తగిరులపై సూర్యుని ప్రతాపం భగభగలకు భక్తులు విలవిల్లాడిపోతున్నారు. సాధారణంగా తిరుమలకొండపై వేసవిలోనూ భిన్న వాతావరణం ఉంటుంది. అలాంటిది గత నాలుగేళ్ళుగా తిరుపతి ఉష్ణోగ్రతలు తిరుమలలోనూ నమోదవుతుండటం పర్యావరణ కాలుష్యం కారణంగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మార్చి నెల మొదలుకాకముందే పిబ్రవరి ఆఖరులో సూర్యుని వేడి తిరుమలపై తీవ్రంగా చూపుతోంది. 38డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో భక్తులకు ఎండవేడి తగులుతోంది. దీని నుండి ఉపశమనానికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆలయం ముందుభాగం, పరిసరాల్లో ,ఆలయ మాఢవీధుల్లో తెల్లని కూల్‌పెయింట్ వేయాలని,మాఢవీధుల్లో నీరు వెదజల్లాలని సూచించారు. కార్పెట్లు పరచి ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు తరచూ నీళ్ళట్యాంకర్ల పైపులతో నీటిని చల్లాలని ఆదేశించారు. తిరుమలలో ఆలయం పరిసరాల్లో, మాఢవీధుల్లో భక్తులు, సిబ్బంది, ఉద్యోగులు పాదరక్షలు ధరించరు. ఇప్పుడు గదుల నుండి స్వామివారి దర్శనానికి వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ చేరుకునే ముందు భక్తులు పాదరక్షలు లేకుండానే వస్తుంటారు. ఆలయం వెలుపలకు వచ్చిన సమయంలోనూ ఆలయం ముందు, అఖిలాండం వద్ద, బేడి ఆంజనేయస్వామి ఆలయం పరిసరాల్లో పాదరక్షలు ధరించడానికి లేదు. ఇక్కడ భక్తులు పాదరక్షలు లేకుండా నడుస్తుండటంతో పాదాలు ఎండకు చుర్రుమంటున్నాయి. దీంతో భక్తులకు వేడి తెలియకుండా కూల్‌పెయింట్ వేసే చర్యలు తీసుకుంటున్నారు. పూర్తిగా ఎండవేడిమినుంచి ఉపశమనం కలిగించేలా చూస్తుండటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## మార్చి 17 నుండి కోదండరాముని బ్రహ్మోత్సవాలు



**తిరుమల,పిబ్రవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 17 నుండి 25వ తేదీ వరకు జరుగనున్నాయి.ఇందులో భాగంగా ఆలయంలో మార్చి 13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, మార్చి 16న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 8:30 గంటల వరకు వాహన సేవలు నిర్వహిస్తారు. వార్షికబ్రహ్మోత్సవాల్లో మార్చి 17న ఉదయం 8గంటలకు మేషలగ్నంలో ధ్వజారోహణం , రాత్రి పెద్దశేష వాహనం,18న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం,19న ఉదయం సింహ వాహనం,మధ్యాహ్నం 3 గంటలనుండి 4 గంటల వరకు ఆలయంలో ఉగాది ఆస్థానం చేపడతారు.ఆ రోజు రాత్రి ముత్యపుపందిరి వాహనం,20వతేదీ ఉదయం కల్పవృక్ష వాహనం,రాత్రికిసర్వభూపాల వాహనం,21న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి గరుడ వాహనం ఉంటుంది. 22న ఉదయం హనుమంత వాహనం, మధ్యాహ్నం 3గంటలకు వసంతోత్సవం రాత్రి గజ వాహనం, 23న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం,24న ఉదయం కోదండరాముని రథోత్సవం ,రాత్రి చివరగా అశ్వవాహనం జరుగుతాయి. మార్చి25న ఉదయం 10గంటలకు చక్రస్నానం ,రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

## ఉభయదేవేరులతో శ్రీకృష్ణస్వామి తెప్పపై విహారం



**తిరుమల,ఫిబ్రవరి 27ప్రభాత వార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులు పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ సేదదీర డానికి ఐదురోజులు జరిపించే సాలకట్ల తెప్పోత్సవాల్లో రెండవరోజు శుక్రవారం రాత్రి శ్రీకృష్ణస్వామిగా అభయమిచ్చారు.. సాయంత్రం నిత్యకైంకర్యాలు పూర్తిచేసుకున్న తరువాత ఆలయం నుండి రుక్మిణీసమేత శ్రీకృష్ణస్వామి మాఢవీధుల్లో ఊరేగుతూ తెప్పపై మూడుచుట్లు విహరించారు. పెద్దజీయంగారు,చిన్నజీయంగారు, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు కర్పూర హారతులిచ్చి తెప్పను కదిలించారు. భక్తులు గోవిందనామస్మరణలు చేయగా దేవదేవుడు అధిరోహించిన తెప్ప పుష్కరిణిలో పవిత్రమైన తీర్థంలో కదిలింది. అన్నమయ్య ప్రాజెక్టు కళాకారులు సంకీర్తనలు ఆలపించగా భక్తులు స్వరం కలిపారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION
'E'Procurement Notice N0.49/VMC/CDB/2025-26,Dt.27-02-2026
Roads,Drain,Culvert,Water supply,repairs,maintenance works, summer action plan works (Total 132works)-Est.Amount Rs.1946.58 Lakhs.
All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of
Further details and any corrigendum can be seen @www.tender.apeprocurement.gov.in.
S/d
For COMMISSIONER

వార్త

విజయానికి రెండు ప్రధాన సూత్రాలున్నాయి. ఆచరణకు ముందు ఆలోచించాలి. ఆ తరువాత ఆలోచనలు ఆత్మవిశ్వాసంతో ఆచరణలో పెట్టాలి.

-రవీంద్రనాథ్ ఠాగూర్

# పాఠ్యాంశాలకు చెద?

సమాజంలో అవినీతిని ఎండగట్టేందుకు, అవినీతి పరులను శిక్షించేందుకు వేర్వేరు విభాగాలున్నట్లే న్యాయవ్యవస్థలోనూ అంతర్గత విభాగాలు, దర్యాప్తు, విచారణ చర్చలు ఉంటాయి. అన్నిటికన్నా ఏ దేశంలోనైనా న్యాయాన్ని నిలబెట్టడం కోసం ఆ వ్యవస్థ తన శక్తియుక్తులన్నీ ధారపోస్తుంది. న్యాయమూర్తులు కూడా సమాజంలోని వారే అయినా తమ వ్యక్తిగత సౌఖ్యాలు, మానవ సంబంధాలను సైతం వదులుకొని సమాజానికి దూరంగా ఉండగలగడమే వారి ఔన్నత్యానికి ప్రతీక. అలాంటి న్యాయవ్యవస్థ గౌరవాన్ని, ఔన్నత్యాన్ని నిలబెట్టే పనిలో సుప్రీంకోర్టు బాధ్యత తీసుకొంది. నిన్నగాక మొన్న ఎన్‌సిఇఆర్ 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో చొరబడిన 'న్యాయ వ్యవస్థలో అవినీతి' అనే పాఠ్యాంశంపై న్యాయవ్యవస్థ యావత్తూ ముక్తకంఠంతో అందులోని అంశాలు, విషయాలపై ధ్వజమెత్తింది. అందులో భాగంగానే ఆ పాఠ్య పుస్తకాన్ని నిషేధిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం నిషేధించింది. ఆ పాఠ్యపుస్తకం ఇక ఎక్కడా ఏ రూపంలోనూ కనపడడానికి వీల్లేదు. కేంద్ర ప్రభుత్వం అధీనంలోనే ఎన్‌సిఇఆర్‌టి నడుస్తోంది. ఆ పుస్తక సంస్థ తప్పొప్పులకు బాధ్యత వహించాల్సిన కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పింది. దేశ ప్రతిష్ట ఇనుమడింప చేయాల్సిన ఒక ప్రధానమైన విద్యావ్యవస్థలోని ఒక విభాగం ఇలాంటి తప్పిదాలకు పాల్పడడం క్షమార్హం కానేకాదు. అందుకే సుప్రీం ధర్మాసనం తమ వ్యవస్థను నలుగురిలో నవ్వులపాలు చేసేందుకు కారణమైన వ్యవస్థపై ధిక్కార చర్చలు తీసుకునేందుకు నడుంకట్టింది. ధిక్కారంపై చర్యలు ఎందుకు తీసుకోరాదంటూ సుప్రీంకోర్టు విద్యా కార్యదర్శి, ఎన్‌సిఇ ఆర్టీ ఛైర్‌పర్సన్‌ను సంజాయిషీ కోరింది. ప్రధాన మంత్రి కూడా ఈ అంశంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముసాయిదా అధ్యాయాన్ని రూపొందించిన విద్యావేత్తలపై చర్యలు తీసుకుంటామని కేంద్రవిద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హామీ కూడా ఇచ్చారు. కేవలం ఇద్దరు విద్యావేత్తల క్షమార్హం కాని పాఠ్యాంశ రూపకల్పన జరిగిందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు నివేదించింది. న్యాయవ్యవస్థపై ఆన్‌లైన్‌లో ప్రచార దుర్వినియోగానికి పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని అలహాబాద్ హైకోర్టు సోషల్ మీడియా వినియోగదారులను హెచ్చరించింది. పాఠ్యపుస్తకం 'ఇ' వెర్షన్ అప్‌లోడ్ చేయలేదని ఎన్.సి.ఇ.ఆర్.టి చెబుతోంది. చాలా కాపీలను రీకాల్ చేసినట్లు, కేవలం 32 కాపీలు మాత్రమే జనంలోకి వెళ్లాయని స్పష్టం చేస్తోంది. న్యాయ వ్యవస్థ గౌరవాన్ని చులకన చేయడం, కించపరిచే వ్యాఖ్యలున్నందున దానికి కారణమైన వారిని వదలబోమని, ప్రభుత్వం చెప్పిన క్షమాపణలను అంగీకరించేది లేదని సుప్రీంకోర్టు వివరించింది.

వ్యవస్థపై తప్పుడు ముద్రవేసి క్షమాపణలడగడం సరైనది కాదని, జరిగినది పొరపాటు కాదని ఉద్దేశపూర్వకంగా చేసినదేనని సుప్రీంకోర్టు బెంచి స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలిలు ఈ ధర్మాసనంలో ఉన్నారు. వారు ఈ పాఠ్యాంశంలోని పూర్తి విషయాలను ఆకళింపు చేసుకొని మరీ వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థ విశిష్ట చరిత్రను వివరించాల్సిందిపోయి వ్యవస్థ భ్రష్టు పడుతోందంటూ, వాటి ప్రతిష్టను కించపరిచేలా రాసారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి వెనుక ఉన్న వ్యక్తులెవరో తాము తెలుసుకోవాలనుకుంటున్నామని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. భారతీయ సమాజంలో న్యాయ వ్యవస్థ ఔన్నత్యానికి మించింది లేదు. ఇటీవల నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) ఎనిమిదో తరగతి పాఠ్యాంశంలో చోటు చేసుకున్న 'న్యాయవ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంతోమందివిద్యావేత్తలు, మేధావులచే రూపకల్పన చేసిన ఈ పుస్తకంలో అవాంఛనీయ పాఠ్యాంశాలను జోడించడం ఆశ్చర్యమే మరి. ఇలాంటి అంశాలను 'రేపటి పౌరుల ' పాఠ్యాంశాల్లో చొప్పించడం ఏవిధంగానూ క్షమార్హం కాదు. ప్రఖ్యాత న్యాయవాదులు కపిల్ సిబాల్ అభిషేక్ మను సంఘ్వీలు సుప్రీం దృష్టికి తెచ్చారు. ఈ మధ్యనే న్యాయవ్యవస్థలోని అవినీతి ఆరోపణలకు సంబంధించి 2016 నుంచి 2025 మధ్య సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ జడ్జిలపై సిజెఐ కార్యాలయానికి మొత్తం 7,528 ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడైంది. అవన్నీ అభియోగాలు మాత్రమే. వాటిలో కొన్ని రుజువయ్యే అంశాలు కూడాఉండొచ్చు. ఇలాంటి ఫిర్యాదులపై అంతర్గత విచారణ, చర్యలుకూడా ఉంటాయి. వచ్చిన ఫిర్యాదులన్నీ వాస్తవాలు అయి ఉండవు. పైగా కక్షిదారులు ఎవరికి వారే నెగ్గుతారని అనుకుంటారు. కాగా తీర్పులు తమకు అనుకూలంగా లేవని ఏమాత్రం అనుమానం వచ్చినా అవి ఇలాంటి ఫిర్యాదుల్లోకి చేరిపోతుంటాయి. మరికొన్నిరాజకీయ ప్రేరేపిత ఫిర్యాదులుకావచ్చు. నిజానికి ఎంత మంది ఆరోపితులు దోషులో, నిర్దోషులో తేలకుండా ఇలాంటి అంశాలపై ఎలాంటి సమాచారం బయటికి వచ్చినా ప్రజల్లో అనుమానాలు తలెత్తే ఆస్కారముంది. ఒకవేళ విధి నిర్వహణలో వారిపై తీవ్ర అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు పార్లమెంట్‌లో అభిశంసించే అధికారం శాసన వ్యవస్థకు ఉందని ఆ పాఠ్యాంశంలోని ప్రస్తావనాంశాలు. కాగా ప్రౌఢదశలోనే ఉన్న యువతకు ఇలాంటి పాఠాలు వారిలో సమాజం పట్ల ఏవగింపు కలిగే అవకాశం ఉంది. వ్యవస్థపై దురభిప్రాయం కలిగే విధంగా పాఠ్యాంశాలు ఉండరాదు. న్యాయవ్యవస్థపై సమాజంలో గౌరవభావం కలిగించాలే తప్ప సందేహాలు రేకెత్తించరాదు.

కొందరు గొప్పవారుగా జన్మిస్తారు. మరి కొందరు గొప్పవారుగా జీవిస్తారు. ఇంకా కొందరు గొప్పవారుగా తయారవుతారు.



ఫ్రాంక్లిన్

చెవిటివాడు ఎవరు? మాట వినలేనివాడు కాదు. మంచి మాట వినని వారు.



మార్టిన్ లూథర్ కింగ్

# ప్రజావాక్కు



### పాఠ్యాంశాల్లో శ్రీకృష్ణదేవరాయల వీరత్వం

విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు తన పాలనతో ఎల్లలు లేని కీర్తిని సంపాదించారు. హైందవ ధర్మానికి కట్టుబడి రాజ్యం చేయటమేకాక అలుపెరుగని యుద్ధాలు సుమారు ఇరవై సంవత్సరాలు పైబడి చేసి విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీలంకతో సహా ఇటు కటకం (కటక్), అటుగోమాంతక్(గోవా)వరకువిస్తరించాడు. మొఘలులను దక్షిణానికి రానివ్వకుండా తన పాలనా దక్షతతో అడ్డుకున్నారు. ఆయనస్వయంగాయుద్ధభూమిలో పాల్గొని అనేక రాజ్యాలను తన ఛత్రం క్రిందకు తెచ్చుకున్నారు. అసలుఓటమే ఎరుగని వీరాధివీరుడు ఆయన. అలాంటి ఆయన వీరత్వాన్ని సూచించే ఏ విగ్రహం లేదు. ఈ విషయాలు అవలోకనం చేసుకుని ముమ్మందు తరాలకు శ్రీకృష్ణదేవరాయల వీరత్వం తెలిపే అంశాలు పాఠ్య పుస్తకాలలో పొందు పరచటమే కాక ఆయన వీరత్వం ఉట్టిపడే భంగిమలో విగ్రహాలు నెలకొల్పాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### ఎటియంలలో డబ్బుల కొరత

ఎటియంల నిర్వహణ చాలా వరకు అస్తవ్యస్తంగా ఉంది. సెలవువస్తే ఎటియంలలో అసలు డబ్బులు ఉండటం లేదు. డిజిటల్ పేమెంట్స్ వద్దు అనుకునేవారు, నగదులోనే లావాదేవీలు చేస్తారు. అత్యవసరంగా డబ్బు అవసరమైన ఎటియంకు వెళ్తే చాలా ఎటియంలలో డబ్బులు ఉండటం లేదు. సంబంధిత బ్యాంకుఅధికారులు ఎటియంలలో నగదు ఉండే విధంగా చూడవలసిన అవసరం చాలా ఉంది. ముఖ్యంగా సెలవు దినాలలో ఎటియంలలో డబ్బు ఉండేటట్లు తగ్గ చర్యలు తీసుకోవాలి.

- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

### బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాలి

గల్లీకొక నకిలీ వైద్యులు విస్తరించిపోతున్నారు. గతంలో ఇలాంటి వార్తలెన్నో వచ్చినా ప్రభుత్వం అంతగా పట్టించుకోలేదు. ఒవది పదిహేను మందుల పేర్లను గుర్తుంచుకునిఏజబ్బుకైనా వాటినే తిప్పితిప్పిరాస్తున్నారు. ముఖ్యంగా గల్లీల్లోనే వీరి ఆటలు సాగుతున్నాయి. ఖరీదైన ఆసుపత్రులకు వెళ్లేస్తోమతలేక బీదలు వీరినే ఆశ్రయిస్తున్నారు. అధికరోగాలను కొనితెచ్చుకుంటున్నారు. బస్తీ దవఖానాలనురెండు తెలుగురాష్ట్రాలలోనూ మరింతగా నెలకొల్పాలి.

-ఎన్. మహాలక్ష్మి, సికింద్రాబాద్

### నిర్బంధ విద్య ఒక శాపం!

పిల్లలను బెదిరించడం, కొట్టడం లేదా కఠినమైన ఆంక్షల మధ్య చదివించడం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువని ప్లేటో హెచ్చరిస్తున్నారు. భయంతోచదివినప్పుడు పిల్లవాడు మీ మాట వినవచ్చు కానీ, ఆ చిన్న మెదడులోని అసలైన సృజనాత్మకత ఎప్పటికీ బయటకు రాదు. బలవంతంగా నేర్చుకునేది మెదడులో శాశ్వతంగా నిలవదు. ఆటపాటల ద్వారానే అసలైన అభ్యాసం. పిల్లలకు ఏవిషయంలో ఆసక్తి ఉంది? ఏ పని చేస్తే వారు ఆనందంగా ఉంటారు? అనేది గుర్తించి, దాని ద్వారానే విద్యను బోధించాలని ప్లేటో సూచిస్తున్నారు. ఆటల ద్వారా విషయాలనునేర్పినప్పుడు పిల్లలుఒత్తిడి లేకుండా సులభంగా గ్రహిస్తారు. ప్రతి బిడ్డ ఒక ప్రత్యేక ప్రతిభతో పుడతాడు. అందరినీ ఒకే గాటన కట్టకుండా, వారి ప్రత్యేకతను గుర్తించి ప్రోత్సహించాలి. పిల్లలు చదువును ఆస్వాదించాలంటే, ముందుగా పెద్దలు వారిని ప్రేమతో అర్థం చేసుకోవాలి. వారిలో ఉత్సుకతను రేకెత్తించేలా బోధనా పద్ధతులు ఉండాలి.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### పులుల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

మధ్యప్రదేశ్‌లో మరో రెండు పులుల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుద్వారా భారత దేశంలో పులుల సంరక్షణ కేంద్రా ల సంఖ్య 59కి చేరింది. 1970లలో ప్రారంభించిన ప్రాజెక్ట్ టైగర్ ద్వారా ఇందిరాగాంధీ ఒక బృహత్తర కార్యానికి నాంది పలికింది. అయితే నర్మదా నది ఉత్తర భాగంలో ఉండే త్రపని, మాధవ్ పార్కులను పులుల సంరక్షణ కేం ద్రాలుగా గుర్తించడం ద్వారా గొడుగు కింద జంతువులను కూడా కాపాడడానికి వీలు అవుతుంది. అంతమాత్రమే కాదు ఈ ప్రాజెక్ట్ టైగర్ అంతర్జాతీయ బిగ్‌క్యాట్ అలి యన్స్‌కి నాంది ప్రస్తావనగా మారింది.

-భారత అవినాష్,జనగామ

### అంతా కల్తీమయం

నేడు ఏది చూసినా కల్తీమయమే. శీతల పానీయాలు, పచ్చళ్ళు, పాలు, నీళ్ళ,నెయ్యి, నూనెలు, సౌందర్య ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు,మిఠాయిలు, ఆహారపదార్థాలు,అన్నిటిలోను కల్తీయే. ముఖ్యంగా మనం తినే వివిధపదార్థాలలో కల్తీ బాగా జరుగుతుంది. అధిక లాభాలకు ఆశపడి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలు,నాసిరకం వస్తువులు కలిపికొందరు వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. కొన్నిచోట్ల తక్కువ ధరకే టిఫిన్లులభిస్తుండడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అమ్మభాషకా అంపశయ్య!

**స్వాతంత్య్రం వచ్చిన తర్వాతనే కాదు అంతకుముందు బ్రిటిష్ కాలంలో కూడా సివిల్ సర్వీస్ అధికారులు వారు పనిచేసే ప్రాంతాల్లో స్థానిక భాష కొంతవరకు వచ్చి ఉండాలనే నిబంధనలను విధించారు. ఆ నిర్ణయం మేరకే 1816లో భారత్‌లో అడుగుపెట్టిన సివిల్ సర్వీసు ఉద్యోగి చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ తెలుగు భాషను నేర్చుకోవడమే కాదు ఏకంగా ఒక నిఘంటువును రూపొందించి తెలుగు ప్రజలు మరిచిపోలేని సేవలు అందించారు. సభలు, సమావేశాలు, ఏర్పాటు చేసి తెలుగు గురించి దేశవిదేశాల్లో గొప్పలు చెప్పుకుంటే చెప్పుకోండి. అలాగే మమ్మీడాడీ చదువులు ఉండే ఉండనీయండి.కానీ తెలుగుకు పుట్టినిల్లు అయిన ఉభయ రాష్ట్రాల్లో తెలుగుకు ద్రోహం చేయడం ఏమాత్రం సమంజసంకాదు.**

దామెర్ల సాయిబాబ

మాతృభాషను సంరక్షించుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత గురించి పెద్దలు పదేపదే చెబుతుంటారు. అమ్మభాషలో ఉన్న ఆత్మీయత, ఆనందం మరెందులోనూ లభించదని తెలియని విషయం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషలకు లిపిలేకపోవడం, విద్యారూపంలో అందించే ప్రయత్నాలు చేయకపోవడం వల్ల కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ప్రపంచంలో గుర్తించిన ఎనిమిదివేల మూడువందల ఇరవైనాలుగు భాషల్లో ప్రస్తుతం ఆరువేల ఏడువందలు మాత్రమే వాడుకలో ఉన్నాయని ఐక్యరాజ్యసమితి విద్యా విజ్ఞాన, సంస్కృతిక సంస్థ (యునెస్కో)ఇటీవల వెల్లడించింది. వాటిలో కూడా నలభైశాతానికి పైగా కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదంలో ఉన్నాయని హెచ్చరించింది. ప్రపంచీకరణ, వలసలు,సామాజిక మార్పుల వల్ల భాషలు ఉనికిని కోల్పోతున్నాయి. ఇప్పటికీ ప్రపంచ జనాభాలో నలభై శాతానికిపైగా వారివారి మాతృభాషల్లో విద్యను అభ్యసించడానికి కావాల్సిన వసతులు, వ్యవస్థలు లేవనే చెప్పొచ్చు. ఇలా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషలు విద్యారూపంలో అందించే ప్రయత్నాలు చేయకపోవడం వల్ల కనుమరుగైపోతున్నాయి. రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన తెలుగు భాష పరిస్థితి కూడా అంత ఆశాజనకంగా కన్పించడం లేదు. ఒకనాడు సంస్కృతం,ప్రాకృతం, అరబిక్, పార్శీ,ఉర్దూ,పోర్చుగీసు, ఇంగ్లీష్‌తోసహా అనేక భాషల ప్రభావం తట్టుకొని నిలబడగలిగిన తెలుగుకు ప్రస్తుతం ఆశించిన మేరకు ఆదరణ లభించడం లేదేమోననిపిస్తున్నది. మాతృభాష అయిన తెలుగుపై పాలకులకు అభిమానం, ప్రేమ, వాత్సల్యం లేదనుకోలేం. తెలుగుకు ఉన్న ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు ప్రపంచవ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. తెలుగుభాషపై ఉన్న మక్కువను చాటేందుకు తెలుగును నలుదిశల వ్యాప్తి చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను కాదనలేం. కానీ మరొకపక్క తెలుగు రాష్ట్రాల్లోనే క్షేత్రస్థాయిలో ఇంగ్లీషు మోజులో పడి తెలుగుకు తీరని అన్యాయం చేస్తున్నారనే వాదనను కొట్టివేయలేం. తెలుగుభాషకు జరుగుతున్న ద్రోహం, అందువల్ల సామాన్య ప్రజలుపడుతున్న ఇబ్బందుల గురించి ఆలోచిస్తే ఆవేదన కలుగకతప్పదు. ఇదంతా పరాయి ప్రభువులు ఎవరో చేస్తున్నది కాదు. ఉభయ రాష్ట్రాల్లో తెలుగు ప్రజల ప్రతినిధులమని చెప్పుకుంటున్న నేతలే కావడం విచారకరం. ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారిందన్న మాట వాస్తవమే కావొచ్చు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతుంటే తెలుగు, తెలుగు అని పరిమితులు గీసుకుంటే ఎలా అని ప్రశ్నించేవారు ఉన్నారు. అభివృద్ధివైపు పరుగులీడాల్సిందే. కానీ మాతృభాషపై అభిమానాన్ని పెంచుకోవడం ప్రోత్సహించడం తప్పుకాదు. అన్యభాషలను ద్వేషించమని చెప్పడం లేదు. నేర్చుకోవద్దనడం లేదు.కానీ తెలుగు రాష్ట్రాల్లోనే మమ్మీ డాడీ చదువులు ఆరంభమైన తర్వాత తెలుగులో బోధన క్రమేపీ తగ్గిపోతున్నది. తెలుగులో బోధించే ప్రభుత్వ ఎయిడెడ్‌సంస్థలు దాదాపు మూతపడ్డాయని చెప్పొచ్చు. ఇంగ్లీషు చదివించడం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. పాఠశాల స్థాయిలో తెలుగు ఒక సబ్జెక్టుగా మిగిలిపోయింది. ఒకటి నుండి పదోతరగతి వరకు తెలుగు భాషను విధిగా నేర్చుకోవాలనే నిబంధన తెలంగాణ ప్రభుత్వం విధించింది.కానీ ఏదోకారణంతో మినహాయింపులు మీద మినహాయింపులు ఇస్తున్నారు. మార్కుల కోసం ఇంటర్‌లో పరాయి భాషలను ఎంచుకునే సంప్రదాయం పెరిగిపోతున్నది. పోని ఆ భాషలైనా సక్రమంగా నేర్చుకుంటున్నారంటే అదీ లేదు. ఫలితంగా ఏ భాష రాకుండాపోతున్నది. ఇప్పటికే తెలుగు

## ఒక్క మాట

రాష్ట్రాల్లో దాదాపు అన్ని ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్ కాలేజీల్లో మార్కులకోసం పిల్లలను సంస్కృతం, ఇతర భాషల వైపు నడిపిస్తూ మాతృభాష బోధనకు తిలోదకాలిస్తున్నారు. దేశభాషల్లో తెలుగు మూడో స్థానం నుంచి నాలుగో స్థానానికి పడిపోయింది. హిందీది ప్రథమ స్థానం. 2001లో 8.1 శాతం ప్రజలు బెంగాలీ మాట్లాడుతుండగా, 2011 నాటికి 8.30శాతానికి చేరి రెండోస్థానాన్ని పదిలం చేసుకుంది. 2001లో 7.9 శాతంతో మూడోస్థానంలో ఉన్న తెలుగు భాష 2011 నాటికి తెలుగు మాట్లాడేవారి సంఖ్య 6.93 శాతానికి పడిపోవడంతో మూడో స్థానాన్ని మరాఠీ భాష దక్కించుకున్నది. దీంతో నాలుగోస్థానానికి తెలుగు చేరుకున్నది. ఇలా క్రమేపీ దేశభాషల్లో తెలుగు స్థానం తగ్గుతుండడం భాషాప్రియులకు ఆందోళన కలిగిస్తున్నది. ఎన్నో దేశాలు తమ మాతృభాష అయిన విద్యాబోధన వైపు అడుగులు వేస్తూ ఆయా భాషల ఉనికిని కాపాడుకోవడమే కాదు ప్రోత్సహించి ఉన్నత స్థానంలో ఉంచేందుకు నిరంతరం ప్రయత్నం చేస్తున్నాయి. జపాన్, సింగపూర్, కాంబోడియా, వియత్నాం, థాయిలాండ్, మలేషియా తదితర దేశాల్లో విద్యాబోధన పాఠశాల స్థాయిలోనే మాతృభాషలోనే జరుగుతున్నది. జింబాబ్వే తదితర ఆఫ్రికా దేశాలు పాఠశాల విద్యను మాతృభాషకే పరిమితం చేస్తున్నాయి. అలాని తెలుగు భాష గురించి పాలకులు ప్రోత్సహించడం లేదని చెప్పడం లేదు. తెలుగు భాష అమలుకు ఎన్నో చట్టాలు చేశారు. మరెన్నో నిబంధనలు విధించారు. దశాబ్దాలు దాటిపోయినా నేటికీ అమలుకు నోచుకోవడం లేదు. పేరుకు అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండు అధికార భాషా సంఘాలు ఏర్పడ్డాయి. ఏదో నామమాత్రపు అధికారాలు కూడా ఆ సంఘాలకు లేకుండా చేశారు. గతంలో పనిచేసిన అధికార భాషా సంఘం అధ్యక్షులు జిల్లాల్లో పర్యటించి తెలుగును నిబంధనల మేరకు ఎంత వరకు అమలు చేస్తున్నారో, చేయకపోతే ఎందుకు చేయలేదంటూ సమీక్షలు, సమావేశాలు పెట్టి సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. అవి అలంకారప్రాయంగా తయారయ్యాయి. వాస్తవంగా చూస్తే ఇంతటి సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలుగును 1966 మే పద్నాలుగున ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార భాషగా గుర్తించారు. పరిపాలనకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులో ఉండాలని నిర్దేశించారు. కానీ ఇప్పుడవన్నీ పక్కన పెట్టి ఇంగ్లీషుకు అగ్రపీఠం వేస్తున్నారు. ఒకటో తరగతే కాదు అంతకు ముందు రెండేళ్ల ముందే ప్రారంభమయ్యే విద్యాభ్యాసంలో నర్సరీ, ఎల్‌కెజి అంటూ ఇంగ్లీషులోనే మొదలుపెడుతున్నారు. జీవిత సారాంశాన్ని వడబోసి రచించిన సుమతీ, వేమన, దాశరథి, భాస్కర, ధర్మపురి లక్ష్మీనర్సింహలాంటి శతకాలు దాదాపు కనుమరుగైపోయాయి. ఇక తెలుగుఅమలులో జరుగుతున్న నిర్లక్ష్యం, అశ్రద్ధ సామాన్యులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది. గతంలో ఒకసారి పోలీసు అకాడమీ నిర్వహించిన సర్వేలు విస్తుపోయే విషయాలువెలుగులోకి వచ్చాయి. ఆంగ్ల భాష అంతగా రాని పోలీసు శాఖల్లోని ఉద్యోగులతో అభియోగపత్రాన్ని తయారు చేయించి న్యాయస్థానం ముందు పెట్టడంతో బాధితుల్లో చాలా వరకు ఆంగ్లభాష పరిజ్ఞానం లేకపోవడంతో చార్జ్‌షీట్‌లో ఏమిరాశారో తెలియకుండాపోయి కేసులు వీగిపోతున్న విషయం వెలుగుచూసింది. కంప్యూటర్లు వచ్చిన తర్వాత మరింత సులువు అయిపోయింది. ఒక్క పోలీసుశాఖే కాదు, ప్రజలతో నేరుగా సంబంధాలు ఉండే రెవెన్యూ, మున్సిపల్, రవాణా, వైద్య, ఆరోగ్యం, తదితర అన్ని శాఖల్లోనూ ఇవేఇబ్బందులు సామాన్యులు ఎదుర్కొం టున్నారు. ప్రభుత్వ శాఖలన్నింటిలోనూ తెలుగు అమలుకు చిత్తశుద్ధితో కృషి చేస్తే ఎందరో బీదాబిక్కిలకే కాదు మధ్య తరగతి వర్గాలకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పులను ఆయా భాషల్లో తర్జుమా చేయించి అందించే ఏర్పాటు చేస్తుండడం ఎందరి కో ఉపయోగపడుతున్నది. స్వాతంత్య్రం వచ్చిన తర్వాతనే కాదు అంతకుముందు బ్రిటిష్ కాలంలో కూడా సివిల్ సర్వీస్ అధికారులు వారు పనిచేసే ప్రాంతాల్లో స్థానిక భాష కొంతవరకు వచ్చి ఉండాలనే నిబంధనలను విధించారు. ఆ నిర్ణయం మేరకే 1816లో భారత్‌లో అడుగుపెట్టిన సివిల్ సర్వీసు ఉద్యోగి చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ తెలుగు భాషను నేర్చుకోవడమే కాదు ఏకంగా ఒక నిఘంటువును రూపొందించి తెలుగు ప్రజలు మరిచిపోలేని సేవలు అందించారు. సభలు, సమావేశాలు, ఏర్పాటు చేసి తెలుగు గురించి దేశవిదేశాల్లో గొప్పలు చెప్పుకుంటే చెప్పుకోండి. అలాగే మమ్మీడాడీ చదువులు ఉండే ఉండనీయండి. కానీ తెలుగుకు పుట్టినిల్లు అయిన ఉభయ రాష్ట్రాల్లోతెలుగుకు ద్రోహం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. ●

# ఉక్రెయిన్, రష్యా చర్చలు నిష్ప్రయోజనమేనా?


కనుమ ఎల్లారెడ్డి

రష్యా, ఉక్రైన్ యుద్ధం బీతా వహ వాతావరణం తలపిస్తోంది. ప్రధానమైన అంశాలలో ఎవరూ తగ్గడం లేదు. ఇప్పటికే జనవరి 23, 24 తేదీలలో ఫిబ్రవరి 4,5 తేదీలలో చర్చలు సాగాయి. ఇవి ఎటువంటి పురోగతి సాధించలేకపోయాయి. ఇది ఇలా ఉండగా ఈ యుద్ధం ఆపాలని అమెరికా కంకణం కట్టుకుంది. ఫిబ్రవరి 26న గురువారం జెనివాలో జరిగిని సమావేశంలో మూడు దేశాలు అంటే ఉక్రైన్, అమెరికా, రష్యా దేశాలు పాల్గొన్నాయి. అంతకు ముందు ఫిబ్రవరి 17,18 తేదీలలో జరిగిన చర్చలు ఫలితం ఇవ్వలేదు. చర్చలు రెండు రోజులు జరిగాయి. నాయకులు తీవ్రంగా కష్టపడ్డారు. ఎవరూ కూడా అంటే రష్యా, ఉక్రైన్ నాయకులు సుముఖత వ్యక్తం చేయలేదు. చర్చలు జరుగుతున్నంత సేపు ఉద్విగ్న వాతావరణం ఏర్పడింది. రెండు దేశాలు చెబుతున్న మాట ఒక్కటే చర్చలలో చాలా కఠిన చట్టాలు వున్నాయి అని, అవి చాలా క్లిష్టం అని, రష్యా అధికార ప్రతినిధి మిడిన్స్కి అన్నాడు. ఒక ప్రక్క చర్చులు జరుగుతుంటే దాడులు రెండు దేశాలు ముమ్మరం చేశాయి. ముందు చర్చలు జరుగుతున్నప్పుడు ఎటువంటి దాడులు జరగరాదు. అందుకే ఇవి నిష్ప్రయోజనం అవుతున్నాయేమో అని ఒక వాదన ఉంది. ఈ సారి ఎలాగైనా పురోగతి సాధిస్తాం అని చర్చలలో పాల్గొనే అమెరికా ప్రతినిధి స్టివ్ విట్ కాఫ్ అన్నాడు. ఇప్పుడు శాంతి బంతి అటు రష్యా, ఇటు ఉక్రైన్ కోర్టులో ఉంది. ఇరువురు నాయకులు బీష్మించుకుని కూర్చుంటే ఎటువంటి చర్చలు అయినా ఫలితం తేలదు. ఇప్పటికే ఈ యుద్ధం కొనసాగబట్టి సంవత్సరాలు నిండుతున్నాయి. కాని ప్రయోజనం శూన్యం. ఈ యుద్ధ నివారణకు శాంతి సంస్థ ఐక్యరాజ్య సమితి కూడా బాధ్యత తీసుకోవాలి. సమితి కూడా భాగస్వామ్యం అయి ఉంటే బాగుండేది. అయినా అమెరికా వారధిగా అటు రష్యా, ఇటు ఉక్రైన్ దేశాల ప్రతినిధులు, నాయకులు అగ్రదేశ దౌత్యం అంగీకరించాలి. ముందు ఉక్రైన్‌కు ఏమి కావాలో తెలుసుకుని చర్చ ప్రారంభించాలి. రష్యా పెద్ద దేశం కనుక కొన్ని చట్టాలు గౌరవించాలి. అలాగే ఉక్రెయిన్ కూడా రష్యాను పునర్ నిర్మాణంకు ఒత్తిడి తేవాలి. రష్యా, ఉక్రైన్ దేశాలకు సంబం ధించి ఒక ఆమోదయోగ్యమైన పార్ములా అమెరికా తెచ్చినప్పుడు రెండు దేశాలు గౌరవించాలి. ప్రధాన అవరోధం అక్కడే వస్తోంది. అప్పుడే రెండు దేశాలు సంయమనం పాటించాలి. అర్థాంతరంగా ఎవరూ లేచి రాకూడదు. అలా వస్తే యుద్ధం ఇంకా ఎక్కువ కొనసాగే అవకాశం ఉంటుంది. శాంతి చర్చలు ఫలించాలంటే రెండు దేశాల నాయకులకు చిత్తశుద్ధి ఉండాలి. పౌరుల గురించి, చిన్న బిడ్డల గురించి, గర్భవతులు గురించి, వృద్ధులు గురించి రష్యా, ఉక్రెయిన్ దేశాలు ఆలోచించాలి. యుద్ధం వలన రెండు దేశాలు తీవ్ర నష్టపోయాయి. రెండు దేశాల ముఖ్య కట్టడాలకు అగ్ర దేశం నడుం కట్టాలి. ఎందుకంటె మధ్య వర్తిత్వం వహిస్తోంది. ఏ దేశానికి అనుకూలంగా చర్చలు ఉండరాదు. ఇప్పటికే ఖర్చు మోపెడంత అయింది. ఒక్క సైన్యానికే రెండు దేశాలు విపరీతంగా ఖర్చు పెట్టాయి. సైనికులకు కూడా నిరాశ వచ్చింది. రెండు దేశాల సైనికుల మరణం అత్యంత బాధాకరం. చర్చలు మంచి సుహృద్భావ వాతావరణంలో జరగాలి. ఏతావాత రష్యా, ఉక్రెయిన్ మంకు పట్టు విడకపోతే ఎన్ని శాంతి చర్చలు జరిపినా, ఎవరు నేతృత్వం వహించిన లాభం ఉండదు. నిజం చెప్పాలంటే ఇది యుద్ధాల శకం కాదు అని భారత ప్రధాని మోదీ మాట రెండు దేశాలు గ్రహించాలి. యుద్ధం కొనసాగించాలంటే నాయకులకు ఉబలాటం కాని పౌరులకు ఎప్పుడెప్పుడు శాంతి వుంటుందా అనే దృక్పథంతో ఉంటారు. కనుక రెండు దేశాలు శాంతి చర్చలలో తీసుకునే నిర్ణయాలను గౌరవించి యుద్ధం ఆగుతుందని ప్రకటన చేయాలి. అప్పుడే పౌరులకు భరోసా ఉంటుంది. చూద్దాం ఈసారైనా జరిగే చర్చలు ఏ మేరకు ఫలం ఇస్తాయో, యుద్ధం కొనసాగుతుందా, ఆగుతుందా అనేది ఇక కొద్ది రోజులలో తెలిసి పోతుంది. యుద్ధం ఆగాలానే కోరుకుందాం. లేకపోతే చర్చలు నిష్ప్రయోజనమే. ●

# విజ్ఞాన వికాసంతోనే దేశాభివృద్ధి సాధ్యం!

డి జె మోహన రావు

భారతీయ శాస్త్రవేత్తల చారిత్రక విజయాలను స్మరించుకుంటూ, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా జరుపుకుంటారు. 1928 ఫిబ్రవరి 28న ప్రఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ అద్భుతమైన రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారు. ఈ దినోత్సవం ఆ చారిత్రక ఘట్టానికిప్రతీక. కోల్‌కతాలోని ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్ ప్రయోగశాలలో చేసిన ఈ పరిశోధన ప్రపంచ విజ్ఞాన శాస్త్రగతిని మార్చివేసింది. కాంతి అణువుల ద్వారా చెదిరినప్పుడు, ఆ కాంతి తరంగదైర్ఘ్యంలో మార్పు వస్తుందనేది విప్లవాత్మక ఆవిష్కరణ. ఇది భౌతిక, రసాయన శాస్త్రాలలో స్పెక్ట్రోస్కోపీ విభాగానికి పునాది వేసింది. ఈ విశేష కృషికి గాను 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. తద్వారా భారతదేశం ప్రపంచ శాస్త్రీయ పటంలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకుంది. 2026 జాతీయ సైన్స్ దినోత్సవం అనేక ప్రత్యేకతలను సంతరించుకుంది. ప్రధానంగా 'విజ్ఞాన శాస్త్రంలో మహిళలు, వికసిత భారత సాధనలో చోదక శక్తులు' అనే థీమ్ ద్వారా పరిశోధన, సాంకేతికత, స్టెమ్ రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై తీవ్ర దృష్టి సారించారు. మరొకవైపు, భారత ప్రభుత్వ శాస్త్రసాంకేతిక విభాగం 'ప్రత్యేక ప్రతిభావంతుల కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే వినూత్న థీమ్‌ను ఎంచుకుంది. సాంకేతిక ప్రగతి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి, ముఖ్యంగా వికలాంగులకు అందాలన్న సమ్మిళిత దృక్పథం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వేడుకల్లో భాగంగా టైర్2 నగరమైన వరంగల్‌లో దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించే సంఘటన జరుగుతోంది. చారిత్రక కాకతీయ రాణి రుద్రమ దేవి గౌరవార్థం రుద్రమదేవి.1 అనే నమూనా రాకెట్‌ను ప్రయోగించడానికి సన్నాహాలు చేస్తున్నారు. చిన్న నగరాలలో కూడా అంతరిక్ష శాస్త్రీయ ఆవిష్కరణల పట్ల పెరుగుతున్న ఆసక్తికి ఇది సజీవ సాక్ష్యం. భారత రక్షణ వ్యవస్థలో మునుపెన్నడూ లేని విధంగా అత్యంత వేగవంతమైన, మౌలికమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. భారతదేశం ఒకవైపు ఆర్థికంగా, సాంకేతికంగా పురోగమిస్తున్న సమయంలో, దాని సహజ వనరుల పరిరక్షణ అత్యంత క్లిష్టమైన సవాలుగా మారింది. భౌగోళికంగా ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన, అరుదైన జీవవైవిధ్య ప్రాంతాలలో పశ్చిమ కనుమలు అగ్రస్థానంలో ఉన్నాయి. దాదాపు 60,000చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ పర్వత శ్రేణి, దేశంలోని 40నదీ వ్యవస్థలకు పరీవాహక ప్రాంతంగా సేవలు అందిస్తోంది. అయితే విపరీతమైన జనాభా పెరుగుదల, వ్యవసాయ భూముల విస్తరణ, గనుల తవ్వకాల వల్ల



ఈ జీవవైవిధ్య ప్రాంతం విపరీతమైన ఒత్తిడికి గురవుతోంది. ఈ నేపథ్యంలో ప్రఖ్యాత పర్యావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మాధవ్ గాడ్గిల్ ప్రతిపాదించిన విధానాలు దేశ పర్యావరణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ ఆంక్షల ద్వారా సాధించబడదని బలంగా విశ్వసించారు. ఆయన చొరవతో 2002నాటి బయోలాజికల్ డైవర్సిటీ యాక్ట్‌లో పీపుల్స్ బయోడైవర్సిటీ రిజిస్టర్ అనే విప్లవాత్మక భావన పరిచయం చేశారు. స్థానిక కమ్యూనిటీల భాగస్వామ్యంతో వారి చుట్టూ ఉన్న జీవసంపదను అధికారికంగా డాక్యుమెంట్ చేయడం దీని ఉద్దేశ్యం. బహుళజాతి సంస్థలు స్థానిక పరిజ్ఞానాన్ని దొంగిలించడాన్ని అరికట్టడంలో ఇది ఒక చట్టబద్ధమైన అస్త్రంగా పనిచేస్తోంది. కేరళలోని వాయనాడ్ సమీపంలో ఉన్న గురుకుల బొటానికల్ శాంక్చువరీ పర్యావరణ పరిరక్షణలో అద్భుతాలు చేస్తోంది. మునుపు టీ, అల్లం తోటలుగా ఉన్న ఈ భూమిని తిరిగి ఉష్ణమండల వర్షారణ్యంగా మార్చారు. మొక్కలు పెరగడంతో ఆవాసం పునరుద్ధరించబడి, ఏనుగులు, పెద్ద పులులు వంటి జంతువులు తిరిగి రావడంప్రారంభించాయి. 2030 నాటికి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలన్న భారతదేశ సుదీర్ఘ లక్ష్యం నేరుగా దేశ విద్యా వ్యవస్థ నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. ఈదిశగా జాతీయ విద్యా విధానం 2020 ప్రవేశపెట్టిన మౌలిక సంస్కరణలు 2025 నాటికి క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో అమలులోకి వచ్చాయి. భారతీయ విద్యా వ్యవస్థను దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న అతిపెద్ద అవరోధం బట్టీ పట్టే విధానం. ఈ వ్యవస్థలో వచ్చిన మార్పుల్లో ప్రధానమైనది బోర్డు పరీక్షల ప్రక్షాళన. విద్యార్థులలో పరీక్షల ఒత్తిడిని తగ్గించే ఉద్దేశ్యంతో సంస్కరణలు తెచ్చారు. అయితే, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విద్య విషయంలో క్షేత్రస్థాయి గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సాంకేతికత, విద్యా రంగాలలో భారతదేశం గొప్ప ఆశయాలను ప్రకటించినప్పటికీ, ఈ లక్ష్యాల సాధనకు పునాది అయిన రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ పై చేస్తున్న వ్యయం ఆందోళనకరంగా ఉంది. స్థూల దేశీయోత్పత్తిలో పరిశోధన వ్యయం దశాబ్దాలుగా కేవలం 0.6నుండి 0.7పరిమితికే పరిమితమైంది. అభివృద్ధిచెందిన దేశాలు తమ జీడీపీలో ఏకంగా 2శాతం పైగా వెచ్చిస్తున్నాయి. ఈఫండింగ్ కొరత, అధునాతన మౌలిక సదుపాయాల లేమివల్ల ప్రతిభావంతులైన భారతీయ పరిశోధకులు మెరుగైన అవకాశాల కోసం విదేశాలకు వలస వెళ్తున్నారు. దీనినే బ్రెయిన్ డ్రెయిన్ అని పిలుస్తారు. ఈ తీవ్రమైన అంతరాన్ని పూడ్చేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ఏకంగా14,000 కోట్ల బడ్జెట్‌తో అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించింది. దేశంలో ఇన్నోవేషన్‌ను రూపొందించేందుకు రూ. 1.0లక్షల కోట్లతో బృహ త్తరమైన ఖిరీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. ఈ కృషితో గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్ తన ర్యాంకును అద్భుతంగా మెరుగుపరచుకుంది. ప్రపంచ మేధోసంపత్తి ఫైలింగ్స్‌లో 6వ స్థానంలో నిలి చింది. వ్యవస్థాగత సవాళ్లను నిరంతరం అధిగమిస్తూ ముందుకు సాగితే, 2047 నాటికి భారతదేశం నిజమైన వికసిత్ భారత్‌గా ప్రపంచానికి ఆదర్శంగా నిలవడం తథ్యం. ●

# సోషల్‌మీడియాపై నియంత్రణా, నిషేధమా?

## అత్యధికశాతం నియంత్రణే మేలంటున్న నిపుణులు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** 16 సంవత్సరాల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించే అంశంపై దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఆలోచిస్తున్నట్టు వస్తున్న వార్తలు పెద్ద చర్చకు దారితీశాయి. చిన్నపిల్లల మానసిక ఆరోగ్యంపై సోషల్ మీడియా చూపిస్తున్న తీవ్రమైన ప్రభావమే ఈ చర్చకు ప్రధాన కారణం. సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించాలా లేక నియంత్రణ సరిపోతుందా అనే అంశంపై నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇలాంటి ఒక చట్టాన్ని అమలు చేస్తోంది. యువతను హానికరమైన కంటెంట్ నుంచి, అధిక స్క్రీన్ టైమ్ బారిన పడకుండా రక్షించడం ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం. అక్కడ ఈ చట్టాన్ని తీసుకురావడానికి ముందు ప్రభుత్వం పిల్లలు, వారి తల్లిదండ్రులతో విస్తృతంగా చర్చలు జరిపింది. ఈ అంశంపై ట్రస్ట్ అండ్ సేఫ్టీ నిపుణుడు, జర్నలిస్ట్ జతిన్ గాంధీ స్పందిస్తూ ఇది కచ్చితంగా సరైన దిశలో వేస్తున్న ముందడుగు. ఇన్నాళ్లూ సోషల్ మీడియాకు అడ్డూ అదుపూ లేకుండా పోయి, మన సమాజంలో గందరగోళం సృష్టించింది. మొదట నిషేధించి, ఆ తర్వాత నియంత్రించి, ఆపై నిబంధనలను సడలించడం సరైన పద్ధతని గట్టిగా వాదించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు లాభాలకే ప్రాధాన్యత ఇస్తూ నాణ్యతను ఎలా తగ్గిస్తున్నాయో ఆయన వివరించారు. గతంలో మనం కంటెంట్ కోసం వెతికేవాళ్లం, కానీ ఇప్పుడు కంటెంటే మన అభిరుచులను గుర్తించి మనల్ని వెతుక్కుంటూ వస్తోంది అని ఆయన హెచ్చరించారు. సంపూర్ణ నిషేధం ఆచరణ సాధ్యం కాదని మరికొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పుణేలోని ఎంఐటీ ఆర్ట్, డిజైన్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీకి చెందిన సంబిత్ పాల్ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో పిల్లలను స్మార్ట్‌ఫోన్లకు, సోషల్ మీడియాకు పూర్తిగా దూరం చేయడం వాస్తవికం కాదు. దీనికి బదులుగా, తల్లిదండ్రుల పర్యవేక్షణ, సరైన అవగాహన కల్పించడం ద్వారా దాని దుష్ప్రభావాలను తగ్గించవచ్చని సూచించారు. ఈత రాకుండానే పిల్లలను అంతులేని కంటెంట్ సముద్రంలోకి తోసేయడం ప్రమాదకరం. పెద్దలే అందులో తేలడానికి ఇబ్బంది పడుతుంటే, పిల్లలు ఒంటరిగా ఈదగలరని ఎలా ఆశించగలమని ఆయన ప్రశ్నించారు. ఫ్యాక్ట్ చెకింగ్ నిపుణుడు జాయ్‌దీప్ దాస్‌గుప్తా కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వాడకం వల్ల పిల్లలు సైబర్‌బుల్లీయింగ్, ఆన్‌లైన్ వేధింపులు, అనారోగ్యకరమైన పోలికల బారిన పడే ప్రమాదం ఉంది. తల్లిదండ్రులు స్క్రీన్ టైమ్‌పై పరిమితులు విధించాలని తెలిపారు. మొత్తం మీద, నిషేధమా లేక నియంత్రణనా అనే దానిపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, పిల్లలను సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి కాపాడాలన్న విషయంలో మాత్రం అందరూ ఏకాభిప్రాయంతో ఉన్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణతో పాటు సోషల్ మీడియా సంస్థలు కూడా కఠినమైన వయోపరిమితి నిర్ధారణ వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.




# అఫ్ఘాన్ నగరాలపై పాక్ వైమానిక దాడులు

## ఉభయ దేశాల మధ్య పెరిగిన ఉద్రిక్తతలు

**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 27:** పాకిస్థాన్–అఫ్ఘానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. సరిహద్దులో ఇరుదేశాల మధ్య భీకర దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో పాక్ కీలక ప్రకటన చేసింది. అఫ్ఘాన్‌పై బహిరంగ యుద్ధం ప్రారంభించినట్లు తెలిపింది. ఈ మేరకు పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. 'మా సహనం నశించింది. ఇప్పుడు మాకు.. మీకు మధ్య బహిరంగ యుద్ధమే' అని అఫ్ఘానిస్థాన్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. ఆపరేషన్ గజబ్‌లిల్ హక్.. గురువారం రాత్రి అఫ్ఘాన్ దాడులకు బదులుగా పాక్ వైమానిక దాడులు ప్రారంభించింది. దీనికి 'ఆపరేషన్ గజబ్ లిల్ హక్'గా పేర్కొంది. కాబుల్‌లో మూడుసార్లు పేలుడు శబ్దాలు వినిపించాయని తాలిబన్ అధికారులు పేర్కొన్నారు. కాబుల్, కాందహార్, పక్తియా ప్రావిన్స్‌లలో వైమానిక దాడులు జరిగాయని అఫ్ఘాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబీహుల్లా తెలిపారు. అయితే, ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని వెల్లడించారు. పాక్‌పై చేపట్టిన దాడుల్లో 55 మంది ఆ దేశ సైనికులు చనిపోయారని అఫ్ఘాన్ ప్రకటించింది. అయితే, ఇస్లామాబాద్ దీన్ని తోసిపుచ్చింది. ఘర్షణల్లో ఇద్దరు పాక్ సైనికులు మరణించారని, మరో ముగ్గురు గాయపడ్డారని పేర్కొంది.

ఇస్లామాబాద్ సైనికుల నిర్బంధంపై అఫ్ఘాన్ చేసిన ప్రకటనను పాక్ ప్రభుత్వ ప్రతినిధి మోషరఫ్ అలీ జైదీ ఖండించారు. అఫ్ఘాన్ సైనికులే 133 మంది మరణించారని.. 200 మందికిపైగా గాయపడ్డారన్నారు. తొమ్మిది మంది సైనికులను నిర్బంధించినట్లు తెలిపారు. ఇటీవల తమపై జరిగిన వైమానిక దాడులకు ప్రతీకారంగా పాక్‌పై అఫ్ఘాన్ విరుచుకుపడింది. ఇది ఇరు దేశాల మధ్య తాజా ఉద్రిక్తతలకు దారి తీసింది.



## సింగపూర్‌లో పోలీసునని నమ్మించి మహిళపై అత్యాచారం..

### భారత సంతతి వ్యక్తికి 12 యేళ్ల జైలుశిక్ష, 12 కొరడా దెబ్బలు

**సింగపూర్, ఫిబ్రవరి 27:** భారత సంతతికి చెందిన ఓ వ్యక్తి.. తనను తాను పోలీసుగా చెప్పుకొని, ఓ మహిళకు సాయం చేస్తానంటూ నమ్మించి మోసం చేశాడు. ముఖ్యంగా సింగపూర్‌లో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అయితే నేరం రుజువు కావడంతో.. సింగపూర్ కోర్టు అతడికి కఠిన శిక్ష విధించింది. ముఖ్యంగా 12 యేళ్ల జైలుశిక్షతో పాటు 12 కొరడా దెబ్బల శిక్షను ఖరారు చేసింది. అసలేం జరిగిందంటే..? 2022 జూలై 11న రాత్రి 8 గంటల సమయంలో ఈ దారుణం జరిగింది. ఇండోనేసియాకు చెందిన 35 యేళ్ల మహిళ తన స్నేహితులతో కలిసి సింగపూర్‌లోని లిటిల్ ఇండియా మెట్రో స్టేషన్ సమీపంలో వేచి చూస్తోంది. అప్పుడే అక్కడకు భారత సంతతికి చెందిన మలేసియా వ్యక్తి షర్వీన్ శెట్టి (48) వెళ్లి.. తనను తాను ఓ పోలీసు అధికారిగా పరిచయం చేసుకున్నాడు. అతడి మాటలు నమ్మిన ఆమె.. తన వద్ద ఏదో తనిఖీ చేయాలని నాటకమాడాడు. అలా ఆమెను తన స్నేహితులకు దూరంగా.. మెట్రోస్టేషన్ ఎగ్జిట్ ఎఫ్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఆపై అక్కడే ఉన్న పొదల్లో ఆమెపై అమానుషంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. షర్వీన్ శెట్టిని అరెస్టు చేసి ఈ నెల 3న హైకోర్టులో హాజరుపరిచారు. అయితే మొదట్లో తాను నేరం చేయలేదని బుకాయించిన షర్వీన్‌శెట్టి.. విచారణ రెండో రోజున తన తప్పును అంగీకరించాడు. బాధితురాలు విదేశీ యువతి కావడం, ఆమెకు స్థానిక అధికారుల పట్ల పూర్తి అవగాహన ఉండదని ఈ అత్యాచార దాడికి పాల్పడటం తీవ్రమైన నేరమన్నారు.

# డిఎంకెలో చేరిన మాజీ సిఎం పన్నీర్‌సెల్వం



**చెన్నై, ఫిబ్రవరి 27:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ, రాష్ట్ర రాజకీయాల్లో కనీవినీ ఎరుగని భారీ మార్పు చోటుచేసుకుంది. దివంగత ముఖ్యమంత్రి జయలలితకు అత్యంత నమ్మకస్తుడు, మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఏఐఏడీఎంకే మాజీ నేత పన్నీర్‌సెల్వం అధికార ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకె)లో చేరారు. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ ఉదయం చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్న అరివాలయం ఒక్కసారిగా సందడిగా మారింది. కొన్ని రోజులుగా జరుగుతున్న ఊహాగానాలకు బలం చేకూరుస్తూ, పనీర్ సెల్వంతోపాటు ఆయన కుమారుడు, మాజీ ఎంపీ రవీంద్ర నాథ్, ఎమ్మెల్యే అయ్యప్పన్, ఇతర కీలక నేతలు కూడా డీఎంకేలో చేరారు. స్వయంగా సీఎం స్టాలిన్ ఆయనకు ఆహ్వానం పలికారు. పార్టీ కండువా కప్పి డీఎంకేలోకి సాదరంగా ఆహ్వానించారు. డీఎంకేలో చేరిన అనంతరం పన్నీర్ సెల్వం భావోద్వేగంగా మాట్లాడారు. డీఎంకేను తల్లిలాంటి పార్టీగా అభివర్ణించారు. అరిగ్నర్ అన్నా, కలైంజ్ఞర్ కరుణానిధి నిర్దేశించిన మార్గంలో పయనిస్తూ స్టాలిన్ అద్భుతమైన పాలన అందిస్తున్నారు. గత ఐదేళ్లలో ఆయన అందించిన అభివృద్ధిని చూసి దేశమంతా ఆశ్చర్యపోతోంది. అందుకే వారి నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకున్నానని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, జయలలితకు అత్యంత నమ్మకస్తుడిగా ముద్రపడ్డ నేత, దశాబ్దాల రాజకీయ ప్రత్యర్థి పార్టీలో చేరడం ఏఐఏడీఎంకే శ్రేణులకు పెద్ద షాక్ అనే చెప్పాలి. ఇది ఎన్నికల ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. పళని స్వామి, పన్నీర్‌సెల్వంలమధ్య కొనసాగిన విభేదాలు చివరకు పనీర్ సెల్వంను బహిష్కరించే వరకు వెళ్లింది. బహిష్కరణ అనంతరం పనీర్ తిరిగి ఏఐఏడీఎంకేలోకి చేరాలని భావించినా పళనిస్వామి సానుకూలంగా స్పందించలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పనీర్ సెల్వం తన కుమారుడు, తన అనుకూల నేతలతో కలిసి డీఎంకేలో చేరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పనీర్ సెల్వం డీఎంకే తరఫున తన సొంత నియోజకవర్గమైన బోడి మెట్టు నుంచి పోటీ చేయనున్నారు. పనీర్ చేరికతో దక్షిణ తమిళనాడులో డీఎంకెకు ప్రయోజనం ఉంటుందని ఆ పార్టీ భావిస్తోంది. అక్కడ తేవార్ల ఆధిపత్యం ఎక్కువ. దీంతో తేవార్లకు చెందిన పనీర్ సెల్వం ఓటు బ్యాంకు కలిసొస్తుందని పార్టీ విశ్వాసం. డీఎంకేలో చేరిన సందర్భంగా పనీర్ మాట్లాడుతూ పళనిస్వామి వైఖరితో ఏఐఏడీఎంకే రాబోయే ఎన్నికల్లో గెలిచే అవకాశం లేదన్నారు. అతడి అహంకారం, అధికార దుర్వినియోగం కారణంగా పార్టీ ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదని పనీర్ అన్నారు.

# ఇకపై సిమ్ ఉంటేనే వాట్సాప్

## కేంద్రం కీలక నోటిఫికేషన్




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** మెసేజింగ్ యాప్ వాట్సాప్‌పై కేంద్రం నిబంధనలు వెల్లడించింది. ఈ నెల 28వ తేదీ తర్వాత సిమ్ లేకుండా వాట్సాప్ పనిచేయదు. వాట్సాప్ వాడాలంటే సిమ్ తప్పనిసరిగా ఉండాలంటూ జారీచేసిన సిమ్ అనివార్యం నిబంధనకు ఈనెల 28 డెడ్‌లైన్‌గా కేంద్రం గతంలో ప్రకటించింది. ఈ డెడ్‌లైన్‌ను పొడిగించబోమని కేంద్రం స్పష్టంచేసింది. జాతీయ భద్రతకు, సైబర్ నేరగాళ్ల నుంచి యూజర్లను కాపాడేందుకే వీటిని అమలులోకి తెస్తున్నట్టు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్, స్నాప్‌చాట్, షేర్‌చాట్, జియోచాట్, అరాటై, జోష్ లాంటి సామాజిక మాధ్యమాల వినియోగానికి మొబైల్ ఫోన్‌లో తప్పనిసరిగా సిమ్ ఉండాల్సిందే. అలాగే కంప్యూటర్‌లో లాగిన్ చేసిన వాట్సాప్ కూడా ఆరు గంటల తర్వాత ఆటోమేటిక్‌గా లాగౌట్ అయిపోతుంది. సైబర్ నేరగాళ్లను పట్టుకోవడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మార్చి 1వ తేదీ నుంచి వాట్సాప్ నిబంధనలు కూడా మారిపోతున్నాయి. గతంలో మొబైల్ నుంచి సిమ్ తొలగించినా వాట్సాప్ యాప్ యథావిధిగా పనిచేసేది. మార్చి 1 నుంచి రిజిస్టరైన సిమ్ తప్పనిసరిగా మొబైల్‌లో ఉండాలి. పైగా అది క్రియాశీలకంగా (అంటే రీచార్జి చేసి) ఉండాలి. అలాగే గతంలో పర్సనల్ కంప్యూటర్లలో వాట్సాప్‌ను లాగిన్ చేస్తే అది ఎన్ని రోజులైనా క్రియాశీలకంగా ఉండేది. కొత్త నిబంధన ప్రకారం ఆరు గంటల తర్వాత అది ఆటోమేటిక్‌గా లాగౌట్ అయిపోతుంది. గతంలో ఎక్కడి నుంచైనా ఓటీపీని ఉపయోగించి వాట్సాప్‌కు లాగిన్ అయ్యే వారు. ఇప్పుడు సిమ్ లేకపోతే వాట్సాప్ పనిచేయదు.

# విడాకులు కోరుతూ విజయ్‌భార్య కోర్టులో పిటిషన్



**చెన్నై, ఫిబ్రవరి 27:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీవీకే పార్టీ అధినేత, నటుడు విజయ్‌కు భారీ షాక్ తగిలింది. విజయ్ నుంచి విడాకులు కావాలని కోరుతూ ఆయన భార్య సంగీత చెంగల్పట్టు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒక సినీ నటితో విజయ్‌కు వివాహేతర సంబంధమే కారణమని విడాకుల పిటిషన్‌లో సంగీత పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణకు అంగీకరించిన కోర్టు ఏప్రిల్ 20న కోర్టుకు రావాలని విజయ్‌కు నోటీసులు జారీ చేసింది. నటుడు విజయ్, సంగీత వివాహం 1999లో జరిగింది. విజయ్ ఒక సినీ నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపిస్తూ, ఈ కారణంగానే అతడి నుంచి విడాకులు కోరుతున్నట్లు సంగీత తన పిటిషన్‌లో వివరించారు. రెండేళ్లక్రితం విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతడిపై ఇటీవల బీజేపీ నేత తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నాయనార్ నాగేంద్రన్ మాట్లాడుతూ త్రిష ఇంటి నుంచి విజయ్ బయటికి రావాలన్నారు. తన వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాలకు వాడుతున్నారని విజయ్ విమర్శించాడు. ఈ అంశంపై త్రిష కూడా స్పందించింది. తన వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాల కోసం వాడుకోకూడదని సూచించింది. దీంతో నాగేంద్రన్ తర్వాత క్షమాపణ చెప్పాడు. దీంతో నెమ్మదిగా ఈ అంశం కనుమరుగైనట్లు అనిపించినా తాజాగా విజయ్ భార్య విడాకుల పిటిషన్‌తో ఈ ఎపిసోడ్ మళ్లీ చర్చనీయాంశంగా మారింది. నిజానికి విజయ్ త్రిష మధ్య బంధం గురించి చాలా కాలం నుంచి ప్రచారం జరుగుతోంది. ఇటీవల నాగేంద్రన్ వ్యాఖ్యలు, విడాకుల పిటిషన్ అంశం వీటికి బలం చేకూరుస్తోంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీ టీవీకే పోటీ చేయనున్న నేపథ్యంలో ఈ అంశం అతడి రాజకీయ భవిష్యత్‌పై ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది.

# సంక్షిప్తంగా..

## జీవితఖైదు వేసారని జడ్జిని బెదరించిన నిందితులు

**లక్నో, ఫిబ్రవరి 27:** కారుతో ఢీకొట్టి ఒక వ్యక్తిని హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులకు న్యాయమూర్తి శిక్ష విధించగా, వారు బెదిరింపులకు పాల్పడిన సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని బిజ్‌నోర్‌లో జరిగింది. మీ ఇల్లు ఎక్కడో తెలుసునని, విడిచిపెట్టేది లేదని ఇద్దరు నిందితులు బెదిరించగా, ప్రభుత్వం జడ్జికి అదనపు భద్రత కల్పించింది. 2024లో ఒక వ్యక్తిని కారుతో ఢీకొట్టి హత్య చేసిన కేసుపై బిజ్‌నోర్ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జస్టిస్ నిజేంద్ర కుమార్ విచారణ జరిపారు. నిందితులుగా తేలిన జైదీప్, పింటూ చౌహాన్‌లకు ఆయన జీవిత ఖైదు శిక్షను విధిస్తున్నట్లు తీర్పు వెలువరించారు. జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి ప్రకటన చేయగానే నిందితులు ఇద్దరు ఆగ్రహంతో ఊగిపోయారు. మీ ఇల్లు ఎక్కడో తెలుసంటూ బెదిరింపులకు గురి చేసే ప్రయత్నం చేశారు. నిందితులు బెదిరించిన నేపథ్యంలో న్యాయమూర్తికి అదనపు భద్రత కల్పించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంగ్రామ్ సింగ్ వెల్లడించారు.

## 'కేరళ స్టోరీ'పై నిషేధం ఎత్తివేత




**తిరువనంతపురం, ఫిబ్రవరి 27:** ది కేరళ స్టోరీ 2 సినిమా విడుదల కాకుండా కేరళ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను డివిజన్ బెంచ్ ఎత్తివేసింది. దీంతో ఈ చిత్రం విడుదలకు మార్గం సుగమమైంది. ఈ చిత్రం విడుదల కాకుండా హైకోర్టు సింగిల్ బెంచ్ ఇటీవల స్టే ఇచ్చింది. సీబీఎఫ్‌సీ తీరును తప్పుబడుతూ సినిమాను పునఃపరిశీలించాల్సిందిగా ఆదేశించింది. 15 రోజుల పాటు సినిమాపై స్టే విధించింది. సింగిల్ బెంచ్ తీర్పును చిత్ర నిర్మాత కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు. ఈరోజు సాయంత్రం వరకు ఇరువర్గాల తరఫున సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారి, జస్టిస్ పీవీబాలకృష్ణన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసింది. 2023లో విడుదలైన ది కేరళ స్టోరీ చిత్రానికి సీక్వెల్ ది కేరళ స్టోరీ 2 రూపొందింది.

## కోర్టు తీర్పును శిరసావహించాల్సిందే: అన్నాహజారే



**ముంబై, ఫిబ్రవరి 27:** లిక్కర్ పాలసీపై ఢిల్లీ కోర్టు ఇచ్చిన తీర్పును అంగీకరించాలని సామాజిక కార్యకర్త అన్నా హజారే అన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌కు కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై ఆయన స్పందించారు. న్యాయ వ్యవస్థ దేశానికి వెన్నెముక లాంటిదని, దాని నిర్ణయాలను గౌరవించాలని స్పష్టం చేశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ మంత్రి సిసోడియాతో పాటు 23 మందిని నిర్దోషులుగా రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం ప్రకటించింది. మద్యం విధానాన్ని రూపొందించే క్రమంలో అవినీతి జరిగినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొంది. కాగా, అరవింద్ కేజ్రీవాల్ రాజకీయ ఎదుగుదలకు ముఖ్యులైన అన్నా హజారే దీనిపై స్పందించారు. న్యాయ, భద్రతా వ్యవస్థల బలం మీద మన దేశం నడుస్తుందని తెలిపారు.

## జెఎన్‌యులో నిరసనలు హింసాత్మకం!




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** రాజధానిలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)కి చెందిన స్టూడెంట్ యూనియన్ (జేఎన్‌యూఎస్‌యూ) విద్యార్థులు చేపట్టిన ర్యాలీ హింసాత్మకంగా మారింది. ముందురోజు సాయంత్రం చేపట్టిన నిరసన ర్యాలీ హింసాత్మకంగా మారడంతో పోలీసులు విద్యార్థి నేతలను అరెస్టు చేశారు. జేఎన్‌యూఎస్‌యూకు చెందిన 14 మంది అగ్రనేతలు సహా మొత్తం 51 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జేఎన్‌యూఎస్‌యూ ప్రెసిడెంట్ అదితి మిశ్రా, మాజీ ప్రెసిడెంట్ నితీష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ గోపికా బాబు, జాయింట్ సెక్రెటరీ డానిష్ అలీసహా ఇతర నేతలను అరెస్టు చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. నిందితులపై వసంత్ కుంజ్ నార్త్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

# స్కూలుబస్సులో ఒంటరిగా ఏడుగంటలు.. అల్లాడిపోయిన చిన్నారి బాలుడు



**గురుగ్రామ్, ఫిబ్రవరి 27:** నోయిడాలో ఆసక్తికర ఘటన జరిగింది. స్కూల్ బస్సులో నిద్రపోయిన ఒక చిన్నారి బాలుడు ఏడు గంటలు అందులోనే ఉండిపోయాడు. బస్సులోంచి బయటికి ఎలా రావాలో తెలియక ఒంటరిగా అల్లాడిపోయాడు. నోయిడాలో ఒక ప్రైవేటు స్కూలుకు చెందిన ఐదేళ్ల బాలుడిని అతడి తల్లి గురువారం ఉదయం స్కూల్ బస్సు ఎక్కించింది. తర్వాత కొంతసేపటికి బస్సు స్కూల్‌కు చేరుకుంది. అందరు విద్యార్థులు బస్సు దిగి స్కూల్‌కు వెళ్లిపోయారు. కానీ, ఈ బాలుడు మాత్రం వెనకాల ఒక సీట్లో పడుకుని అలాగే ఉండిపోయాడు. బస్సు సిబ్బంది, స్కూల్ సిబ్బంది కూడా గమనించలేదు. అనంతరం బస్సును చాలా దూరంగా పార్కింగ్ ప్లేసులో నిలిపి డ్రైవర్ వెళ్లిపోయాడు. ఆ పార్కింగ్ ప్లేసులో వాహనాలు తప్ప ఎవరూ లేరు. మధ్యాహ్నం ఆ చిన్నారి బాలుడి కోసం తల్లి స్కూల్‌కు వచ్చింది. బాలుడు స్కూల్‌కు రాలేదని యాజమాన్యం చెప్పింది. తానే స్కూల్ బస్సు ఎక్కించానని తల్లి చెప్పింది. దీంతో స్కూల్ బస్సు అటెండెన్స్ చెక్ చేయగా బాలుడు అందులోకి ఎక్కినట్లు ఉంది. బాలుడు ఎలా మిస్సయ్యాడో తెలియక తల్లి, స్కూల్ సిబ్బంది, బస్సు సిబ్బంది తలలు పట్టుకున్నారు. భయాందోళనకు గురై బాలుడి గురించి వెతకడం ప్రారంభించారు. చివరకు చాలా సేపటి తర్వాత బాలుడిని పార్కింగ్ చేసిన బస్సులో గుర్తించారు. బాలుడిని గుర్తించేందుకు ఏడు గంటలు పట్టింది. అంటే ఏడు గంటలపాటు బాలుడు బస్సులోనే ఉండిపోయాడు. ఒంటరిగా సాయం కోసం అర్థించినా, అక్కడ చిన్నారిని పట్టించుకునే వాళ్లెవరూ లేరు. ఏడుస్తూ గంటలపాటు ఎదురు చూశాడు. చివరకు బాలుడిని గుర్తించిన సిబ్బంది తల్లికి అప్పగించారు. ఈ ఘటనలో బస్సు సిబ్బంది, స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంపై తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషంలో బస్సుల్ని మార్చడం వల్ల ఈ పొరపాటు జరిగిందని, చిన్నారి బాలుడిని తల్లికి అప్పగించామని యాజమాన్యం తెలిపింది.

## ఇరాన్ క్షిపణులపై ట్రంప్ వ్యాఖ్యలు తిరస్కరించిన ఇరాన్



**టెహ్రాన్, ఫిబ్రవరి 27:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్టేట్ ఆఫ్ ది యూనియన్ స్పీచ్‌లో ఇరాన్ క్షిపణి సామర్థ్యంపై చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ స్థాయిలో పెద్ద చర్చకు దారితీశాయి. ఇరాన్ అభివృద్ధి చేస్తున్న అత్యాధునిక క్షిపణులు త్వరలోనే అమెరికా గడ్డను తాకే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ను ట్రంప్ హెచ్చరించారు. ఈ విషయంలో అధ్యక్షుడి మాటలను అమెరికా సొంత నిఘా సంస్థలే తోసిపుచ్చాయి. ఇరాన్ కు అంత సామర్థ్యంలేదని, ఇప్పట్లో అది సాధ్యం కాదని చెప్పాయి. దీంతో వైట్ హౌస్ లో భేదాభిప్రాయాలు ముదిరాయి. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (డీఐఏ) నివేదికల ప్రకారం ఒక పూర్తిస్థాయి ఖండాంతర క్షిపణిని తయారు చేయడానికి ఇరాన్ కు 2035 వరకు సమయం పడుతుంది. ఒకవేళ చైనా లేదా ఉత్తర కొరియా వంటి దేశాలు సాంకేతిక సాయం అందించినా సరే కనీసం ఎనిమిదేళ్ల వరకు ఇరాన్ అమెరికాను తాకగలిగే క్షిపణిని సిద్ధం చేయలేదని మూడు ఇంటెలిజెన్స్ వర్గాలు ధ్రువీకరించాయి. ట్రంప్ తన వాదనను అతిశయోక్తిగా చెబుతున్నారని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ఆరోపణలను ఇరాన్ మంత్రి కొట్టిపారేశారు.

## ముంబైలో విదేశీ యువతికి చేదు అనుభవం

**ముంబయి, ఫిబ్రవరి 27:** ముంబైలో పర్యటిస్తున్న ఓ విదేశీ యువతికి వేధింపులు ఎదురయ్యాయి. తనకు ఎదురైన ఈ చేదు అనుభవాన్ని బాధితురాలే స్వయంగా వీడియో తీసి తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై ముంబై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండు నెలలుగా తాను భారతదేశంలో పర్యటిస్తున్నానని, ఇక్కడి ప్రజలు ఎంతో దయతో, ఆప్యాయంగా పలకరించారని, అయితే ఈ ఒక్కరోజు మాత్రం అందుకు భిన్నంగా జరిగిందని బాధితురాలు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మేము వద్దని చాలాసార్లు చెప్పినా, ఇద్దరు వ్యక్తులు మమ్మల్ని 15 నిమిషాలకు పైగా వెంబడించారు. ఫొటోలు కావాలంటూ తీవ్రంగా ఒత్తిడి చేశారు. దీంతో నాకు చాలా అసౌకర్యంగా అనిపించింది. ఒకానొక దశలో వారిని పక్కకు నెట్టేయాల్సి వచ్చింది. నో అంటే కాదని అర్థం చేసుకోవాలి. మన భద్రత, సౌకర్యమే అన్నింటికంటే ముఖ్యమని ఆమె రాసుకొచ్చారు. ఈ వీడియో వైరల్ కావడంతో ముంబై పోలీసులు స్పందించారు. అగ్రిపాడు పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు గుర్తుతెలియని నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 78(1), 3(5) కింద కేసు (ఎఫ్ఐఆర్ నెం. 97/26) నమోదు చేశారు. నిందితులను గుర్తించి, అరెస్ట్ చేసేందుకు దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. విదేశీ పర్యాటకుల పట్ల ఇలాంటి ఘటనలు జరగడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది డిసెంబర్ 10న గౌహతిలో జరిగిన ఓ సంగీత కచేరీలో తనను అసభ్యంగా తాకారన్నారు.

# విశాఖలో 30 ఏళ్లుగా రోడ్ల విస్తరణ లేదు

### భోగాపురం విమానాశ్రయం మొదలైతే ట్రాఫిక్ నరకం: భీమిలి ఎమ్మెల్యే గంటా

విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: విశాఖపట్నంలో 30 ఏళ్లుగా రోడ్ల విస్తరణ జరగలేదని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. అప్పటికీ, ఇప్పటికీ జనాభా, వాహనాలు భారీగా పెరిగాయని, ఈ ఏడాది జూన్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆరంభమైతే నగర ట్రాఫిక్ నరకాన్ని తలపిస్తుందని శాసనసభలో గురువారం ఆయన శూన్యగంటలో విశాఖలో ట్రాఫిక్ సమస్యపై మాట్లాడారు. విశాఖకు గూగుల్, ఇతర ఐటీ కంపెనీలు వస్తున్నాయని, వచ్చే నాలుగైదేళ్లలో కనీసం లక్ష మంది ఉద్యోగులు వస్తారని, వారి వాహనాలతో ట్రాఫిక్ మరింత దారుణంగా మారుతుందని తెలిపారు. ఈ సమస్యపైనా వివిధ శాఖల అధికారులతో సీఎం సమీక్షించి తగిన పరిష్కారం చూపాలని గంటా శ్రీనివాసరావు కోరారు.

# ఈ యేడాది చివరికి 10లక్షల ఇళ్లకు పైగా గృహ ప్రవేశాలు

సచివాలయం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ప్రతి పేదవానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇప్పటికే సుమారు 3లక్షల ఇళ్ళకు గృహ ప్రవేశాలు చేపట్టామని, మొత్తంగా ఈ ఏడాది చివరి నాటికి 10లక్షల ఇళ్ళకుపైగా గృహ ప్రవేశాలు చేయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇళ్ళులేని పేదలు దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నామని చెప్పారు. అసెంబ్లీలో హౌసింగ్, వ్యవసాయ శాఖ పద్దులపై ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఆయా శాఖల్లో ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. 2029లోగా పేదలందరికీ ఇళ్ళు కట్టించడంతోపాటు ఉచితంగా ఇంటిస్థలాలు కూడా ఇస్తాం అని సీఎం భరోసా ఇచ్చారు. అగ్రిటెక్‌తోపాటు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ ప్రభుత్వ మద్దతు అనే 5సూత్రాలతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. జాతీయ స్థూలఉత్పత్తిలో 10 శాతం మేర వ్యవసాయం నుంచి ఏపి కంట్రిబ్యూట్ చేస్తుంది. రాష్ట్రంలో 22.5లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయి. ఈ ఏడాది 69వేల కొత్త కనెక్షన్లు ఇచ్చాం. 2025-26లో ఉచిత విద్యుత్ కోసం రూ.13,722 కోట్లు కేటాయించాం. ప్రతి రైతుకు 3 విడతల్లో రూ.20,000 ఆర్థిక సాయాన్ని ఇస్తామని ఎన్నికల ముందు చెప్పాం. ఇప్పుడు రాష్ట్ర వాటాగా రూ.14,000. కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలుపుకొని రూ.20వేలు ఇస్తున్నాం. 47 లక్షల మందికీ రూ.6,309 కోట్లు రైతులకు అందించాం. వ్యవసాయ యాంత్రీకరణతోపాటు ఏఐ ఆధారిత సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం అని సీఎం వెల్లడించారు.

# మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం

### ● గంజాయి సాగును పూర్తిగా అరికట్టాం ● డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు ● డోర్ డెలివరీ చేసిన వారి కుటుంబ సభ్యులపైనా దృష్టి పెట్టాం ● అసెంబ్లీలో హోంమంత్రి వంగలపూడి అనిత



విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: మహిళలు, చిన్నారుల భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని హోంమంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. ఎవరైనా ఆడపిల్లల జోలికొస్తే అదే వారికి చివరి రోజు అనే సందేశం ప్రజల్లోకి పంపామని గుర్తుచేశారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో నేరాలు పెరిగాయన్న వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపణలను..శాసనమండలిలో మంత్రి అనిత తిప్పికొట్టారు. గంజాయి సాగును పూర్తిగా అరికట్టామని, డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టామని అనిత తెలిపారు. ఈ సంవత్సరం మహిళపై అత్యాచారాలు, హత్యలు నాలుగు శాతం తగ్గాయని చెప్పడానికి నేను చాలా గర్వంగా ఫీల్ అవుతున్నానని అన్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపిందన్నారు. గంజాయి నిర్మూలనకు ఈగల్ అనే ఒక ప్రత్యేకమైన టాస్కోఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. గంజాయి సాగును జీరో చేశామని అన్నారు. మదనపల్లి ఘటన చాలా బాధాకరమన్నారు. కానీ దారుణానికి ఒడిగట్టిన నేరస్థుడిపై ప్రభుత్వం వైపు నుంచి ఒత్తిడి పెరగడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని, నేరాలు చేసే ఎవరికైనా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. మహిళా రక్షణ, చిన్నారుల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. పోక్సో కేసుల్లో శిక్షలు 15 శాతం పెంచగలిగామన్నారు. 506 మందికి శిక్షలు పడితే.. అందులో 9 మందికి మరణ శిక్షలు పడ్డాయని, 169 మందికి జీవితఖైదు పడిందని చెప్పారు. నేరస్థులకు బెయిల్ రాకముందే శిక్షలు వేయించిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం వచ్చేసరికి స్కూల్ పిల్లల బ్యాగుల్లోకి గంజాయి వెళ్ళిందని, ఇప్పుడు అదే స్కూల్ పిల్లలు రోడ్డు మీదకు వచ్చి గంజాయి వద్దు బ్రో డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. ఒకానొక సందర్భంలో ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్,గంజాయి కు హబ్ అని, ఈరోజు గంజాయిని ఎలా అరికట్టాలో ఆంధ్రప్రదేశ్ ను చూసి నేర్చుకునే పరిస్థితి అని చెప్పారు. అందరినీ వెతుకుతున్నాం, ఆఖరికి డోర్ డెలివరీ చేసిన వారి కుటుంబ సభ్యులకు పై కూడా దృష్టి పెట్టామన్నారు. 24 గంటల నుండి 48 గంటల లోపు ఏ నిందితునైన పట్టుకొని అరెస్టు చేస్తున్నామని హోం మంత్రి అనిత అన్నారు.

# నేతన్నల ఇళ్ళల్లో వెలుగులు

### - బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత



సచివాలయం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: గత ప్రభుత్వ హయాంలో సంక్షోభంలో కూరుకు పోయిన చేనేత రంగాన్ని గట్టెక్కించి, నేతన్నల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర బీసీ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల్లో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, గత 5ఏళ్ళ పాలనలో చేనేత రంగానికి జరిగిన అన్యాయాలను ఎండగట్టారు. చేనేత సహకార సంస్థ (ఆప్కో)ను గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని మంత్రి వివరించారు. "కేంద్రం నుంచి ఆప్కో అభివృద్ధి కోసం వచ్చిన రూ.120 కోట్లు ఏమయ్యాయో సమాధానం లేదు. ఆ నిధులను జగన్ అనే గద్ద ఎత్తుకెళ్ళి పోయింది" అని ఘాటుగా విమర్శించారు. 2019–24మధ్య కాలంలో త్రిఫ్ట్ ఫండ్, పావలావడ్డీ, నూలు సబ్సిడీ వంటి కీలక పథకాలను నిలిపివేసి నేతన్నల పొట్టకొట్టారని మండిపడ్డారు.
చేనేత సహకార సంఘాలకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను తాము అధికారంలోకి రాగానే క్లియర్ చేస్తున్నామని, ఇప్పటికే రూ.7కోట్లు చెల్లించామని తెలిపారు. వచ్చే ఉగాది నాటికి మరో విడత బకాయిలను విడుదల చేస్తామని నేతన్నలకు తీపి కబురు అందించారు. 50ఏళ్ళు నిండిన 93వేల మంది కార్మికులకు రూ.4000 చొప్పున పెన్షన్ అందిస్తున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ 1నుంచి అమల్లోకి వచ్చేలా మగ్గం నేతన్నలకు 200యూనిట్లు, మరమగ్గాల వారికి 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. నూలు కొనుగోలుపై 15శాతం సబ్సిడీనీ పునరుద్దరించినట్లు తెలిపారు. ముద్ర పథకం ద్వారా 2640 మందికి రూ.24.43 కోట్ల రుణాలు అందించామని, 109 సంఘాలకు రూ.78.73 కోట్ల నగదు పరపతి కల్పించామని పేర్కొన్నారు. చిన్న క్లస్టర్ల అభివృద్ధి పథకం కింద 10 క్లస్టర్లను మంజూరు చేశామన్నారు.
చేనేత వస్త్రాల అమ్మకాలను పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కార్మికుల నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణా కార్యక్రమాలతో పాటు, రాష్ట్రంలో భారీ ఎత్తున టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామని సభకు వివరించారు.

# ఆప్కోలో డిజిటిలైజేషన్ 'స్కోచ్' అవార్డు

విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. తాజా మరో కేంద్ర ప్రభుత్వ అవార్డు ఆప్కో సొంతమైంది. ఆప్కోలో చేపట్టిన డిజిటిలైజేషన్‌ను అభినందిస్తూ స్కోచ్ అవార్డునే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వస్తోందన్నారు. నేతన్నలకు వ్యక్తిగతంలో ఆర్థిక భరోసా కలిగించేలా సంక్షేమ పథకాలు అమలుచేయడంతో పాటు వారికి 365 రోజుల ఈ కామర్స్ సంస్థల ద్వారా వినియోగదారుల ఇళ్లకు నేరుగా ఆప్కో ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నామన్నారు. ఆప్కో చేపట్టిన సంస్కరణలతో చేనేత అమ్మకాలు పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ఆప్కో చేపట్టిన డిజిటిలైజేషన్‌కు కేంద్ర ప్రభుత్వం స్కోచ్ అవార్డు ప్రకటించిందన్నారు చేనేత పాటు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పలు ఒప్పందాలు సైతం చేసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచే లక్ష్యంతో ఆప్కోను బలోపేతం చేస్తున్నామన్నారు. ఆప్కోలో డిజిటిలైజేషన్ చేపట్టామన్నారు. స్కోచ్ అవార్డు ప్రకటించిన కేంద్రానికి మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. గతేడాది రాష్ట్రంలో చేనేత, హస్తకళల ఉత్పత్తులకు ఏడు ఓడీ ఓపీ అవార్డులు వచ్చిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ఇదే ఉత్సాహంతో చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచడంతో పాటు ఆప్కో షోరూమ్‌ల మరింత బలోపేతానికి కృషి చేస్తామని మంత్రి సవిత తెలిపారు.
**అసెంబ్లీలో అమ్మకాలు అదుర్స్:** బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లకు విశేష స్పందన లభించిందని మంత్రి సవిత తెలిపారు. ఈ నెల 19వ తేదీన అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి చేతుల మీదుగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రఖ్యాతగాంచిన పొందూరు షర్ట్‌లు, పంచెలు, కండువాలు, మాధవవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, ఉప్పాడ, బందరు, మానపల్లి పట్టు, సాధారణ చీరలతో పాటు రెడీమేడ్ దుస్తులను ఈ స్టాళ్లలో అమ్మకానికి పెట్టారు వాటితో పాటు లుంగీలు, టవళ్లు, దుప్పట్లు, ఇతర చేనేత వస్త్రాలను అందుబాటులో ఉంచామన్నారు. వీటిని భారీగా కొనుగోలు చేసారన్నారు.

# ఆ బంధానికి అడ్డొస్తున్నాడని భర్త దారుణ హత్య

### ప్రియుడితో కలిసి భార్య ఘాతుకం

### తూర్పుగోదావరి జిల్లా దొడ్డిగుంటలో దారుణం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామంలో వివాహేతర సంబంధం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడన్న కోపంతో నిలదీసిన భర్తను, ప్రియుడు దారుణంగా హత మార్చిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. దొడ్డిగుంటకు చెందిన నాగేంద్ర భార్యతో అదే గ్రామానికి చెందిన శివ అనే వ్యక్తి కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయమై నాగేంద్ర దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో గురువారం రాత్రి తన భార్యతో కలిసి శివ ఉండటాన్ని నాగేంద్ర కళ్లారా చూశాడు. దీంతో ఆగ్రహానికి గురైన నాగేంద్ర శివను నిలదీయడంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మాట మాట పెరిగి అది పెనుగులాటకు దారితీయడంతో, శివ తన వద్ద ఉన్న బలమైన ఆయుధంతో నాగేంద్రపై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన నాగేంద్ర అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు.హత్య అనంతరం కొద్దిపాటి గాయాలైన శివ కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం అతను అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా నాగేంద్ర మరణం వెనుక నాగేంద్ర భార్య హస్తం కూడా ఉందని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న అనపర్తి సీఐ సుమంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ హత్యపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి భార్య పాత్రపై వస్తున్న ఆరోపణలను విచారిస్తున్నామని సీఐ తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని, వారికి తగిన శిక్ష పడేలా చేస్తామని ఆయన స్పష్టం చేశారు.


# గరుడ వారధిపై ప్రమాదం: యువకుడు మృతి

తిరుపతి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి నగరంలో యాత్రికుల సౌలభ్యం కోసం నిర్మితమైన గరుడవారధి ప్రమాదాలకు నిలయంగా మారింది. వారధిపై ద్విచక్రవాహనదారులు అతివేగంగా వాహనాలను నడిపి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికే గరుడవారధిపై ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా తాజాగా శుక్రవారం ఉదయం గరుడవారధిపై రామానుజ కూడలి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ద్విచక్రవాహనం కింద పడటంతో తిరుపతి తాతయ్య గుంటకు చెందిన ఆదం ద్వారక(23) క్రిందపడ్డాడు. అతనిమీదుగా గుర్తుతెలియని వాహనం వెళ్ళడంతో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు అతని స్నేహితుడు గౌతమ్‌తో కలసి తిరుచానూరులో ఓ వివాహానికి హాజరై తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బైక్ నడుపుతున్న గౌతమ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న తిరుపతి తూర్పు పోలీసులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని వైద్యకళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని, ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి విచారణ చేస్తున్నారు.

# రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

### - పెండింగ్ కేసులపై వేగవంతమైన దర్యాప్తు

### - తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రశాంతతకు మారుపేరైన తిరుపతి జిల్లాలో రౌడీ షీటర్లను కేవలం పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపకుండా, వారి కదలికలపై ఖచ్చితమైన మానిటరింగ్ ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలిచ్చారు. బీట్ కానిస్టేబుల్ వ్యవస్థ బలోపేతం చేయాలని, రాత్రి బీట్ విధులపై పర్యవేక్షణ పెంచాలని స్పష్టమైన సూచనలు చేశారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న సిసి కెమెరాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. శుక్రవారం తిరుపతి జిల్లా స్థాయి పోలీసు అధికారులతో సమగ్ర నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అనేక అంశాలపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా నమోదైన వివిధ నేరాలపై సవివరంగా సమీక్షించి, దర్యాప్తు వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. పెండింగ్ కేసులను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేసి, న్యాయస్థానాలలో సమయానికి చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు బాలలపై జరిగే నేరాలపై ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని స్పష్టం చేశారు. మిస్సింగ్ కేసుల విషయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టకుండా, వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలన్నారు. బాలికల మిస్సింగ్ కేసులలో వయస్సు వంటి అనవసర ప్రశ్నలు అడగకుండా, ముందుగా కేసు నమోదు చేయాలని, పాత నాన్ ట్రేసబుల్ కేసులను డిఎస్పీలు ప్రత్యేక దృష్టితో ట్రేస్ చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నేరాలు, సంఘవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, యువత జీవితాలను నాశనం చేసే ఈ తరహా నేరాలపై జిల్లా పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందనీ అన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గంజాయి నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి 'జీరో టోలరెన్స్' విధానాన్ని అమలు చేయాలని, నేరాల శాతాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ సుబ్బరాయుడు నిర్దేశించారు.



# యర్రగుంట్లలో రూ.2.52 కోట్ల నగదు సీజ్

యర్రగుంట్ల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: సరైన పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.2.52 కోట్ల నగదును యర్రగుంట్ల పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు కారులో భారీగా నగదును తరలిస్తుండడంతో పట్టుకున్నట్టు యర్రగుంట్ల సీఐ విశ్వనాధ్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు. ముద్దనూరు రోడ్డు నందు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఉన్న కారు ఆపి తనిఖీ చేశారు. బ్యాగు తెరచి చూడగా రూ.2.52 కోట్ల నగదు లభ్యమయ్యింది. వాహనంలో ఇద్దరినీ ప్రశ్నించగా. తమది ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామం అని తాము ప్రొద్దుటూరుకు చెందిన బంగారు వ్యాపారి మీరావలి వద్దా గుమాస్తాలుగా పనిచేస్తున్నామని గుంతకల్లులోని శంకర్ నారాయణ అనే వ్యక్తికి బంగారు నగలు ఇచ్చి డబ్బులు తీసుకెళ్తున్నామని చెప్పారు. అయితే వాటికి సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వనాధ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగమురళి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి లడ్డూ పై చర్చకు ప్రభుత్వం భయపడుతోంది

### ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్

విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: శాసనమండలిలో తిరుపతి లడ్డూపై చర్చకు ప్రభుత్వం భయపడుతుందని వైసిపి ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ అన్నారు. అసెంబ్లీ వద్ద వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ మండలిలో లడ్డూ ప్రసాదం అంశంపై చర్చించాలని డిమాండ్ చేసారు. దీనిపై వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ వాయిదా తీర్మానం ఇచ్చిందని తెలిపారు. హెరిటేజ్ డెయిరీ, ఇందాపూర్‌ల మధ్య సంబంధాలు బయటపడతాయని కూటమి ప్రభుత్వం చర్చ జరపకుండా అడ్డుకుంటుందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ ఆరోపించారు.
కల్తీ నెయ్యి సరఫరాలో హెరిటేజ్ పాత్రపై అనుమానాలు ఉన్నాయి. నెయ్యి సరఫరాపై వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. హెరిటేజ్ సంస్థపై సమగ్ర దర్యాప్తు జరగాలి. చంద్రబాబు తన స్వార్థ ప్రయోజనాల కోసం తిరుపతి లడ్డూపై తప్పుడు ప్రచారాలు చేశారు. శాసనమండలిలో చర్చకు రాకుండా కూటమి నేతలు భయపడుతున్నారని విమర్శలు గుప్పించారు.

# ఆవు నెయ్యి రూ.329 అంటూ వైసిపి డ్రామాలు

### వాళ్లను దేవుడు క్షమించడు: ఎమ్మెల్సీ సోము వీర్రాజు



విజయవాడ ఫిబ్రవరి 27 ప్రభాత వార్త ప్రతినిధి: ఇంట్లో వాడే నాణ్యమైన నెయ్యి రూ.2 వేలు ఉంటే రూ.329కి నెయ్యి వస్తుందా? దీనికి మాజీ సీఎం సమాధానం చెప్పాలి అని శాసనమండలి భారతీయ జనతాపార్టీ పక్ష నేత సోము వీర్రాజు ప్రశ్నించారు. అసెంబ్లీ ఆవరణలో మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామికి తక్కువ రేటుకు నెయ్యి కొని భక్తుల మనోభావాలు దెబ్బతియ్యాలనే ప్రయత్నం జరుగుతోంది. నిన్న చిట్‌చాట్‌లో గతంలో రూ.329 నెయ్యి కొంటే ఇప్పుడు రూ.658కి కొంటారా అని కామెంట్ చేసిన వారికి సరైన అవగాహన లేదు. తక్కువకు కొంటే అది నెయ్యి అవుతుందా? దీన్ని జగన్ గుర్తించాలి. రూ.359కి ఆవు నెయ్యి కొనాలంటూ డ్రామాలు ఆడితే వైకాపా వారిని దేవుడు క్షమించడు. దేవాలయాల్లో వాడే నెయ్యి, లడ్డూ విషయాల్లో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి. దీనిపై చర్చ జరగాలి అని వ్యాఖ్యానించారు.
ఇప్పటికే ఐదు రోజులు సభ సరిగ్గా జరగలేదు. బడ్జెట్‌పై చర్చ జరగలేదు. సమస్యలను సీరియస్‌గా తీసుకోకుండా వాయిదా వేస్తున్నారు.
సభ సజావుగా జరగడంలేదనే ఆవేదనతో ఛైర్మన్‌కు రిక్వెస్ట్ చేద్దామని వెళ్లాను. ప్రశ్నలు వాయిదా వేయవద్దని అడిగానని నామీదకు దాడికి ఉసిగొల్పుతున్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు శ్రమకోర్చి సమాధానాలు తయారుచేస్తే దాన్ని ఆషామాషీగా తీసుకోకూడ దని ఛైర్మన్‌కు నమస్కారం పెట్టి మరీ చెప్పడానికి ప్రయత్నిస్తే సోము వీర్రాజు అస్తమానూ ఎందుకు వస్తున్నాడని ప్రతిపక్షం వారు అడుగుతున్నారు. రూ.1.70 లక్షల జీతం తీసుకుంటున్నాం. ప్రశ్నించే అవకాశం రాకపోతే బాధనిపిస్తోంది. సభ్యులంతా అలా హుందాగా ప్రవర్తించాలనే ఉద్దేశంతో వెళ్లిన నాపై దాడి చేయడం ఎంతవరకు సబబు? అని సోము వీర్రాజు ప్రశ్నించారు.
ఈ రోజు సభలో తొలి ప్రశ్నకు ప్రతిపక్షానికి 20 నిమిషాలు మాట్లాడడానికి అవకాశం ఇవ్వడం ఏమిటి? ఇది ప్రశ్న కాదు. ప్రసంగంలా ఉంది. మంత్రికి మాత్రం ఏడు నిమిషాలు సమయం ఇవ్వారు అని సోము వీర్రాజు అన్నారు.

# టిటిడి భవనాలను రుయాకు కేటాయించాలి




తిరుపతి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: రాయలసీమ జిల్లాలకే తలమానికంగా ఉన్న తిరుపతిలోని ప్రభుత్వ రుయా ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్యసదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం సహకారం అందించాలని మాజీ కేంద్ర మంత్రి, మాజీ ఎంపి డాక్టర్ చింతామోహన్ కోరారు. వైద్యో నారాయణ హరి అనే నినాదంతో వైద్యసేవలను కూడా విస్తృతంగా అందిస్తున్న టిటిడి సంస్థకు చెందిన అలిపిరి వద్ద ఖాళీగా ఉన్న భవనాలను రుయా ఆస్పత్రికి అప్పగించడం వల్ల పేదరోగులకు మరింతగా అసవరమైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. శనివారం తిరుమలలో జరిగే టిటిడి బోర్డు సమావేశంలో ఆ దిశగా నిర్ణయాలు తీసుకుని వెల్లడించాలని సూచించారు. అలిపిరి వద్ద టిటిడి భవనాలను రుయాకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ చింతామోహన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి, రావణ్, శాంతి యాదవ్, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

# 'జగన్ కపటనాటకాలు ప్రజలు నమ్మరు'

తిరుపతి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఖరి చూస్తే 'కొత్తగా భక్తుడైన వాడికి బొట్లు ఎక్కువ' అనే సామెత గుర్తుకొస్తుందని జనసేన పార్టీ తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ ఎద్దేవా చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో ఓ నందీశ్వర ఆలయంలో చేపట్టిన హోమంలో ఆయన పాల్గొనడం, ముందస్తు పథకం ప్రకారం ఏర్పాట్లు చేసుకొని, కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని సూచించారేమోనని విమర్శించారు. హిందూ దేవాలయాలల్లో నిబంధనలకు విరుద్ధంగా, శిలువ గుర్తు కలిగిన కార్లను గుడి లోపలి వరకు తీసుకెళ్లడం సంప్రదాయ విరుద్ధమని ఖండించారు. దేవాలయాల్లో ఇలాంటి పనులు చేస్తూ హిందువులకు, సమాజానికి మీరు ఎటువంటి సంకేతాలు ఇస్తున్నారని కిరణ్ ప్రశ్నించారు. నుదుటిన పెద్ద పెద్ద బొట్లు పెట్టుకోవడం వంటివి కేవలం ప్రజలను నమ్మించడానికి జగన్ చేసే నాటకాలని కిరణ్ రాయల్ విమర్శించారు.



# యువత రాజకీయాల్లోకి రావాలి: స్పీకర్

విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: చదువు, ఉద్యోగం, కుటుంబం అనే పరిధిలను దాటి సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించేందుకు యువత రాజకీయాల్లోకి అడుగుపెట్టాలని శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. చట్టసభల పనితీరును ప్రత్యక్షంగా వీక్షించేందుకు వస్తున్న విద్యార్థులతో శుక్రవారం సభా విరామ సమయంలో ఆయన ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ఆసక్తికరమైన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. అసెంబ్లీని సందర్శించిన ఈ విద్యార్థులందరికీ త్వరలోనే రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును కూడా చూసే అవకాశం కల్పిస్తామని స్పీకర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే దిశగా ప్రభుత్వం చేపట్టిన ఏపీ అసెంబ్లీ విజ్ఞాన యాత్ర గత పది రోజులుగా అత్యంత ఉత్సాహంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం ఒక్కరోజే 558 మంది విద్యార్థులు శాసనసభను సందర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు మొత్తం 124 పాఠశాలలకు చెందిన 4276మంది విద్యార్థులు అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. చిన్నవయసులోనే అసెంబ్లీ కార్యకలాపాలను, సభా కార్యక్రమాలను దగ్గరుండి చూసే అరుదైన అవకాశం దక్కడం పట్ల విద్యార్థులు అమితానందం వ్యక్తం చేస్తున్నారు. స్పీకర్ అయ్యన్న, శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్, బోడె ప్రసాద్, బొండ ఉమ విద్యార్థులతో గ్రూప్ ఫోటోలు దిగారు.

# ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు... పెండింగ్ కేసులు పరిష్కరించండి

### సిఎస్‌కు హైకోర్టు ఆదేశం




విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన కేసులు వివిధ శాఖల వద్ద ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ 5,424 కేసులన్నీ పరిష్కారమయ్యే వరకు నిరంతరం పర్యవేక్షణ (కంటిన్యూస్ మాండమస్) చేస్తామంటూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీచేసిన జీవోలకు అనుగుణంగా సాధారణ కేసులలో మూడు నెలలు, క్లిష్టమైన కేసుల విచారణను ఆరు నెలల్లో ముగించాల్సి ఉందని గుర్తుచేసింది. అవి అమలు కావడం లేదని పేర్కొంది. ఈ జీవోలకు అనుగుణంగా కేసుల విచారణ పురోగతిపై నాలుగు నెలకోసారి అఫిడవిట్లు దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)ని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 19కి వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ ఇటీవల ఈమేరకు కీలక తీర్పు ఇచ్చారు.
**జాప్యానికి కారణాలను తెలపాలన్న హైకోర్టు:** తనపై ప్రారంభించిన క్రమశిక్షణ చర్యల ప్రొసీడింగ్స్ విచారణలో జాప్యం జరగడాన్ని సవాలు చేస్తూ విజయవాడ ఈఎస్ఐ ఆసుపత్రిలో ప్రత్యేక గ్రేడ్ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న జి.రవికుమార్ గతేడాది హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి వివిధ శాఖలలో విచారణలు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సమర్పించాలని, జాప్యానికి గల కారణాలను చెప్పాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సిఎస్)ని ఆదేశించారు. సిఎస్ సంబంధిత వివరాలను కోర్టు ముందు ఉంచుతూ కొత్త నియామకాలు, బదిలీలు, పదోన్నతులు, పదవీ విరమణ, డేటా లభ్యం కాకపోవడం, ఫైళ్లు వివిధ కార్యాలయాల్లో ఉండటం తదితర కారణాలతో క్రమశిక్షణ చర్యల విచారణల్లో జాప్యం జరుగుతోందని అన్నారు. గతేడాది డిసెంబర్ 15 నాటికి పలువురు ఉద్యోగులపై 5,424 క్రమశిక్షణ విచారణలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. అత్యధికంగా హోంశాఖలో 1,558, రెవెన్యూశాఖలో 854, రవాణా, రోడ్లు, భవనాలశాఖలో 384, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖలో 366, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖలో 301, తదితర శాఖలలో వివిధ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ప్రభుత్వ శాఖలలో క్రమశిక్షణ చర్యల కేసులు పెండింగ్‌లో ఉండటం కారణంగా న్యాయస్థానాలపై పని భారం పడుతోందని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఏళ్ల తరబడి విచారణలు తేలకపోవడంతో ఉద్యోగులు హక్కుల సాధన కోసం హైకోర్టును ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఛార్జి మెమోలతో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలని, సీనియార్టీని పునరుద్ధరించాలని, శాఖాపరమైన విచారణల్లో తీవ్ర జాప్యం కారణంగా విచారణ ప్రక్రియలను రద్దు చేయాలని వివరించారు.
**ఉద్యోగులకు మానసిక వేదన:** వీటితో పాటు పదవీ విరమణ ప్రయోజనాలను ఇప్పించాలని, తదితర అభ్యర్థనలతో హైకోర్టులో దాఖలయ్యే కేసుల సంఖ్య పెరిగిపోతున్నాయని తెలియజేశారు. క్రమశిక్షణ చర్యల విచారణ సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న కారణంగా ఉద్యోగుల మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. విచారణలు వేగంగా ముగించుకోవడం ఉద్యోగికి హక్కు మాత్రమే కాకుండా ఆయాశాఖల హక్కని పేర్కొన్నారు. విచారణలు సత్వరం పూర్తి చేయడం వల్ల తప్పుచేసిన వారికి శిక్షపడటంతో పాటు నిజాయతీగా పనిచేసే ఉద్యోగులకు నైతిక ధైర్యం పెరుగుతుందని హితవు పలికారు. న్యాయస్థానం తీర్పులిచ్చి వదిలేస్తే ఆశించిన ఫలితాలు రావని, ఈ నేపథ్యంలో సాధారణ పద్ధతికి భిన్నంగా కంటిన్యూయింగ్ మాండమస్ విధానాన్ని అనుసరించడానికి నిర్ణయించామని పేర్కొన్నారు.



## విషాదం నింపిన ఈత సరదా

### కాలువలో పడి 16 ఏళ్ల బాలుడు మృతి

పులివెందుల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: పులివెందుల పట్టణంలో ఈత సరదా విషాదంగా మారింది. రింగ్ రోడ్డు అంబకపల్లె రోడ్డు సమీపంలోని కాలువలో పడి 16 ఏళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని చిన్న రంగాపురం గ్రామానికి చెందిన బుక్కాపురం మహేంద్ర (16) అనే బాలుడు స్నేహితులు శివసాయి చరణ్, సిద్దార్థలతో కలిసి కాలువ వద్దకు ఈతకు వెళ్లారు. ఈ సందర్భంగా కాలువలోకి దిగిన అతడు ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని శ్రమించి బాలుడి మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం సీతారాం రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టారు. బాలుడి ఆకస్మిక మృతి కుటుంబ సభ్యులను, గ్రామస్తులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాలువలు, చెరువుల వద్ద జాగ్రత్తలు పాటించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# అంగన్వాడీల బలోపేతమే ప్రభుత్వ ధ్యేయం

● సుపోషణ్ అభియాన్‌లో ఏపి అగ్రగామి ● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సరికొత్త రికార్డులను సృష్టిస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి ప్రకటించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన సుపోషణ్ అభియాన్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని, ఇది అంగన్వాడీ కార్యకర్తలు ఆయాల కృషి వల్లే సాధ్యమైందని ఆమె కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సుపోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి మొత్తం 76 గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపిక య్యాయి. అత్యధిక అవార్డులు తూర్పుగోదావరి జిల్లా (11 పంచాయతీలు), అత్యల్ప అవార్డులు ఎన్టీఆర్ మరియు తిరుపతి జిల్లాలు (ఒక్కొక్కటి) ఎంపికైన ప్రతి పంచాయతీకి రూ.1 లక్ష నగదు బహుమతి అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులను అంగన్వాడీ పోషణ కార్యక్రమాలకు 50 వేలు, అంగన్వాడీ ఆయాలకు 25 వేలు, కమ్యూనిటీ ఆర్గనైజేషన్‌కు 25 వేలు వినియోగిస్తారని తెలిపారు. గతంలో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు 70 శాతం ఉండగా, ప్రస్తుత ప్రభుత్వ కృషితో అది 96 శాతం కి చేరిందని మంత్రి తెలిపారు. ఈ విషయంలో కూడా ఏపీ జాతీయ స్థాయిలో నెంబర్ వన్ స్థానంలో ఉందని ఆమె పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు కోరిన 10 ప్రధాన డిమాండ్లలో 9 డిమాండ్లను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసిందని మంత్రి స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మూడు సార్లు జీతాలు పెంచారని, ఒకేసారి 7 వేలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకి దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం కేవలం 1,000 పెంచి మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు 40 రోజులు ధర్నా చేసిన కనీసం పట్టించుకున్న నాధుడే లేరని గుర్తు చేశారు. ప్రస్తుతం అంగన్వాడీ టీచర్ల జీతం 11,500గా ఉందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 55,745 అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, సూపర్‌వైజర్లకు రూ.75 కోట్లతో 5జీ మొబైల్ ఫోన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. 15యాప్‌ల గందరగోళాన్ని తొలగించి, 'సింగిల్ యాప్' విధానాన్ని అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు. కొత్త యూనిఫార్ములు, ప్లే మెటీరియల్, టీవీలు, టాయిలెట్లు, ఆర్ఓ ప్లాంట్లు, వంట కోసం అధునాతన స్టవ్‌లు, పాత్రలను ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. సిబ్బందికి 15 రోజుల వేసవి సెలవులు ఇస్తున్నామని, దానిని 30 రోజులకు పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. రిటైర్మెంట్ గ్రాట్యుటీని టీచర్లకు 1.8 లక్షల నుంచి 2 లక్షల వరకు, ఆయాలకు 1.1 లక్షల నుంచి 1.3 లక్షల వరకు పెంచినట్లు వెల్లడించారు.

ప్రస్తుతం జీతాల పెంపు కోసం ఆందోళన చేస్తున్న అంగన్వాడీ సిబ్బంది రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకోవాలని మంత్రి కోరారు. ఒక సోదరిగా మీకు చెబుతున్నాను మీరు ఆందోళన విరమించండి అంతా మంచే జరుగుతుంది. 'అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలకు తల్లి తర్వాత తల్లి లాంటివారు. మీ సమస్యలను ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. కూటమి ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడానికి పూర్తి అండగా ఉంటుంది" అని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ఏప్రిల్ 2 న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపంలో జరిగే జాతీయ సుపోషిత్ గ్రామ పంచాయతీ అభియాన్ సత్కార వేడుకలో ఈ విజేత పంచాయతీల ప్రతినిధులను సత్కరించనున్నారు. రాష్ట్రం తరపున అంగన్వాడీ వర్కర్లు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, అత్యుత్తమ పనితీరు కనబరిచిన చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారిణి పాల్గొంటారన్నారు.

## రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించేలా నంది నాటకోత్సవాలు

● క్రియేటివ్ ఎకానమీ ద్వారా ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలి

● రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఏర్పాటుకు కసరత్తు

● ఎఫ్‌డిసిపై సమీక్షా సమావేశంలో సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీని ప్రోత్సహించేలా పర్యాటక, చలనచిత్ర అభివృద్ధి సంస్థ, డిజిటల్ కార్పొరేషన్లు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఎఫ్.డి.సి మేనేజింగ్ డైరెక్టర్ విశ్వనాథన్, అధికారులతో మంత్రి దుర్గేష్ సుదీర్ఘ సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రతిష్టను చాటి చెప్పే నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు, టీవీ, థియేటర్ అవార్డులు మరియు కందుకూరి పురస్కారాలను త్వరలోనే నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి జ్యూరీ ఏర్పాటు, వేదికలు, తేదీలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సినిమా షూటింగ్‌లను ప్రోత్సహించేలా నూతన ఫిల్మ్ పాలసీని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలో షూటింగ్ జరుపుకునే చిత్రాలలో ఆయా పర్యాటక ప్రాంతాల పేర్లను తెరపై ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సినిమా స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు, రీరికార్డింగ్ స్టూడియోల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. స్థానిక కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఒక ప్రత్యేక డేటా బ్యాంక్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఏర్పాటు విషయమై ఇప్పటికే పలు దఫాలు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో చర్చించగా వారు సానుకూలంగా స్పందించారని మంత్రి దుర్గేష్ అధికారులకు వెల్లడించారు. యానిమేషన్, డిజిటల్ మీడియా, ఓటీటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించుకుని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మార్గాలను అన్వేషించాలని సూచించారు. ఇందుకోసం త్వరలోనే రాష్ట్ర స్థాయిలో ఒక భారీ వర్క్‌షాప్ నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు ఎఫ్డిసి ద్వారా ఫిల్మ్స్ రూపొందించాలని అధికారులను మంత్రి దుర్గేష్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎఫ్ డిసి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ నాయక్, మేనేజర్ చల్లా శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### చిన్నారులపై అసభ్యకరంగా ప్రవర్తన

## వృద్ధుడిపై పోక్సో కేసు




కావలి (నెల్లూరు), ఫిబ్రవరి 27 ప్రభాత వార్త: అభం, శుభం తెలియని చిన్నారులపై ఓ వృద్ధుడు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన పట్టణంలో కలకలం రేపింది. మిక్చర్ న్యాడల్స్ అమ్ముతూ మాయ మాటలు చెప్పి ఇంటికి తీసుకెళ్ళి అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం రెండవ పట్టణ సిఐ గిరిబాబుతో కలసి డిఎస్‌పి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఇద్దరు చిన్నారులను చుండూరు జ్ఞానానంద ప్రసాద్(57) అనే అతను మిక్చర్, న్యాడుల్స్ ఉచితంగా ఇస్తానని ఆశచూపి ఇంటికి తీసుకొని వెళ్ళడం జరిగిందన్నారు. అక్కడ చిన్నారులపై అసభ్యంగా ప్రవర్తించాడని జరిగిన విషయాన్ని చిన్నారులు వారి తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు వెంటనే రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకొన్నారు. అతనిని విచారించి నిందితునిపై పోక్సో కేసు నమాదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో టూటౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సంస్థాగతంగా బిజెపిని బలోపేతం చేద్దాం

### - బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎస్ మాధవ్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్



కార్యక్రమానికి హాజరైన బిజెపి శ్రేణులు

అనంతపురం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త బ్యూరో: క్షేత్రస్థాయి నుంచి సంస్థాగతంగా బిజెపిని బలోపేతం చేద్దాం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎస్ మాధవ్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన ప్రశిక్షణ మహాభియాన్ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 944 మండలాల్లో ప్రశిక్షణ మండల మహాభియాన్ కార్యక్రమాల్లో భాగంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. సంస్థాగత శిక్షణతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను శిక్షణలో వివరించి క్షేత్రస్థాయికి వాటిని తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు.

అదేవిధంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాంకీబాత్ కార్యక్రమాలను వీక్షించేందుకు ఏర్పాటు చేయడమే కాకుండా వాటిపై విద్యార్థులకు పోటీలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. దీంతో పాటు జనవారధి వేదికగా ప్రజా సమస్యలను పరిష్క రించేందుకు బిజెపి కృషి చేస్తోందన్నారు. ప్రతి కార్యకర్త ప్రశిక్షణ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని బిజెపిని సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆయన దిశనిర్దేశం చేశారు. రాబోవు రోజుల్లో బిజెపి కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడమే శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, రాష్ట్ర నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి, కాపురామచంద్రా రెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసులు, గుడిసె దేవానంద్, మహ్మద్ రఫీ, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న వరప్రసాద్ యాదవ్, ఓబిసి సంఘం నేతలు

## మార్చి 16న ఓబిసిల చలో పార్లమెంట్

విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ఓబిసి డిమాండ్ల సాధనకై మార్చి 16 న పార్లమెంట్ ముట్టడిస్తామని ఓబిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వరప్రసాద్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఏలూరు రోడ్‌లోని ఓబిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ దేశంలో 52 శాతానికి పైగా జనాభా కలిగి ఉన్న ఓబిసిలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, ఓబిసి రిజర్వేషన్ల బిల్లు మార్చిలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. గత 5 దశాబ్దాలుగా ఓబిసిలను సామాజికంగా, రాజకీయంగా అణిచివేసిన కాంగ్రెస్ పార్టీ, భారత్ జోడో యాత్ర ద్వారా ఓబిసి జనగణన, చట్టసభలలో రిజర్వేషన్ల అమలు, ఓబిసి మంత్రిత్వ శాఖపై గళమెత్తే కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ఎందుకు ఓబిసి అంశాల పై నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. ఓబిసిల పట్ల రాహుల్ గాంధీ తీరుకు నిరసనగా మార్చి 17న ఎఐసిసి కార్యాలయం ముట్టడిస్తామని వరప్రసాద్ యాదవ్ హెచ్చరించారు. మార్చి 18న ఓబిసిల జాతీయ సదస్సు ఢిల్లీ కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో జరుగుతుందని వరప్రసాద్ తెలిపారు. ఈ సదస్సులో వివిధ పార్టీల జాతీయ నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఏపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాటపర్తి పోసిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్న సుబ్బారావు, ఓబిసి మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ రమాదేవి, రాష్ట్ర కార్యదర్శి యు.పేరయ్య, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్ శిఎం.శివన్నారాయణ, పాల్గొన్నారు. విజయవాడ నగర ఓబిసి మహిళ సంఘం అధ్యక్షురాలు మల్లెడ రూప, నందిగామ నియోజక వర్గ కన్వీనర్‌గా కె.నవీన్, ఎన్టీఆర్ జిల్లా కో ఆర్డినేటర్‌గా ఎం. మల్లిఖార్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.శివన్నారాయణ చందర్లపాడు, నందిగామ, వీరులపాడు, కంచికచర్ల మండల ఓబిసి సంఘం అధ్యక్షులుగా గోపీకృష్ణ, పి.నాగరాజు, వై.శ్రీనివాస్, బి.రామకృష్ణలను నియమిస్తూ జాతీయ అధ్యక్షులు వరప్రసాద్ యాదవ్ నియామక పత్రాలు అందజేశారు.

# శ్రీ కనకదుర్గమ్మ మహాకుంభాభిషేకానికి కంచి పీఠాధిపతులకు ఆహ్వానం



శ్రీ కాంచీ పీఠాధిపతులకు మహాకుంభాభిషేక ఆహ్వానమందిస్తున్న దృశ్యం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో త్వరలో నిర్వహించ తలపెట్టిన అత్యంత పవిత్రమైన మహాకుంభాభిషేక మహోత్సవానికి కంచి కామకోటి పీఠాధిపతులను ఆలయ ఇఒ వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణలు ఆహ్వానం శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా కంచి మహాస్వామి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారికి పాదాభివందనం చేసి మహాకుంభాభిషేక ఆహ్వాన పత్రికను అందజేశారు. శ్రీఅమ్మవారి ఆశీస్సులతో జరగనున్న ఈ మహాక్రతువుకు విచ్చేసి భక్తులను అనుగ్రహించాలని వారు మహాస్వామి వారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మర్యాదలతో మహాస్వామి వారికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

**దుర్గమ్మవారి సేవలో మల్లు భట్టి విక్రమార్క:** ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లను తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ రంగారావు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిడుగు రుద్రరాజు వున్నారు.



తెలంగాణ ఉపముఖ్యమంత్రికి దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం



**దుర్గమ్మకు కూచిపూడి నృత్య నీరాజనం:** ధర్మపథం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కూచిపూడి నృత్య నీరాజనాన్ని కూచిపూడి కళాకారిణి కోట సరిత నేతృత్వంలో వారి శిష్య బృందం అమ్మవారి సన్నిధిలో అద్భుతమైన ప్రదర్శనను ఇచ్చారు. అంభా పరాకు, వినాయక కౌత్వంతో ప్రారంభించి నమః శివాయతే, నర్తన గణపతిం, శివ స్తుతి, జయ జయ దుర్గే, రామదాసు కీర్తన, లలిత హారతి, ప్రభు శివాష్టకం వంటి ప్రసిద్ధ కీర్తనలకు అత్యంత కష్టతరమైన తరంగం ప్రదర్శించి భక్తుల మెప్పు పొందారు.



### అనంత ఎమ్మెల్యే అనుచరుల దౌర్జన్యాలపై

## కలెక్టరేట్ ముట్టడిస్తాం: సిపిఐ

అనంతపురం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే మరియు ఆయన అనుచరులపై భూదందాలు, భూఅక్రమాలు, అవినీతి ఆరోపణల నేపథ్యంలో బాధితులతో కలిసి మార్చి చివరిలో కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ ప్రకటించారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో నగరంలో భూములు, ఇళ్ల స్థలాలు కబ్జా చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. సామాన్య ప్రజలు తమ భూములు, ప్లాట్లు అక్రమంగా ఆక్రమించబడుతున్నాయని, డబ్బులు వసూలు చేయడానికి బెదిరింపులు ఎదుర్కొంటున్నారని పలువురు బాధితులు సిపిఐని ఆశ్రయిస్తున్నారని తెలిపారు. నగరంలో టౌన్ ప్లానింగ్, మున్సిపల్ కార్యాలయం, పోలీస్, మైనింగ్ తదితర ప్రభుత్వ శాఖల్లో ఎమ్మెల్యే పేరు చెప్పుకొని నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేయాలని డిమాండు చేస్తామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్, జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, జిల్లా సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, జె.రాజారెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధి చెందిన రాష్ట్రాలే... దేశాన్ని బలోపేతం చేస్తాయి

● అమరావతే భవిష్యత్తు.. దేశానికి గర్వకారణం ● పవన్ నాకు జీవితాంతం పెద్దన్నే

● ముంబైలో ఐడియాస్ ఆఫ్ ఇండియా సదస్సులో మంత్రి నారా లోకేష్




విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: అభివృద్ధి చెందిన రాష్ట్రాలే దేశాన్ని బలోపేతం చేస్తాయని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. ముంబైలో ఒక న్యూస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన ఐడియాస్ ఆఫ్ ఇండియా 2026 సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జర్నలిస్ట్ మేఘా ప్రసాద్‌తో జరిగిన ఫైర్ సైడ్ చాట్‌లో ఆయన ఏపీ అభివృద్ధి ప్రణాళికలు, రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక మాట ఇస్తే అది జరిగి తీరుతుందని, ఆయన నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించడమే తన ముందున్న కర్తవ్యమని లోకేశ్ అన్నారు. తమపై ఎలాంటి ఒత్తిడి లేదని, సవాళ్లను ఇష్టంగా స్వీకరిస్తామని తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన పవన్ కళ్యాణ్ తనకు బిగ్ బ్రదర్ అని, జీవితాంతం తనకు పెద్దన్నేనని ఆయన వ్యాఖ్యానించారు. మేము కేవలం ఒక నగరాన్ని మాత్రమే నిర్మించడం లేదు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ అనే నినాదాన్ని బలంగా నమ్ముతాం. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను ఆర్థిక రీజియన్లుగా అభివృద్ధి చేస్తూ, వాటి పరిధిలో పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నాం," అని లోకేశ్ వివరించారు. క్లస్టర్ విధానాన్ని వివరిస్తూ, "ఉదాహరణకు ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ఫాక్స్‌కాన్ లాంటి ఒక కంపెనీని తీసుకురావడమే కాకుండా, ఐఫోన్ అసెంబుల్‌కు అవసరమైన అన్ని విడిభాగాల తయారీదారులను ఒకేచోటకు తీసుకురావడమే మా వ్యూహం. దీని ద్వారా అభివృద్ధిని రాష్ట్రవ్యాప్తంగా వికేంద్రీకరించడం సుసాధ్యమవుతుంది" అని తెలిపారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఆకర్షించేందుకు ఎకరా భూమిని 99 పైసలకే ఇస్తున్నామని, తాము ఇచ్చే భూమి విలువ కన్నా ఆ కంపెనీల రాకతో ఏర్పడే ఆర్థిక కార్యకలాపాలు, ఉద్యోగ కల్పన ఎన్నో రెట్లు అధికమని లోకేశ్ తెలిపారు. కాగ్నిజెంట్ కంపెనీని ఉదాహరణగా చూపుతూ, "విశాఖలో ఆ కంపెనీ ఏర్పాటుతో 25,000 ఉద్యోగాలు వస్తాయి. ఏటా రూ.1500 కోట్ల ఆర్థిక కార్యకలాపాలు జరుగుతాయి. భూమి విలువ కన్నా రాష్ట్రానికి వచ్చే ఈ ప్రయోజనం ఎంతో పెద్దది" అని స్పష్టం చేశారు.

**నమో సర్కార్‌తో పెట్టుబడుల వెల్లువ:** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని లోకేష్ పేర్కొన్నారు. "ఒకటి, అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉన్న అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు... రెండవది, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. కేవలం 17 నెలల్లోనే దేశంలోనే అతిపెద్దదైన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు అన్ని అనుమతులు ఇచ్చాం. మార్చి మూడోవారంలో దానికి శంకుస్థాపన చేయబోతున్నాం. మూడవది, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. ఢిల్లీలో ప్రధాని మోదీ, ఏపీలో సీఎం నాయుడు కలయికను నేను 'నమో' (నాయుడుమోదీ) అని పిలుస్తాను. ఈ నాయకత్వం వల్లే భారతదేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి వచ్చాయి" అని ఆయన గణాంకాలతో వివరించారు.

**అమరావతే భవిష్యత్తు.. దేశానికి గర్వకారణం:** అమరావతి నిర్మాణం శరవేగంగా సాగుతోందని, ఇది భవిష్యత్తుకు చిరునామా అని లోకేశ్ అన్నారు. "పారిశ్రామికవేత్తలు ఇప్పుడు ఏపీకి రాకపోతే, భవిష్యత్తులో ఎందుకు రాలేకపోయామని బాధపడతారు. ప్రతి వంద రోజులకు ఒకసారి అమరావతికి వచ్చి చూడండి. అక్కడ పనులు ఎంత వేగంగా జరుగుతున్నాయో మీకే తెలుస్తుంది. భారతదేశం గర్వించేలా రాజధానిని నిర్మిస్తున్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి కృషితో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడామని, ప్రస్తుతం అది లాభాల బాటలో పయనిస్తోందని తెలిపారు. తాము సమిష్టి సమాఖ్య స్ఫూర్తిని విశ్వసిస్తామని, డేటా సెంటర్ పాలసీ రూపకల్పనలో కేంద్రంతో కలిసి పనిచేసి దేశవ్యాప్తంగా ప్రయోజనం చేకూర్చే ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించామని లోకేశ్ పేర్కొన్నారు.



సిఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

## నేడు చీపురుపల్లిలో సిఎం పర్యటన

● పింఛన్ల పంపిణీ ● ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

చీపురుపల్లి (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం చీపురుపల్లిలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన కోసం చీపురుపల్లి మండలం రావివలస, పైలపేట గ్రామంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా క్షేత్ర స్థాయి లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం తన పర్యటనలో భాగంగా ఉదయం 11.10 గంటలకు రావివలస గ్రామంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుండి చీపురుపల్లి సి.హెచ్.సికు చేరుకొని హెచ్.పి.వి వాక్సిన్ కార్యక్రమంలో పాల్గొంటారు.

ప్రజావేదిక వద్దకు 12 గంటలకు చేరుకొని, 1 గంట వరకు ప్రధాని మోడీ హెచ్.పి.వి వాక్సిన్ ప్రారంభోత్సవంపై నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరవుతారు. ఆ తర్వాత ప్రజావేదిక సమావేశంలో పాల్గొంటారు. అనంతరం పైలపేట శివారు గ్రామంలోని లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను అందజేస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. జిల్లాలో రూ. 114.83 కోట్ల పింఛన్ల పంపిణీజిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఫిబ్రవరి 28న మొత్తం 2,69,748 మందికి సుమారు రూ. 114.83 కోట్లు పంపిణీ చేయనున్నారు. ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని రావివలస గ్రామ సచివాలయ పరిధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా చీపురుపల్లి నియోజకవర్గంలోని మొత్తం 36,903మందికి రూ.15.80 కోట్లు, అలాగే చీపురుపల్లి మండలంలోని 8,431మందికి రూ.3.56 కోట్లు పంపిణీ చేయనున్నారు. కేవలం రావివలస స్వర్ణ గ్రామం పరిధిలోనే 387 మందికి రూ.16 లక్షలను అందజేస్తారు.




# ఏపికి మరో కీలక కంపెనీ

**● తొలిదశలో 77 మిలియన్ డాలర్ల పెట్టుబడి ● శ్రీసిటీలో ఎలక్ట్రికల్ స్టీల్ కర్మాగారం ● మెట్ గ్లాస్ ఇండియా పేరుతో జపాన్-అమెరికా సంయుక్త సంస్థ ప్రొటీరియల్ సంస్థ ఆధ్వర్యంలో పరిశ్రమ ఏర్పాటు**

విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో పెట్టుబడులను ఆహ్వానించేందుకు కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఇప్పటికే ఎన్నో కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడతామని ప్రకటించాయి. ఇందులో కొన్ని కార్యరూపం దాల్చాయి. మరికొన్నింటికి అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే ఈ శుక్రవారం జపాన్–అమెరికా సంయుక్త సంస్థ ప్రొటీరియల్ రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించాయి. రాష్ట్రంలో మరో కీలక కంపెనీ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. తిరుపతి శ్రీసిటీలో ఎలక్ట్రికల్ స్టీల్ కర్మాగారం ఏర్పాటు చేయనున్నట్లు అమెరికా- జపాన్ సంయుక్త సంస్థ ప్రొటీరియల్ ప్రకటించింది. మెట్ గ్లాస్ ఇండియా పేరుతో కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రొటీరియల్ సంస్థ ప్రతినిధులు దిల్లీలో వెల్లడించారు. ఈ సంస్థ అల్లాయ్ రిబ్బన్‌ను ఉత్పత్తి చేయనుంది. తొలిదశలో సుమారు 77 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. 200 మందికి నేరుగా ఉద్యోగాలు కల్పించనుంది. ఈ ఏడాది 2026 అక్టోబర్ నుంచి కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు సంస్థ చైర్మన్ శాన్ స్టాక్ తెలిపారు. అధునాతన జపాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్లాంట్‌లో ఉపయోగించనున్నట్లు చెప్పారు. తొలిదశలో ఏడాదికి 30 వేల టన్నుల సామర్థ్యంతో ప్లాంట్ పని చేస్తుందని వివరించారు. ప్లాంట్‌లో పని చేసేందుకు స్థానిక యువతకు ఎక్కువ అవకాశం ఇస్తామని, ఇందుకు పలువురిని ఎంపిక చేసి వారికి జపాన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

గత ఏడాది తిరుపతి జిల్లా శ్రీ సిటీలో డైకిన్ మూడో ప్లాంట్ నిర్మాణంతో ఏడాదికి 50 లక్షల ఏసీలను ఉత్పత్తి చేయనున్నామని డైకిన్ సంస్థ దక్షిణ ప్రాంత వైస్ ప్రెసిడెంట్ నిమ్మగడ్డ కుటుంబరావు తెలిపారు. ఏపీలో ఇప్పటికే 2 ప్లాంట్లను ఏర్పాటు చేశారని, మూడోది ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో డైకిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. మూడో ప్లాంట్ నిర్మాణంలో భాగంగా రూ.2,500 వేల కోట్లు పెట్టుబడులు పెడుతున్నామని అన్నారు.

రాష్ట్రంలో యువతకు 5 వేల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మూడు ప్లాంట్లతో కలిపి ఏటా 50 లక్షల ఏసీలను ఉత్పత్తి చేస్తామన్నారు. వీటిల్లో 15 నుంచి 20 లక్షల ఏసీలను విదేశాలకు ఎగుమతి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణనిచ్చి, ఉద్యోగాల్లోకి తీసుకుంటామని చెప్పారు.

కొత్తగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. తడ చుట్టుపక్కల ఉన్న మహిళలకు తర్ఫీదు ఇచ్చి, ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై ఉన్న నమ్మకం, కంపెనీలకు అందిస్తున్న ప్రోత్సాహకాలతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నామని నిమ్మగడ్డ కుటుంబరావు వెల్లడించారు.



విజేతలతో ప్రవీణ్ ఆదిత్య తదితరులు

## ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సైన్స్ మహోత్సవ్

విజయవాడ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: ఏపి సైన్స్ సిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సైన్స్ సమగ్ర మహోత్సవ్ 2౩26 కు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం లభించింది. సైన్స్ ఉత్సవ్ ముగింపు కార్యక్రమం విజయవాడలోని చిట్టూరి పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ యండి ప్రవీణ్ ఆదిత్య, ఏపి సైన్స్‌సిటీ సీఈఓ కేశినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా జ్యోతి వెలిగించి సభా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతి నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇటువంటి సైన్స్ ఉత్సవాలు తోడ్పడతాయన్నారు. ఈవిధమైన కార్యక్రమాలు తరచు నిర్వహించటం వల్ల విద్యార్థులకు విభిన్న కోణాల్లో ఆలోచనలు వస్తాయని అభిప్రాయం వ్యక్తం చేసారు. విద్యార్థులకు సాంకేతిక రంగంపై అవగాహన కలుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 23 వతేదీ ఏకకాలంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో మొత్తం 4118 పాఠశాలల నుండి 30వేల మంది విద్యార్థులు పాలుపంచుకున్నట్లు వివరించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో మొత్తం 4దశల్లో స్క్రూటిని నిర్వహించినట్లు తెలిపారు. 26 జిల్లాల నుండి జిల్లాకు ఒక ప్రాజెక్టు చొప్పున ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో విజేతలను ఎంపికచేసినట్లు చెప్పారు. 6వతరగతి నుండి 9వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ఈకార్యక్రమం విజయవంతం కావటంతోపాటు, ఏషియన్ బుక్స్ ఆఫ్ రికార్డ్సు, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం పొందటంపట్ల హర్షం వ్యక్తం చేసారు. విజేతలకు సర్టిఫికెట్‌లు, షీల్డ్‌లు అందచేసారు.

## ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.600 కోట్లు

**● జూన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి నీళ్లు**
**● ప్రాధాన్య క్రమంలో మిగిలిన ప్రాజెక్టులు పూర్తికి కృషి**
**● అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి**



విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి ఈ ఏడాది బడ్జెట్లో రూ 600 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అసెంబ్లీలో శుక్రవారం సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ మొత్తంలో 500 కోట్లు పనులకు, మరో 100 కోట్లు భూసేకరణకు కేటాయించినట్లు చెప్పారు. సుజల స్రవంతి తో పాటు, ఉత్తరాంధ్ర లో ప్రాధాన్య క్రమంలో మరో 11 ప్రాజెక్టులు గుర్తించి వాటికి మరో 460 కోట్లు కేటాయించినట్లు రామానాయుడు వివరించారు. 2014 19లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని ఆయన చెప్పారు. సుజల స్రవంతి ద్వారా ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను సస్యశ్యామలం చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యంగా ఆయన స్పష్టం చేశారు. 63.20 టిఎంసిల నీటితో 8లక్షల ఎకరాలకు సాగు నీరు, 30లక్షల మంది ప్రజలకు తాగు నీటితో పాటు, విశాఖ పారిశ్రామిక అవసరాలకు నీరందించేలా సుజల స్రవంతికి రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. ఈ పథకంను ఫేజ్1లో 2022 కోట్లు, ఫేజ్2 లో 4210 కోట్ల తో పనులు చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిం దన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాధాన్యతను గుర్తించి కూటమి ప్రభుత్వం పనులను ప్రత్యేక శ్రద్ధతో ముందుకు తీసుకువెళుతోందన్నారు. ఉత్తరాంధ్ర సస్యశ్యామలం అవ్వాలంటే పోలవరం ఎడమ ప్రధాన కాలువ కీలక మైనదిగా ఆయన చెప్పారు. ఇంత కీలకమైన ఎడమ కాలువ పనులకు 2014-19 లో తెదేపా ప్రభుత్వం చేసిన పనులు తప్ప, గత 5ఏళ్ళ వైసిపీ పాలనలో ఒక్కరూపాయి ఖర్చు గానీ, తట్ట మట్టి గానీ, అరబస్తా సిమెంట్ పని గానీ చేయలేదని రామానాయుడు విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వంలో 63 కోట్లు మాత్రమే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ 1209 కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేశామన్నారు. 2026 జూన్ నాటికి సిఎం చంద్రబాబు చేతుల మీదుగా అనకాపల్లి వరకు నీళ్ళు తీసుకెళ్ళేలా పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు చేస్తున్నామని మంత్రి రామానాయుడు తెలిపారు.

## రైతులకు ఉచిత విద్యుత్‌కు రూ.13,722 కోట్లు

**● లక్ష పది వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశాం ● పామాయిల్ పంట విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది ● అసెంబ్లీలో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్తప్రతినిధి:. రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్ అందించడం కోసం కూటమి ప్రభుత్వం రూ.13,722 కోట్లు ఖర్చు చేస్తోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అలానే రైతుల కోసం ఇప్పటి వరకు లక్ష పది వేలు అగ్రికల్చర్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మార్ల పంపిణీ, పామాయిల్ తోటల్లో విద్యుత్ లైన్ల వలన జరిగే ప్రమాదాలపై సభ్యులు మద్దిపాటి వెంకట రాజు అడిగిన ప్రశ్నకు అసెంబ్లీలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. గోపాలపురం నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే 177 ట్రాన్స్ ఫార్మర్లను పంపిణీ చేశామన్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో పంపిణీ కొంచెం ఆలస్యమయ్యిందన్నారు. మిగిలిన ట్రాన్స్ ఫార్మర్లను త్వరలోనే అందజేస్తామని తెలిపారు. పామాయిల్ తోటల్లో గెలలను కోసేప్పుడు కవర్డ్ ఫైబర్ ఇన్ ఫోర్స్డ్ ప్లాస్టిక్ పోల్స్ ను వినియోగిస్తే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని అసెంబ్లీలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. పామాయిల్ పంట విస్తరణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అదే విధంగా పామాయిల్ రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. పామాయిల్ కోతలు కోసేప్పుడు ఇనుప పోల్స్ వాడటంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఇనుప పోల్స్ వాడకుండా, రూ.5000 విలువైన కవర్డ్ ఫైబర్ ప్లాస్టిక్ పోల్స్ ను రైతు కూలీలతో వాడించి కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చాలా ప్రమాదాలు తగ్గుతాయని ఆయన చెప్పారు. ఇనుప పోల్స్‌తో సరైన జాగ్రత్తలు తీసుకోకుండా పామాయిల్ కోతలు కోయడం వల్లే విద్యుత్ ప్రమాదాలు జరిగి కూలీలు చనిపోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పామాయిల్ రైతులకు సంబంధించి ఎమ్మెల్యేలు కూడా అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ ప్రక్రియ ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నిధులను బట్టి చర్యలు చేపడతామన్నారు. కొన్ని ఇళ్లపై నుంచి విద్యుత్ లైన్లు వెళ్తున్నాయని, వాటిపైనా దృష్టి సారిస్తున్నమన్నారు. అదే విధంగా కొంతమంది పవర్ లైన్ల కింద ఇళ్లు కట్టుకుంటున్నారని వాటి వల్ల కూడా ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని తెలిపారు. పామాయిల్ తోటల్లో పవర్ లైన్ల కింద ఖాళీ వదిలి పంటలు వేసుకోవాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. ఆ ప్రాంతాల్లో పది మీటర్లు పెరిగిన పామాయిల్ చెట్ల నుంచి పంట కోసేటప్పుడు ఇనుప పోల్స్ విద్యుత్ లైన్లకు తగిలి ప్రమాదాలు జరిగి కూలీలు చనిపోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మార్ల వల్ల ఎదురయ్యే ప్రమాదాల నివారణకు కూడా తగు చర్యలు చేపడుతున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు.

## సిజెఐ పర్యటనకు పటిష్ట చర్యలు



గుంటూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర రాజధాని అమరావతిలో మార్చి 1వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తి పాల్గొనే కార్యక్రమాల నిర్వహణకు అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ తెలిపారు. భారత ప్రధాన న్యాయమూర్తి పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ జ్యుడీషియల్, సీఆర్డీఏ, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తుళ్లూరు మండలం పిచ్చుకలంకాయ పాలెం వద్ద ఎన్ 16 రోడ్డు సమీపంలో ఏ.పి జ్యుడిషియల్ అకాడమీకి, హైకోర్టు సమీపంలో ఏపి హైకోర్టు గెస్ట్ హౌస్ కు శంకుస్థాపన, హైకోర్టు జడ్జీల రెసిడెన్షియల్ ఎన్ క్లేవ్ ను లాంఛనం ప్రారంభిస్తారనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా జ్యుడిషియల్ అధికారులను సమన్వయం చేసుకుంటూ సీఆర్డీఏ, జిల్లా యంత్రాంగం, పోలీస్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ భారత ప్రదాన న్యాయమూర్తి కార్యక్రమానికి సంబంధించిన ప్రాంతాలను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు జారీ చేశామన్నారు. శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

## ఒంగోలు జాతి పశుసంపదను పరిరక్షించాలి

**● ఆంధ్రా విశ్వవిద్యాలయానికి పూర్వవైభవం తేవాలి ● అసెంబ్లీలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్**



విజయవాడ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: రాష్ట్రంలో అంతరించిపోతున్న ఒంగోలు జాతి గోవుల పరిరక్షణకు తగు చర్యలు చేపట్టాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అసెంబ్లీలో విజ్ఞప్తి చేసారు. రాష్ట్రశాసనసభ సమావేశాల్లో శుక్రవారం పలు అంశాలపై యార్లగడ్డ మాట్లాడారు. ప్రకాశంజిల్లా గుండ్ల కమ్మ పరివాహక ప్రాంతంలో పుట్టిన ఒంగోలు జాతి పశువులు మన రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాయని ప్రస్తుతం ఇవి కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం వీటి సంఖ్య రాష్ట్రవ్యాప్తంగా 4వేలకు పరిమితం అయ్యిందన్నారు. మన రాష్ట్రానికి చెందిన ఈజాతి పశువులను బ్రెజిల్ దేశానికి తీసుకువెళ్ళి అక్కడ వీటి సంతతిని గణనీయంగా పెంచారని మన రాష్ట్రంలో మాత్రం వివిధ కారణాలతో ఇవి అంతరించే పోయేదశకు చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. రాష్ట్రంలో వీటి సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టడం తోపాటు, ఈజాతి పశువులు తరలి పోకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ తరలింపును ఆపాలని సూచించారు. ఒంగోలు జాతి గోవులను టిటిడిలో పెంపకం చేపడితే దాతల విరాళాలతో వాటిని పోషించే అవకాశం ఉంటుందని, తద్వారా ఒంగోలుజాతి పరిరక్షించ టంతోపాటు, ఇదే సమయంలో స్వామి వారి కైంకర్యాలకు స్వచ్ఛమైన ఆవు పాలు, ఆవునెయ్యి సొంతంగా ఉత్పత్తిచేసుకునే అవకాశం టిటిడికి కలుగు తుందని, ఈదిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఆంధ్రా పేరుతో ఉన్న ఏకైక సంస్థ అయిన ఆంధ్రా విశ్వవిద్యాలయంకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తగుచర్యలు తీసుకోవాలని యార్లగడ్డ కోరారు. వేలాది మంది విద్యార్థులకు విద్యనందించిన ఈవిశ్వవిద్యాలయం దయనీయ స్థితికి చేరిందని ఆవేదన వ్యక్తం చేసారు. దీనికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఈ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ మాట్లాడుతూ గత పాలకుల హయాంలో ఈ విశ్వ విద్యాలయం ర్యాంకు దారుణంగా పడిపోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితిలో మార్పు వచ్చిందన్నారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోనున్న ఈ విశ్వ విద్యాలంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై విచారణ జరుగుతుందని మరిన్ని నిధులు మంజూరు చేసి పూర్వవైభవం తెస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

## రూ.1000 కోట్లతో ఆదరణ 3.0

**బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి**



గుంటూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టైలర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. త్వరలో ప్రారంభం కాబోయే ఆదరణ 3.0 పథకంలో టైలర్లకు ఆధునిక పనిముట్లు అందజేయనున్నట్లు తెలిపారు. శనివారం టైలర్స్ డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టైలర్లకు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను ఏపీ స్టేట్ టైలర్ కో ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలో రాష్ట్ర టైలర్స్ డే వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో మంత్రి సవితను ఫెడరేషన్ సభ్యులు ఆమెను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆది నుంచి టీడీపీ... టైలర్ల సంక్షేమానికి కృషి చేస్తూ వస్తోందన్నారు. ఇదే బాటలో కూటమి ప్రభుత్వం కూడా టైలర్లను ఆర్థికంగా అభివృద్ధి చెందేలా అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఇందులో భాగంగా త్వరలో ప్రారంభమయ్యే రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకాన్ని ప్రారంభించనున్నామన్నారు. ఈ పథకంలో టైలర్లకు ఆధునిక కుట్టుమిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. టైలర్ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి సవిత స్పష్టంచేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏపీ స్టేట్ టైలర్ కో ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, సభ్యులకు మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు.

## జనసేన ఆఫీసులో అలజడి

గుంటూరు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్తప్రతినిధి: మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం దాడి జరిగింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన నీలాద్రి అనే వ్యక్తి పార్టీ కార్యాలయంలోకి చొరబడి పార్కింగ్ చేసి వున్నరెండు కార్ల అద్దాలను రాడ్డుతో ధ్వంసం చేశాడు. హఠాత్తుగా జరిగిన ఈ ఘటనతో అక్కడున్న జనసైనికులు షాక్‌కు గురయ్యారు. సమాచారం అందుకున్న మంగళగిరి పోలీసులు తక్షణమే అక్కడికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నీలాద్రి కారు అద్దాలు ధ్వంసం చేయడానికి గల కారణాలపై విచారణ చేస్తున్నారు. కట్టుదిట్టమైన భద్రత ఉండే రాష్ట్ర పార్టీ కార్యాలయంలో దాడి జరగడం తీవ్ర సంచలనంగా మారింది. వాహనాలను ధ్వంసం చేయడంపై రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పార్టీ కార్యాలయంలో వున్న సీసీటీవీ ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం నిందితుడు నీలాద్రి పోలీసుల అదుపులో ఉన్నాడు. దాడి జరిగిన సమయంలో ముఖ్య నేతలు ఎవరైనా పార్టీ కార్యాలయంలో వున్నారా అనే కోణంలో ఆరా తీస్తున్నారు.

## సిఎం చంద్రబాబు పేరిట ఫేక్ పోస్టులు

**సిఐడి డిజికి ఫిర్యాదు చేసిన వర్ల రామయ్య, నజీర్ అహ్మద్**



విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తిత్వాన్ని హననం చేసేలా సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారంటూ తెలుగుదేశం పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు నేడు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్, ఇతర నేతలు సీఐడీ డీజీని కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ సోషల్ మీడియా విభాగం ఫేక్ పత్రాలతో విష ప్రచారం చేస్తోందంటూ వారు ఆధారాలను సమర్పించారు. అనంతరం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వర్ల రామయ్య మాట్లాడారు.

2024 ఎన్నికల్లో ప్రజలు ఘోరంగా ఓడించి 11 సీట్లకే పరిమితం చేసినా జగన్ తీరులో మార్పు రాలేదని మండిపడ్డారు. అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్‌లో ఉన్న జగన్.. చంద్రబాబుపై బురద జల్లి మళ్లీ సీఎం పీఠం ఎక్కాలని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి, సజ్జల భార్గవ రెడ్డి కలిసి ఒక నేరపూరిత కుట్రకు తెరలేపారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఇందులో భాగంగానే చంద్రబాబును అప్రతిష్ఠ పాలు చేసేందుకు ఖిఎఫ్‌స్టీన్ ఫైల్స్‌ఖి తరహాలో తప్పుడు పత్రాలు సృష్టించారని పేర్కొన్నారు. దాముర్‌రెడ్డి అనే వ్యక్తి ద్వారా ఎఫ్‌బీఐ క్లాసిఫైడ్ డాక్యుమెంట్ల పేరుతో నకిలీ పత్రాలను సృష్టించి, చంద్రబాబును ఒక హై ప్రొఫైల్ అనుమానితుడిగా చూపించే వికృత ప్రయత్నం చేశారని వర్ల రామయ్య వివరించారు. ఈ పోస్టులను చూసి సీఐడీ డీజీ సైతం దిగ్భ్రాంతి చెందారని, ఇంత నీచంగా వ్యవహరిస్తారా అని ఆశ్చర్యపోయారని తెలిపారు. పరస్త్రీలను గౌరవించే సంస్కారం ఉన్న చంద్రబాబుపై ఇటువంటి అశ్లీల ఆరోపణలు చేయడం సూర్యుడి మీద ఉమ్మి వేయడమేనని హెచ్చరించారు. రాష్ట్రంలో కులమతాల మధ్య చిచ్చుపెట్టి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలన్నదే వైసీపీ లక్ష్యమని ఆయన ధ్వజమెత్తారు.

ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ ఇటువంటి నీచ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. సజ్జల భార్గవ రెడ్డి నేతృత్వంలోని సోషల్ మీడియా సైకో సైన్యం చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. దాముర్‌రెడ్డికి, సజ్జల భార్గవకు మధ్య ఉన్న సంబంధాలపై కూలంకషంగా దర్యాప్తు జరిపించాలని, నిందితులు ఎంతటి వారైనా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. డీజీ గారు సానుకూలంగా స్పందించి, కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, బండారు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కర్ణాటకలో మళ్లీ క్యాంపు రాజకీయాలు

**బెంగళూరు, ఫిబ్రవరి 26:** కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పు అంశం మరోసారి తీవ్ర చర్చనీయాంశమైంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్గానికి చెందిన దాదాపు 30 మంది ఎమ్మెల్యేలు బెంగళూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో రహస్యంగా సమావేశం కావడం రాజకీయంగా మళ్లీ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఓ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుక అని పైకి చెబుతున్నప్పటికీ అధికార మార్పిడిపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రెండున్నరేళ్ల తర్వాత పదవిని తనకు అప్పగిస్తారనే ఒప్పందం ఉందని డీకే శివకుమార్ వర్గం బలంగా వాదిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన తన బలాన్ని నిరూపించుకునేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. అయితే, ఐదేళ్లూ సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగుతారని ఆయన వర్గం స్పష్టం చేస్తోంది. ఈ సమావేశంలో ఇద్దరు మంత్రులు కూడా పాల్గొనడం గమనార్హం. డీకే శివకుమార్ వర్గం ఇక్కడ సమావేశమైన సమయంలోనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మద్దతుగా ఉన్న 20 మందికి పైగా ఎమ్మెల్యేలు విదేశీ పర్యటనలో ఉన్నారు. వారు మార్చి 1న తిరిగి రానున్నారు.

మరోవైపు, ఈ పరిణామాలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ నాయకత్వ మార్పుపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతానికి ఎలాంటి గందరగోళం లేదని తెలిపారు. ఇదిలా ఉండగా, సిద్ధరామయ్య మద్దతుదారులు కొత్త వాదనను తెరపైకి తెచ్చారు. ఒకవేళ ముఖ్యమంత్రిని మార్చాల్సి వస్తే, దళిత నేతకు (మల్లి కార్జున ఖర్గే లేదా జి. పరమేశ్వర) అవకాశం ఇవ్వాలని కోరుతు న్నారు. బడ్జెట్ సమావేశాల తర్వాత మార్చిలో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు జరగవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంచేపట్టిన రెండున్నరేళ్ల తర్వాత అంతర్గత ఒప్పందాపై అటు సిద్ధరామయ్య, ఇటు డికె శివకుమార్ వర్గాలమధ్య కీచులాటలు పెరగిన సంగతి తెలిసిందే. ఇరువర్గాలు ఢిల్లీవరకూ వెళ్లి తమతమ వాదనాలు వినిపించినా ఇప్పటి వరకూ సిద్ధ రామయ్యదే పైచేయిగా నిలిచింది.

## బొత్స త్వరగా కోలుకోవాలి: టిపిసిసి చీఫ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ వైసిపిసి ఎమ్మెల్సీ, మాజీమంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురవడంతో ఆయన ఆరోగ్యంపై పిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేయడంతోపాటు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజల కోసం నిత్యం ఆలోచించే బొత్స సత్యనారాయణ సడెన్ బ్రెయిన్ స్ట్రోక్ రావడం దురదృష్టకరమనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన త్వరగా కోలుకుని ప్రజాజీవితంలో మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. దీర్ఘకాలంగా ప్రజాసేవలో ఉన్న బొత్స సత్యనారాయణ రాజకీయ రంగంలో విశేష అనుభవం కలిగిన నాయకుడని, రాజకీయాల్లో ఆయన పాత్ర ప్రాముఖ్యత గలదని తెలిపారు. ఈ క్లిష్టసమయంలో ఆయనకు ఉత్తమ వైద్యచికిత్స అందుతూ ఉండాలని, వైద్యుల పర్యవేక్షణలో త్వరగా స్వస్థత చేకూరాలని ఒక ప్రకటనలో తెలిపారు. బొత్స కుటుంబసభ్యులకు ధైర్యం కలగాలని, అభిమానులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆయన త్వరితగతిన కోలుకోవాలని కోరుకుంటున్నామని తెలిపారు.

## కోల్‌కతాలో భూకంపం.. జనం పరుగులు



**కోల్‌కతా, ఫిబ్రవరి 27:** పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఈరోజు మధ్యాహ్నం రిక్టర్ స్కేలుపై 5.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలలు, అపార్ట్ మెంట్ల నుంచి బయటకు పరుగు తీశారు. నగరంలో భూకంపం సంభవించిందని, ఈ ప్రభావంతో పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయని అధికారులు తెలిపారు. కోల్‌కతాలో కొన్ని సెకన్ల పాటు భూప్రకంపనలు వచ్చాయి. భూకంప కేంద్రాన్ని సమీపంలోని బంగ్లాదేశ్‌లో గుర్తించారు. కార్యాలయాలు, అపార్ట్ మెంట్లు, రహదారుల్లోని సీసీ కెమెరాల్లో భూకంపానికి సంబంధించిన వీడియోలు రికార్డయ్యాయి. ఇంట్లో సోఫాలో కూర్చున్నామని, ఆ సమయంలో హఠాత్తుగా ప్రకంపనలు వచ్చాయని, భయంతో ఇంట్లో నుంచి బయటకు పరుగు తీశామని స్వగత అనే స్థానికురాలు తెలిపారు. తమ ఇంట్లోని సోఫా, ఫ్యాన్ కదలడం తాము చూశామని తెలిపారు. టేబుల్ మీద ఉంచిన ఒక సీసా కిందపడిపోయిందని వెల్లడించారు. రాజధాని కోల్‌కత్తా నగరంలో ఒక్కసారిగా ఇళ్లన్నీ కుదుపులకు లోనుకావడంతో ప్రజలు భయాందోళనలతో బయటకు పరుగులుతీసారు.

## ఒంగోలు భూకబ్జాలపై విచారణ జరిపించాలి

**- మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి**



ఒంగోలు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ఒంగోలులో భూ కబ్జాలు, అక్రమంగా ఇసుక గ్రావెల్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు లేఖ రాయడంతో పాటు జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తున్నట్లు మాజీ మంత్రి, రాష్ట్ర జనసేన పార్టీ నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుకను ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుణ్యాత్ముడు అని, అయితే ఒంగోలులో మాత్రం ఇసుక, గ్రావెల్ మీద కోట్లు సంపాదించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఒంగోలులోని స్థానిక లాయర్‌పేటలోని బాలినేని నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేను మాట్లాడేది ఏ పార్టీకి సంబంధం లేదని, తన వ్యక్తిగతంగానే మాట్లాడుతున్నానని ఆయన పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఒంగోలులో బ్రాహ్మణుల స్థలాలను ఆక్రమించుకున్నానని అబద్ధపు, అసత్య ప్రచారాలు చేశారన్నారు. ఇప్పుడు అదే స్థలాలను ఎవ్వరు కబ్జా చేశారని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి స్థలాలు ఒంగోలులో అయిదు కబ్జా చేశారని, వీటన్నింటిపై సమగ్ర విచారణ చేయాలని ప్రభుత్వాన్ని తాను కోరుతానని బాలినేని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో, కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఈ 18నెలల కాలంలో మెప్మాలో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారి పేర్లు బహిర్గతం చేయాలన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మెప్మా, భూ కబ్జాలలో తన కుమారుడికి ఎలాంటి ప్రయోజనం లేకపోయిన కేవలం దుష్ప్రచారం చేసి మానసిక క్షోభకు, అనేక ఇబ్బందులు పెట్టారని అన్నారు. అప్పుడు అవినీతి జరిగిందని ప్రచారం చేసి, ఇప్పుడు అదే అవినీతి చేయడం లేదా అని బాలినేని ప్రశ్నించారు. మెప్మా అవినీతిలో కేవలం అధికారులను సస్పెండ్ చేయడం కాదని, అందులో ఎవరు భాగస్వాములు ఉన్నారో వారందరిని బయట పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

# ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఊదారంగు

ఫ్యాషన్ ఫ్యాషన్



అమ్మాయిలకు ఇష్టమైన కలర్ అనగానే పింక్ అని చెప్పేస్తారు. కానీ ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో మహిళలు సాధించిన విజయాలకు సంకేతంగా ముచ్చటగా మూడు రంగుల్ని ఎంపికచేసింది ఐక్యరాజ్యసమితి. స్త్రీల స్వచ్ఛమైన మనసుకు తెలుపు రంగునీ, ఆశావాద దృక్పథానికి ఆకుపచ్చనీ, స్త్రీల వ్యక్తిత్వాన్నీ గౌరవాన్నీ పోరాటాన్నీ ప్రతిబింబించేలా ఊదానీ ఎంపిక చేశారట.





# ఆమె సేవలకు గ్లోబల్ టీచర్ ప్రైజ్



చాలా మంది తమ జీవితాల్లోనే సంతోషం వెతుక్కుంటారు. కానీ తోటి వారి ఎదుగుదలలో సంతోషం వెతుక్కునే వారు కనిపిస్తారు. రూబల్ నాగీ ఇదే కోవకు చెందుతారు. 'అన్ని దానాల్లోకెల్లా విద్యా దానం గొప్పది' అని నమ్మిన ఆమె.. చదువుకు నోచుకోని చిన్నారులందరినో విద్యావంతుల్ని చేస్తోంది. వారికి విద్యాబుద్ధులు నేర్పుతూ వారి బంగారు భవితకు బాటలు వేస్తున్నారు. ఈ సమాజ సేవే తాజాగా ఆమెకు 'గ్లోబల్ టీచర్' ప్రైజ్ తెచ్చిపెట్టింది. టీచింగ్ నోబెల్ ఈ పురస్కారంతో పాటు దాదాపు రూ.9 కోట్ల ప్రైజ్ మానీనీ అందుకుదామె. ఈ డబ్బుతో మరింత మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమంటోన్న రూబల్ స్ఫూర్తి ! సమాజ సేవకే కొందరు తమ జీవితాన్ని అంకితం చేస్తారు. ఇందులోనే తమ సంతోషాన్ని వెతుక్కుంటారు. నాగిది కూడా ఇలాంటి నిస్వార్థమైన మనస్తత్వమే 1980లో జమ్మూ కశ్మీర్‌లో పుట్టిన ఆమె.. పొలిటికల్ సైన్స్ డిగ్రీ చేశారు. లలిత కళలపై మక్కువతో లండన్‌లోని స్లేడ్ స్కూల్‌లో ఈ కోర్సు చేశారు. ఆపై అక్కడే యూరోపియన్ ఆర్ట్ కూడా నేర్చుకున్నారు.



**ఆర్ట్‌తో పాఠాలు !**...చిన్నతనం నుంచి సామాజిక స్పృహ ఎక్కువగా ఉన్న నాగి.. ఈ మక్కువతోనే చదువు పూర్తయ్యాక రెండు స్వచ్ఛంద సంస్థల్ని నెలకొల్పారు. 'రూబల్ నాగీ ఆర్ట్ ఫౌండేషన్', రూబల్ నాగీ డిజైన్ స్టూడియో.. పేరుతో తాను ప్రారంభించిన ఈ ఎన్జీవోల ద్వారా పేద చిన్నారులకు ఉచిత విద్య అందించాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో, మురికి వాడల్లో.. స్కూలుకు వెళ్లలేని, చదువుకు నోచుకోని చిన్నారుల కోసం దాదాపు 800 మందికి పైగా విద్యా కేంద్రాల్ని నెలకొల్పారు. వీటి ద్వారా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడమే కాదు.. ఆ ప్రాంతాలను బ్లాక్‌బోర్డులుగా మార్చి.. వాటిపై మ్యూరల్ ఆర్ట్ పెయింటింగ్స్ వేస్తున్నారు. మ్యాథ్స్, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ.. ఇలా ఎన్నో అంశాలని పెయింటింగ్స్ రూపంలో రూపొందించిన చిన్నారుల్లో ఆయా అంశాలపై అవగాహన పెంచుతున్నారు. ఇలా తన ఆర్ట్‌లో ఓవైపు చిన్నారుల భవితకు బంగారు బాటలు వేస్తూనే.. మరోవైపు మురికి వాడలు, గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా మార్చేస్తున్నారు నాగి. చిన్నారుల్లో ఆయా అంశాల పై అవగాహన పెంచుతున్నారు. ఇలా తన ఆర్ట్‌లో ఓవైపు చిన్నారుల భవితకు బంగారు బాటలు వేస్తూనే.. మరోవైపు మురికి వాడలు, గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా మార్చే స్తున్నారు నాగి. ఇలా తన నైపుణ్యా లను 2017లో 'రాష్ట్రపతి భవన్ మ్యూజియం'లో ప్రదర్శించారు నాగి. ఈ అవకాశం అందుకున్న తొలి ఆర్టిస్ట్‌గా ఘనత సాధించారు. టీచింగ్ నోబెల్ ఈ అవార్డుతో పాటు రూ.9 కోట్ల నగదు బహుమతీ ఆమె సొంతమైంది. 'గ్లోబల్ టీచర్ ప్రైజ్ అందుకోవడం గర్వంగా అనిపిస్తోంది. ఇది నాతో పాటు దేశానికీ దక్కిన గౌరవం. 24 ఏళ్ల క్రితం 30 మంది చిన్నారు లతో కలిసి ఈ ప్రయాణాన్ని ప్రారంభించా. ఇప్పుడు లక్షల మంది ఇందులో భాగమయ్యారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు నేను చేసిన ప్రతి ప్రయత్నం, ప్రారంబించిన ప్రతి కార్యక్రమం మరింత ముందుకెళ్లేందుకు నాకు స్ఫూర్తినిచ్చింది..

# దైవాన్ని చేరాలంటే..

సాధకులు సదా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నిస్తారు. ఇతరులు ఏవైనా ఇబ్బంది కలిగించినా సహనం చూపి ఔదార్యాన్నీ, ఔన్నత్యాన్నీ చాటుకుంటారు. ముఖ్యంగా ఈర్ష్య, ద్వేషాలు మనిషినిదిగజారుస్తాయి. ఉద్వేగ స్థితిలో మనసు మాట విన్నామంటే పిల్లవాడు చెప్పిన సలహా పండితుడు పాటించినట్లుంటుంది. 18 క్షణాలు పాటు ఆలోచనారహిత స్థితని సాధిస్తే ఆత్మజ్ఞానం సిద్ధించినట్లే అన్నాడో ఆధ్యాత్మికవేత్త. అదంత సులభం కాదు మరి. అందు కెంతో సాధన అవసరం.



కోపతాపాలు శరీరంతోపాటు మనసునూ ప్రభావితం చేస్తాయి. కోపం, కామం విశ్వామిత్రుణ్ణి సైతం సాధనలో ఆటంకపరిచాయి. వందల సంవత్సరాల కఠోర తపస్సు నిరుపయోగ మైంది. బ్రహ్మ ప్రత్యక్షమై నబ్రహ్మర్షిత్వం ఇచ్చినా వశిష్ఠుడే చెప్పాలని పట్టుపట్టాడు. అంటే అక్కడ తనస్సు నిరుపయోగ మైంది. బ్రహ్మ ప్రత్యక్షమై బ్రహ్మర్షిత్వం ఇచ్చినా వశిష్ఠుడే చెప్పాలని పట్టు పట్టాడు. అంటే అక్కడ అహం అంగీకరించలేదు. తీవ్ర తపస్సు వల్ల లోకానికి ముప్పు వాటిల్లుతుందని వశిష్ఠుడు వచ్చి చెబితే అప్పుడు తపస్సు విరమించాడు. విజయ గర్వితుడయ్యాడు. తర్వాత నిజానిజాలు గ్రహించి తనకున్నా అతడే గొప్పవాడని తెలుసుకున్నారు. ఎదుటివారి సంపద, పదవి, గౌరవాలు చూస్తే ఈర్ష్య కలుగుతుంటుంది. రాజసూయ యాగంతో పాండవులకు లభించిన సంపద, గౌరవాలు చూసి అసూయ చెందిన దుర్యోధనుడు వైరానికి దిగడంతో కురుక్షేత్రసంగ్రామం సంభవించింది. వినాశనానికి దారితీసే అసూయను తృప్తితో, అశాంతి కలిగించే ద్వేషాన్ని ప్రేమతో జయించాలి. ప్రేమ శత్రువులను కూడా మిత్రులుగా మారుస్తుంది. సుఖాలకు ఆనందం, దుఃఖాలకు విచారం సాధకుడికి కూడదు. అవి ద్వితీత స్థితి వస్తేనే సాధకుడి ప్రయాణం గాడిలో పడినట్లవుతుంది. అలాగే పుట్టుకను మరణం వెంటాడుతుందనే ఆలోచన భయాన్ని కలిగిస్తుంది.

# కొవ్వును కరిగించాలా?



శొంఠి పొడి వేసి టీ కాస్తే.. ఆ రుచి భలే పసందుగా ఉంటుంది. జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కూడా.

ఇవే కాదు శొంఠితో మరిన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయండోయ్!

* రోజూ కాసింత శొంఠిపొడిని ఆహారంలో చేర్చుకుంటే నెలసరి సమయంలో అధిక రక్తస్రావంతో బాధపడే వాళ్లకి చక్కని ఉపశమనం దొరుకుతుంది. మొదటి మూడు రోజులు శొంఠిపొడి వేసిన అన్నం తింటే నొప్పి కూడా తగ్గుతుంది.
* కాలి పిక్కలు పట్టేయడం, కండరాల నొప్పులతో బాధపడటం వంటి సమస్యలుంటే ఇది మంచి ఔషధం.
*. కొవ్వుని కరిగించడంలో శొంఠి ముందుంటుంది. ట్రైగ్లిజరాయిడ్ సమస్యతో బాధపడేవారు. కొన్ని రోజులు శొంఠి టీ తాగితే చక్కని ఫలితం కనిపిస్తుందట.
* శరీరం లోపలి వాపులకి, కీళ్లదగ్గర పట్టేసిట్టుగా ఉన్నా ఇది మేలు చేస్తుంది.

# పులుపు

ఆరోగ్య భాగ్యం

ఇదొక ఆమ్లరుచి. అధిక మొత్తంలో ఆమ్లం ఉండడం వల్ల పుల్లని రుచి వస్తుంది. దీనికి రుచి హైడ్రోజన్ అయాన్ సాంద్రత వల్ల వస్తుంది. పులుపు అనేది ఆహారాల్లో అధిక మొత్తంలో ఆమ్లం యొక్క ఫలితం నాలుక కిరువైపులా పులుపు రుచిని తెలిపే రుచి మొగ్గలుంటాయి. ఇదొక రసాయనిక లోపం. ఇది తరుచు ఆమ్లాలతో సంబంధం కల్గి ఉంటుంది. లాక్టిక్ ఆసిడ్, సిట్రిక్ ఆసిడ్ మాలిక్ ఆసిడ్, ఎసిటిక్ ఆసిడ్ వంటి ఆర్గానిక్ ఆసిడ్స్, హైడ్రోక్లోరిక్ ఆసిడ్, నైట్రిక్ ఆసిడ్, సల్ఫ్యూరిక్ ఆసిడ్ వంటి ఇన్‌ఆర్గనిక్ ఆసిడ్స్ వల్ల తెలుస్తుంది. ఇది ఆసిడ్ అనే లాటిన్ పసదం నుంచి వచ్చింది. దీని అర్థం సౌర్ (పులుపు)'. ఇది చాలా పోషకాలు, ఆంటి ఆక్సిడెంట్స్ అని పిలవబడే మొక్కల సమ్మేళనాల్లో సమృద్ధిగా ఉంటాయి. ఉదా: పండ్లు : గ్రీఅన్ ఆపిల్, ద్రాక్ష, స్ట్రాబెర్రీలు, చింతపండు, పచ్చిమామిడి, జామ, జసనీ ఆప్రికరాట్‌నస్పై, గూస్బెర్రీస్, కాన్బెర్రీస్, చీనీ, బ్లూబెర్రీస్, అరెంజెస్, నిమ్మ, పైనాపిల్, రాసెబ్బ్రీన్, టూర్ట్ చెర్రీస్. డైరీ ప్రొడక్ట్స్ : వెన్న, మీగడ, సౌర్‌క్రీమ్, పెరుగు, కూరగాయలు : ఊరగాయలు, టమోటాలు

**లక్షణాలు** : ఇది వేడిచేసి జఠరాగ్నిని వృద్ధి పరుస్తుంది. ఆహారానికి రుచిని కల్గిస్తుంది. ఇది శరీరానికి జ్ఞానేంద్రియల పుష్టిని, ధృఢత్వాన్ని, జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. మూత్రాన్ని ఎక్కువ చేస్తుంది. గ్యాస్ బైటికి పోవడానికి, శరీరంలో కణాల పోషణకి, శరీరంలోని స్రావాల్ని, ముఖ్యంగా లాలాజలాపికప ఎక్కువ ,చేస్తుంది. జీర్ణకోశ ఎంజైమ్‌ని ఉత్పత్తి చేసి మెటజాన్ని స్టిములేట్ చేస్తుంది. లివర్ ఫంక్షన్స్‌కి, పైతాన్ని సిగా ఫ్లో అయ్యేలా చేస్తుంది ఇది. గుండెకి, గొంతు నోరుకి మంచిది. లాలాజలంలో ప్రధాన బఫరింగ్ ఏజెంట్ అయిన మైకార్బనేట్స్ స్రావాల్ని పెంచుతుంది ఇది. కణాల్ని దెబ్బ తినకుండా రక్షిస్తుంది. ఇది ఆసిడ్ బేస్‌ల సాంద్రతను శబ్దతని కదిలిస్తుంది. శక్తినిస్తుంది. పిత్త ప్రవాహన్ని ప్రోత్సహిస్తుంది. ఇది కాలేయం పని తీరుని మెరుగుపరుస్తుంది. **కారణాలు:** క్రమ తప్పకుండా బ్రష్ చేయక పోయినా దంత పరిశుభ్రత పాటించకపోయిన పుల్లని రుచివస్తుంది. డీ హైడ్రేషన్, నోరు పొడారిపోవడం, ఆసిడ్ రిఫ్లెక్స్ వల్ల జలుబు, సైనస్ ఇన్ఫెక్షన్ వంటి అంటువ్యాధులు స్మోకింగ్, ఆల్కహాల్ త్రాగడం వల్ల గర్భధారణ, బహిష్టు సమయంలో, మెనోపాజ్‌లో హార్మోన్ల మార్పుల వల్ల న్యూరాలాజికల్ డిస్ ఆర్డర్స్ ఉన్న వరాలు దెబ్బతినడం వల్ల కరోనా-19, అనారోగ్యాలు వల్ల వస్తుంది. ఒరల్ థ్రష్ గొంతు, ముక్కు వ్యాధులు, పోషకాహార లోపం, జింక్ లోపం, కేన్సర్ వ్యాధులు రేడియేషన్ వల్ల బి.పి. ఆంటి సైకోటిక్ మందుల వల్ల, ఒత్తిడి, భావోద్వేగాలు, ఆందోళన, స్ట్రెస్ వంటి మానసిక కారణాలు వల్ల, పర్యావరణ కారకాలు, హానికరమైన రసాయనాలు, టాక్సిన్స్‌కు గురికావడంవల్ల పుల్లని ఆహారాన్ని కోరుకుంటారు. లాలాజలం స్టిములెంట్ వల్ల, బైకార్బనేట్ లెవల్స్ అధికంగా ఉండడం వల్ల ముఖకండరాల ఆకృతిలో తేడా రావడాన్ని సౌర్ ఫేస్ అంటరు.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి



# విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, హిట్ మెషిన్ అనిల్

బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి తన మచ్ ఎవైటెడ్ నెక్స్ట్ మూవీ అనౌన్స్‌మెంట్ తో మరోసారి అందరిలో ఆసక్తిని పెంచారు. వరుసగా తొమ్మిది బాక్సాఫీస్ విజయాలతో అదరగొట్టిన అనిల్ రావిపూడి.. ఈ సంక్రాంతికి వచ్చిన ఖిమన శంకరవరప్రసాద్ గారుఖితో ఆల్ టైమ్ రీజినల్ ఇండస్ట్రీ హిట్ అందిస్తూ బిగ్గెస్ట్ సక్సెస్‌ని నమోదు చేశారు. ఇప్పుడు ఆయన కొత్త ప్రాజెక్ట్‌లో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా నటించనున్నారు. ఎఫ్2, ఎఫ్3, సంక్రాంతికి వస్తున్నం వంటి బ్లాక్‌బస్టర్ ఎంటర్‌టైనర్‌ల తర్వాత ఇది అనిల్ రావిపూడి వెంకటేష్‌తో కలిసి చేస్తున్న ఐదవ చిత్రం కావడం విశేషం. ఇటివలే లీఖీబిలో అతిధి పాత్రలో అదరగొట్టారు వెంకటేష్. అలాగే సంచలనాత్మక బ్లాక్‌బస్టర్ పటాస్ తర్వాత కళ్యాణ్ రామ్‌తో ఇది అనిల్ రావిపూడి రెండవ చిత్రం. దర్శకుడు అనిల్ రావిపూడి దగ్గుబాటి, నందమూరి కుటుంబాల నుంచి వచ్చిన స్టార్స్‌ని కలిపి ఈ కొత్త చిత్రాన్ని ఒక క్లీన్, టిపికల్ అనిల్ ఎంటర్‌టైనర్‌గా అందరికీ కనెక్ట్ అయ్యే కథాంశంతో రూపొందిస్తున్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులతో కనెక్ట్ అయ్యే కంప్లీట్ ఎంటర్టైనర్ గా ఉండబోతుంది. అనిల్ రావిపూడి ట్రేడ్‌మార్క్ స్టయిల్, హ్యూమర్, ఎమోషన్స్, ఎంటర్టైమెంట్ తో సంక్రాంతికి ఫెస్టివ్ ట్రీట్‌గా నిలవనుంది. ఈ చిత్రం ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉంది, ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న భారీ అంచనాలను తగ్గట్టుగా దర్శకుడు స్క్రిప్ట్‌ను జాగ్రత్తగా మెరుగుపరుస్తున్నాడు. సాంకేతిక బృందం గురించి వివరాలు, ఇతర నటీనటుల వివరాలు త్వరలో తెలియజేస్తారు.

# 'ఓ మాట అనుకుందామా!' ఫస్ట్ లుక్ పోస్టర్,




మాస్టర్ కనిష్క్ మహాబలాహా సమర్పణలో శ్రీ శుభకర క్రియేషన్స్ బ్యానర్‌పై రూపుదిద్దుకుంటోన్న లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం'ఓ మాట అనుకుందామా!. సుహాసిని , వినోద్ కుమార్, ఇంద్రజ కీ రోల్ ప్లే చేస్తున్నారు. శ్రీనివాస్ అనంతనేని, మోనికా మిశ్రా హీరోహీరోయిన్లు కాగా, శుభలేఖ సుధాకర్, కార్తికేయ దేవ్, అజీజ్ ఖాన్, అన్నపూర్ణమ్మ మిగతా పాత్రలు పోషిస్తున్నారు. భీమ్‌జీ కథ, దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి పెంటి నాగరాజు, పెంటి నీరజ్ సందీప్ నిర్మాతలు. తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్ లుక్ గ్లింప్స్‌ని సుహాసిని మణిరత్నం, వినోద్ కుమార్ చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భగా దర్శకుడు భీమ్‌జీ మాట్లాడుతూ.. ముందుగా ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ విడుదల చేసిన సీనియర్ నటీనటులు సుహాసిని మేడమ్‌కు, వినోద్ కుమార్ సార్‌కు ధన్యవాదాలు.

# సంచలనం సృష్టిస్తోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' కొత్త పోస్టర్..

త్వరలోనే ప్రత్యేక గ్లింప్స్ తో అభిమానులకు విందు

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా కల్ట్ కెప్టెన్ హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. ఇప్పుడు ఆ అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్ళేలా కొత్త పోస్టర్ విడుదలైంది. పవన్ కళ్యాణ్ హ్యాట్ ధరించి స్టైలిష్ గా కనిపిస్తున్న పోస్టర్, సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. విడుదలైన తక్షణమే పోస్టర్ వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రియులు పవన్ కళ్యాణ్ అద్భుతమైన లుక్ కి ఫిదా అవుతున్నారు. ఈ భారీ స్పందన మరోసారి ఈ చిత్రంపై ఉన్న అపారమైన క్రేజ్‌ను నిరూపించింది. ప్రారంభం నుంచే 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. ప్రచార చిత్రాలు సంచలనంగా మారి, అన్ని సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతూ భారీ బజ్ సృష్టించాయి.



# 'విష్ణు విన్యాసం' ఫ్యామిలీ అంతా హాయిగా నవ్వుకోవచ్చు: శ్రీ విష్ణు

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు హిలేరియస్ జాయ్‌రైడ్ 'విష్ణు విన్యాసం'తో అలరించ బోతున్నారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్ గా నటిస్తోంది.



**మీరు గ్రహాలని, జాతకాలని నమ్ముతారా?**

అన్ని ఫాలో అవ్వను, కానీ మనం చిన్నప్పటి నుంచి అందరితోపాటు అలవాటు చేసుకున్న కొన్నిటిని ఫాలో అవుతాను. పర్సనల్ గా నాకైతే ఫలానా టైము ఫలానా నెంబర్లు అనే నమ్మకాలు లేవు.

**విష్ణు విన్యాసం ప్రాజెక్టు ఎలా మొదలైంది?**

డైరెక్టర్ మారుతి కథ చెప్పారు. నాకు చాలా నచ్చింది. అందరూ రిలేట్ అయ్యే కథ, చాలా మంచి క్యారెక్టర్.

**ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ చాలా డామినేటింగ్ గా ఉంది కదా?**

ఆ క్యారెక్టరైజేషన్ ని ప్రేక్షకులు చాలా బాగా ఎంజాయ్ చేస్తారు.నయన్ సారిక రెండు మూడు పేజీలు సీన్ కూడా సింగిల్ టేక్ లో చేసింది. తన పెర్ఫార్మన్స్ ఈ సినిమాలో చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఫస్ట్ హాఫ్ యూత్ కి సెకండ్ హాఫ్ యూత్‌తో పాటు ఫ్యామిలీ కూడా కనెక్ట్ అవుతుంది.

**ఇందులో మీ క్యారెక్టర్ ఎలాంటి ఎక్సైట్మెంట్ ని క్రియేట్ చేసింది?**

ఇలాంటి క్యారెక్టర్ చేయడం నాకు కొత్త. ఈ క్యారెక్టర్ కి కొన్ని రూల్స్ ఉంటాయి. చాలా నమ్మకాలుని ఫాలో అవుతుంటాడు. చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది డైరెక్టర్ మారుతి సినిమాని చాలా బాగా హ్యాండిల్ చేశాడు. చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్.

**మ్యూజిక్ గురించి?**

రథన్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. అన్ని కూడా కథ నుంచి వచ్చిన పాటలే. నాలుగు పాటల్లో కూడా మంచి ఫన్ ఉంటుంది.మేము షూటింగ్ కి వెళ్ళకముందే పాటలన్నీ చేయించుకున్నాం. మీ మార్క్ డైలాగ్స్ ఇందులో ఉంటాయాఅన్నీ ఉంటాయి. కథ, క్యారెక్టర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా సరదాగా అనిపిస్తాయి.

**నిర్మాతల సపోర్టు గురించి ?**

సుబ్రమణ్యం గారు, సుమంత్ గారు 100 సపోర్ట్ చేశారు. సినిమా విషయంలో వాళ్ళు చాలా హ్యాపీగా ఉన్నారు. మాకు చాలా ఫ్రీడమ్ ఇచ్చారు. మేము అనుకున్న బడ్జెట్లో ఒక పది, పదిహేను శాతం తక్కువ లోనే పూర్తి చేశాం.

## తెర

# 'పెద్ది' సెకండ్ సింగిల్ 'రై రై రా రా' మార్చి 2న రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది' సినిమా వేసవిలో గ్రాండ్‌గా విడుదల కానున్న నేపథ్యంలో బజ్ నెక్స్ట్ లెవల్‌కి చేసుకుంది. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇది భారీ హాలిడే సీజన్ షోడౌన్‌కు వేదికగా నిలుస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన పెద్దిలో జాన్వీ కపూర్ కథానాయికగా నటించింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో ఇప్పటికే సంచలనం సృష్టించింది. ఆస్కార్ అవార్డు గ్రహీత సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన ఫస్ట్ షాట్ఛ్ గ్లింప్స్, బ్లాక్ బస్టర్ ఎక్సయిట్మెంట్ ని మరింతగ్గా పెంచుతూ మార్చి 2న రెండవ సింగిల్ 'రై రై రా రా' విడుదలతో బజ్ నెక్స్ట్‌కి వెళ్ళబోతోంది. AR రెహమాన్ పవర్ ఫుల్ సంగీతం ఇప్పటికే సంచలనం సృష్టించింది. పెద్ది ఈ సంవత్సరం అత్యంత ఎదురుచూస్తున్న మాస్ స్పెషాలిటీలలో ఒకటిగా రాబోతోంది.

# నాని 'ది ప్యారడైజ్' ఆయా షేర్ సాంగ్



నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ ప్రాజెక్ట్ ది పారడైస్ ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ వరల్డ్ వైడ్ సంచలనం సృష్టించింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. విడుదలైన కొద్దిసేపటికే ఆయా షేర్ ప్రపంచవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ భారీ రెస్పాన్స్ అందుకుంది. ఈ పాట యూట్యూబ్ గ్లోబల్ చార్ట్స్‌లో 9 దేశాల్లో ట్రెండింగ్‌లో నిలిచింది. భారత్, యూఏఈలో నంబర్ 1 స్థానాన్ని దక్కించుకోగా, యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, సౌదీ అరేబియా, అమెరికా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా అద్భుతమైన ర్యాంకులు సాధించింది. ఒక తెలుగు పాటకు ఈ స్థాయి అంతర్జాతీయ ఆదరణ రావడం విశేషం. ఈ సాంగ్ లో రా ఎనర్జీ, నాని స్క్రీన్ ప్రెజెన్స్ అదిరిపోయింది. ఆయన చేసిన ఐకానిక్ హుక్ స్టెప్ ప్రేక్షకులను అద్భుతంగా ఆకట్టుకుంది. ఫ్లోర్ మూవ్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్‌లలో ట్రెండ్ అవుతూ ప్రపంచవ్యాప్తంగా అభిమానులను అలరిస్తోంది.


పాకిస్థాన్ ఓడితే కివీస్‌కు సెమీస్ అవకాశం

## కివీస్‌పై ఇంగ్లండ్ విజయం

**కొలంబో:** టీ20 ప్రపంచకప్ 2026లో ఇప్పటికే సెమీస్‌కు దూసుకెళ్లిన ఇంగ్లాండ్ మరో విజయం సాధించింది. బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన చివరి సూపర్8 పోరులో 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇంగ్లాండ్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది సూపర్8 గ్రూప్–2లో టాప్ పొజిషన్ పొందింది.

తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. కివీస్ జట్టులో గ్లేన్ ఫిలిప్స్(39), టిమ్ సీఫెర్ట్(35) రాణించారు. అదిల్ రషీద్, విల్ జాక్స్, రేహాన్ అహ్మద్ రెండేసి వికెట్లు తీసి న్యూజిలాండ్‌ను కట్టడిచేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ 19.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని పూర్తి చేసింది. టామ్ బాటన్ (33), విల్ జాక్స్ (32), సామ్‌కరన్ (24), హ్యారీ బ్రూక్ (26), బేతెల్ (21) కీలక ఇన్నింగ్స్ ఆడారు. రచిన్ రవీంద్ర మూడు వికెట్లు తీశాడు. న్యూజిలాండ్ ఓటమితో పాకిస్థాన్‌కు సెమీస్ ఆశలు నిలిచాయి. చివరి మ్యాచ్‌లో పాక్ భారీ విజయం సాధిస్తే సెమీస్ చేరే ఛాన్స్ ఉంటుంది.

## రెండో వన్డేలోనూ అమ్మాయిలకు ఓటమి



**హోబర్ట్:** ఆస్ట్రేలియా గడ్డపై టీ20 సిరీస్‌ను నెగ్గిన భారత మహిళా జట్టుకు వన్డే సిరీస్‌లో షాక్ ఎదురైంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడి మూడు వన్డేల సిరీస్‌ను కోల్పోయింది. హోబర్ట్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్‌పై 5 వికెట్ల తేడాతో ఆసీస్ గెలుపొందింది. భారత్ నిర్దేశించిన 252 పరుగుల లక్ష్యాన్ని 36.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఆసీస్ బ్యాటర్ జార్జియా వోల్ (82 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్స్) సెంచరీతో ఆసీస్ విజయంలో కీ రోల్ పోషించింది. ఓపెనర్ అలీస్సా హీలీ సింగిల్ డిజిట్‌కే అవుటైనా.. మరో ఓపెనర్‌ఫోయిబ్ లిట్చ్‌ఫీల్డ్ (62 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్స్‌తో 80 రన్స్) జతగా రెండో వికెట్‌కు 120 రన్స్ జోడించిన వోల్... మూడో వికెట్‌కు బెత్ మూనీ(36)తో కలిసి 82 రన్స్ భాగస్వామ్యం నడిపింది. సెంచరీ చేసి అవుటైనా మిగతా పనిని గ్రాడ్‌నర్(19) పూర్తి చేశాడు. భారత బౌలర్లలో కాష్వీ గౌతమ్ 2, దీప్తి శర్మ 2, క్రాంతి గౌడ్ ఒక వికెట్ తీశారు.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ విమెన్స్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 251 రన్స్ చేసింది. ఓపెనర్ ప్రతీకా రావల్ (52), కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (54) హాఫ్ సెంచరీలు సాధించారు. స్మృతి మంధాన (31), రిచా ఘోష్ (22), కాష్వీ గౌతమ్ (25), క్రాంతి(19) ఫర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో ఆష్లే గార్డెనర్, అన్నాబెల్. అలానా కింగ్ తలా రెండేసి వికెట్లు పడగట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా జార్జియా వోల్ నిలిచింది. నామమాత్రమైన మూడో వన్డే మార్చి1న హోబర్ట్ వేదికగా జరగనుంది.

# విండీస్‌ను దాటితేనే!




### తక్కువగా అంచనా వేయొద్దు: సన్నీ

కరేబియన్లను తక్కువగా అంచనా వేయొద్దని సూర్య సేనను లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ హెచ్చరించాడు. విండీస్‌తో సవాల్ భిన్నమైందని పేర్కొన్నాడు. విండీస్ బ్యాట్స్‌మెన్ మంచి ఫామ్‌లో ఉన్నారు... బౌలర్లూ రిథమ్‌తో బౌలింగ్ చేస్తున్నారు. ఏదైనా పొరపాట్లు చేస్తే శిక్షించేందుకు సిద్ధంగా ఉంటారని వార్నింగ్ ఇచ్చాడు. విండీస‌ను కట్టడి చేయాలంటే టీమిడియాకు సరైన ప్లాన్ అవసరమని, ముఖ్యంగా ఆ జట్టు బ్యాటింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించాడు.

### వరుణ్‌ను ఆపడం విండీస్‌కు కష్టం: ఇర్ఫాన్

కోల్‌కతాలో టాప్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఆపడం విండీస్‌కు చాలా కష్టమని మాజీ ప్లేయర్ ఇర్ఫాన్ పఠాన్ వ్యాఖ్యానించాడు. ఈడెన్ గార్డెన్స్‌లో వరుణ్ వికెట్ల పంట పండిస్తాడని జోస్యం చెప్పాడు. ఈడెన్ పిచ్ వరుణ్‌కు బాగా అలవాటు... ఒక్కసారి లెంగ్త్‌ను అడ్జస్ట్ చేసుకుంటే చాలు. స్టంప్స్‌కు కాస్త దగ్గరగా బంతులేస్తే అతడిని ఆపడం ఎవరి వల్లా కాదు. ఇక ఆరంభంలోనే వికెట్ తీశాడంటే.. అత్యంత ప్రమాదకరంగా మారిపోతాడని ఇర్ఫాన్ పఠాన్ విశ్లేషించాడు.

### ఇదే రిథమ్ కొనసాగించాలి: సచిన్

జింబాబ్వేపై టీమిండియా ప్రదర్శనకు బ్యాటింగ్ మాస్ట్రో సచిన్ తెండూల్కర్ కితాబిచ్చాడు. సూర్యసేన ఇదే రిథమ్‌ను విండీస్‌పై కొనసాగించాలన్నారు. కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో టీమ్ఇండియా పాజిటివ్ గేమ్ ఆడాలని సూచించాడు. అభిషేక్ కూడా పరుగుల గాడిలో పడడం శుభసూచకమన్నారు. విండీస్ బ్యాటింగ్‌ను భారత బౌలర్లు కట్టడి చేయగలిగితే ఎదురుండదని పేర్కొన్నాడు. బుమ్రా కీలకమవుతాడని, సౌతాఫ్రికా తరహాలో విండీస్‌ను కట్టడిచేయాలన్నారు.

**కోల్‌కతా:** టీ20 ప్రపంచకప్‌లో సూపర్8 మ్యాచ్‌లు ఉత్కంఠ రేపుతున్నాయి. నాలుగు సెమీస్ బెర్త్‌ల్లో రెండుస్థానాలు ఖరారయ్యాయి. ఇంగ్లాండ్, సౌతాఫ్రికా సెమీస్ స్థానాలు పక్కా చేసుకున్నాయి. ఇంకా మిగిలినవి రెండు బెర్త్‌లు. అవి ఏ జట్టను వరిస్తాయన్న ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా అతిథ్య టీమిండియా సెమీస్ చేరుతుందా అన్నది హాట్ టాఫిక్‌గా మారింది.

#### సెమీస్‌లో సఫారీలు

సూపర్8 గ్రూప్–1లో భారత్‌తో పాటు సౌతాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే జట్లు ఉన్నాయి. సౌతాఫ్రికా ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది నాలుగు పాయింట్లతో టాప్ ప్లేస్‌లో ఉంది. నెట్ రన్‌రేట్(2.89) కూడా మెరుగ్గా ఉండడంతో సెమీస్ బెర్త్‌కు ఢోకా లేదు. జింబాబ్వేతో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో జింబాబ్వే ఓడినా, గెలిచినా పెద్దగా సౌతాఫ్రికాకు నష్టం ఉండదు. ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ఓడి జింబాబ్వే సెమీస్‌కు దూరమైంది.

#### సెకండ్ బెర్త్ ఫైట్

ఇక రెండో బెర్త్ కోసం భారత్, వెస్టిండీస్ మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. ఇరు జట్లు ఆదివారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా తలపడతాయి. వెస్టిండీస్, భారత్ ఒక మ్యాచ్ నెగ్గి మరో మ్యాచ్‌లో ఓడి రెండు పాయింట్లతో సమవుజ్జీగా ఉన్నాయి. అయితే నెట్ రన్‌రేట్ పరంగా టీమిండియా(-0.100)కంటే వెస్టిండీస్ (1.791)తో పైచేయిగా ఉంది. దీంతో ఈ మ్యాచ్ సూర్యకుమార్ సేనకు డూ ఆర్ డైగా మారింది. జింబాబ్వేపై గెలిచి నిలిచిన మెన్ ఇన్ బ్లూ.. కరేబియన్లపై గెలిస్తే రెండో సెమీస్ బెర్త్ దక్కుతుంది. లేదంటే నిష్క్రమణే.

ఒకవేళ మ్యాచ్‌కు అకాల వర్షం అడ్డంకిగా నిలిస్తే టిమిండియా సెమీస్ ఆశలు గల్లంతవుతాయి. మెరుగైన నెట్ రన్‌రేట్‌తో విండీస్ సెమీస్‌లోకి దూసుకెళ్తుంది. అయితే భారత అభిమానులు దిగులు చెందాల్సిన వాతావరణం కోల్‌కతాలో లేదు. ఎలాంటి వర్ష సూచన లేదని ఐఎండీ తెలిపింది. ఉష్ణోగ్రత 23 డిగ్రీల మధ్య ఉండే అవకాశం ఉంది.

గ్రూప్ స్టేజ్ నుంచి అజేయంగా సూపర్8లో ప్రవేశించిన టీమిండియా.. తొలి మ్యాచ్‌లోనే సఫారీల చేతిలో చిత్తు చిత్తుగా ఓడి విమర్శల పాలైంది. అయితే జింబాబ్వేతో జరిగిన రెండో మ్యాచ్‌లో సూర్యసేన గెలిచి నిలిచారు. జింబాబ్వేపై విజయంతో టీమిండియా మంచి జోష్ మీదుంది. ఇదే జోష్‌ను విండీస్ మ్యాచ్‌లోనూ కొనసాగిస్తే భారత్‌కు సెమీస్ బెర్త్ ఖాయం.

## రింకూ సింగ్ కుటుంబంలో విషాదం

**న్యూఢిల్లీ:** టీమ్ఇండియా క్రికెటర్ రింకుసింగ్ కుటుంబంలో విషాదం నెలకొంది. అతని తండ్రి ఖాన్‌చంద్ సింగ్ శుక్రవారం కన్నుమూశారు. కొంతకాలంగా లివర్ క్యాన్సర్‌తో బాధ పడుతన్న ఖాన్‌చంద్‌ను నోయిడాలోని ఓ ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచారు. రింకు సింగ్ క్రికెటర్‌గా ఎదగడంలో ఆయన కీలకమైన పాత్ర పోషించారు. ఉత్తరప్రదేశ్‌లోని అలీఘడ్‌లో ఎల్‌పీజీ గ్యాస్ డెలివరీ విభాగంలో పనిచేసేవారు. తండ్రి మరణంతో రింకూ విషాదంలో మునిగారు. అతనికి టీమిండియా ఆటగాళ్ల ధైర్యం చెప్పారు. ఖాన్ చంద్ మృతిపట్ల పలువురు మాజీ క్రికెటర్లు సంతాపం తెలిపారు.

## జర్మన్ ఓపెన్‌లో ముగిసిన భారత్ షట్లర్ల పోరు

**బెర్లిన్:** జర్మన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరు ముగిసింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో కిడాంబి శ్రీకాంత్ 14–21, 9–21తో లిన్ చున్(చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పొందాడు. తొలి గేమ్‌లో 9–2తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ దానిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. రెండో గేమ్‌లో మాత్రం ఆరంభం నుంచే చైనీస్ తైపీ ప్లేయర్ ఆధిపత్యం చలాయించాడు. మహిళల సింగిల్స్‌లో భారత ప్లేయర్లు ఆకర్షి కశ్యప్, మాళవిక, తస్నిమ్, రక్షి తశ్రీ, తన్వీ శర్మ, ఇషారాణి తొలి రౌండ్‌లోనే

## రెజ్లర్ సుజీత్ కల్కాల్‌కు స్వర్ణం

**టిరానా:** అల్బేనియాలో జరిగిన వరల్డ్ ర్యాంకింగ్ సిరీస్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో భారత రెజ్లర్ సుజీత్ కల్కాల్... పసిడి పతకం సాధించాడు. పురుషుల ఫ్రీస్టయిల్ 65 కేజీల విభాగంలో సుజీత్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో సుజీత్ టెక్నికల్ సుపీరియారిటీపద్ధతిలో అజర్‌బైజాన్ రెజ్లర్ రషీద్ బాబాజాదెను చిత్తుగా ఓడించాడు. బౌట్ మొదలైన 77 సెకన్లకే సుజీత్ 10–0తో ఆధిక్యంలోకి వెళ్లి స్వర్ణాన్ని ఖాయం చేసుకున్నాడు. సెమీస్‌లో 11–0తో జోసెఫ్ క్రిస్టోఫర్ (అమెరికా) పై, క్వార్టర్ ఫైనల్లో 10–0తో నికా జకాష్విలి (జార్జియా)పై నెగ్గాడు.

## జమ్మూ కశ్మీర్‌కు భారీ ఆధిక్యం



**హుబ్లీ:** తొలిసారి రంజీ ఫైనల్ చేరిన జమ్మూ కశ్మీర్ అదే జోరు కొనసాగిస్తోంది. కర్ణాటకతో జరుగుతున్న ఫైనల్లో భారీ ఆధిక్యం సాధించింది. ఫైనల్‌కు చేరుకున్న తొలిసారే ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ అందుకునే దిశగా కొనసాగుతోంది.

కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌ను 293 పరుగులకు తెరదించిన జమ్మూకశ్మీర్..నాలుగో రోజు ఆటముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 186 పరుగులు చేసింది. ఓపెనర్ యావర్ హసన్, తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో శుభమ్ పండిర్(4) నిరాశపరిచినా...మరో ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్ సూపర్ బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. మిగతా వారిలో అబ్దుల్ సమద్ 32 రన్స్ చేశాడు. నాలుగో రోజు ఆటముగిసేసరికి కమ్రాన్ ఇక్బాల్ (94), సాహిల్ లోత్రా(16) క్రీజ్‌లో ఉన్నారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 291 రన్స్ కలుపుకుని జమ్మూ కశ్మీర్ మొత్తం లీడ్ 477 పరుగులకు చేరుకుంది. మరో రోజు ఆట మాత్రమే మిగిలిఉండడంతో ఛాంపియన్ కానుంది.

అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 220/5తో 5వ రోజు ఆట కొనసాగించిన కర్ణాటక తొలి ఇనింగ్స్‌లో 293 రన్స్‌కు ఆలౌటైంది. 73 పరుగులే జోడించి మిగతా 5 వికెట్లు కోల్పోయింది. మయాంక్ అగర్వాల్ 160 రన్స్‌కు అవుట్ కాగా, ఆ తర్వాత వేగంగా వికెట్లు కోల్పోయింది. కృతిక్ కృష్ణ 36 రన్స్‌తో రాణించాడు. జమ్మూకశ్మీర్ బౌలర్లలో అఖిబ్ నబీదార్ 5 వికెట్లతో మెరుగైన ప్రదర్శన చేశాడు. సునీల్ కుమార్, యుధ్వీర్‌సింగ్ చరక్ తలో 2 వికెట్లు పడగొట్టారు.



## సెబీ పేరిట మార్కెట్‌లో డీప్‌ఫేక్ నోటీసులు!

**ముంబయి, ఫిబ్రవరి 27:** మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్లను క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ అప్రమత్తం చేసింది. నకిలీ సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ) నోటీసులు, గ్యారంటీ లాభాల పేరుతో మోసపూరిత అకౌంట్ హ్యాండ్లింగ్ సేవల మోసాలు పెరిగిపోతున్నాయని హెచ్చరించింది. కొంతమంది మోసగాళ్లు సెబీ పేరు, లోగో, సీల్‌తో నకిలీ లెటర్‌హెడ్‌లు సృష్టించి, ఎస్టీటీ బకాయిలు చెల్లించాలంటూ ఇన్వెస్టర్లకు ఫేక్ నోటీసులు పంపుతున్నట్లు సెబీ గుర్తించింది. 2004 ఫైనాన్స్ చట్టం ప్రకారం ఎస్టీటీని ప్రతి లావాదేవీ సమయంలో బ్రోకర్లే ఆటోమేటిక్‌గా వసూలు చేస్తారని, తాము ఎలాంటి డిమాండ్ నోటీసులు జారీ చేయమని సెబీ స్పష్టం చేసింది. సెబీ అధికారులుగా నటిస్తూ ఈ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపింది. ఎలాంటి నష్టం లేకుండా గ్యారంటీగా లాభాలు అందిస్తామని చెబుతూ పీఎంఎస్ సర్వీస్ ప్రొవైడర్లు లేదా ఫండ్ మేనేజర్లుగా చెప్పుకునే వారి పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని సెబీ సూచించింది. ఇతర ఇన్వెస్టర్ల ఖాతాలలో తాము భారీ లాభాలు సంపాదించి పెట్టామని నమ్మించి, పెట్టుబడిదారుల డీమ్యాట్ లేదా ట్రేడింగ్ ఖాతాలను తమ చేతుల్లోకి తీసుకుని మోసం చేస్తున్నారని వివరించింది. సెబీ నుంచి వచ్చే అధికారిక ఈమెయిల్స్ అన్నీసెబిడాట్‌జివోవిడాట్‌ఇన్ డొమైన్‌తోనే ముగుస్తాయని, ఇన్వెస్టర్లు గమనించాలని సూచించింది. ఏదైనా ఉత్తర్వులకు సంబంధించిన ఆన్‌లైన్ చెల్లింపులు చేయాల్సి వస్తే, సెబీ అధికారిక పేమెంట్ గేట్‌వే ద్వారా మాత్రమే చేయాలని స్పష్టం చేసింది. మధ్యవర్తుల ప్రామాణికతను నిర్ధారించుకునేందుకు ఇటీవల సెబీ చెక్ అనే కొత్త విధానాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా యూపీఐ ఐడీ లేదా బ్యాంకు ఖాతా వివరాలు ఎంటర్ చేసి, సదరు మధ్యవర్తి సెబీ రిజిస్టర్డ్ అవునో కాదో తెలుసుకోవచ్చు. ఇన్వెస్టర్లు ఎల్లప్పుడూ తమ గుర్తింపు పొందిన మధ్యవర్తులతోనే లావాదేవీలు జరపాలని సెబీ స్పష్టం చేసింది.

## మార్చి ఒకటో తేదీ నుంచి వచ్చే మార్పులు ఇవే!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** ఏడాదిలో ప్రతి నెల ముగుస్తున్న తరుణంలో కొత్తనిబంధనలు అమలులోకి వస్తుంటాయి. వచ్చే మార్చి 1 నుంచికూడా కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. వంట గ్యాస్, ఆర్థిక విషయాల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. సాధారణ ప్రజల దినచర్య, బడ్జెట్‌ను ప్రత్యక్షంగా ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. మార్చి 1 నుండి కొత్త రూల్స్ వంట గ్యాస్ ధరలు, రైలు ప్రయాణం, మొబైల్ ఫోన్ వినియోగ నిబంధనలను ప్రభావితం చేస్తాయి. మార్చి 1 నుండి అత్యంత ముఖ్యమైన మార్పు వంట గ్యాస్ సిలిండర్ల ధరలకు సంబంధించినది. చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెల మొదటి తేదీన గృహ, వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లకు కొత్త ధరలను విడుదల చేస్తాయి. కొత్త రేట్లు మార్చి 1 ఉదయం ప్రకటిస్తారు. గ్యాస్ ధరలు పెరగొచ్చు లేదా తగ్గొచ్చు లేదా స్థిరంగా ఉండే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగితే లేదా సబ్సిడీలు మారితే, గ్యాస్ సిలిండర్లు మరింత ఖరీదైనవిగా మారవచ్చు, ఇది గృహాల నెలవారీ బడ్జెట్‌లపై ప్రభావం చూపుతుంది. ధర తగ్గడం వినియోగదారులకు ఉపశమనం కలిగించవచ్చు. రైల్వే ప్రయాణికులకు మరో ప్రధాన మార్పు. మార్చి 1 నుండి, భారతీయ రైల్వేలు పాత యుటిఎస్ యాప్‌ను నిలిపివేసి, కొత్త రైల్‌వన్ యాప్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. అన్‌రిజర్వ్, జనరల్, ప్లాట్‌ఫామ్ టిక్కెట్ల బుకింగ్‌లు ఇప్పుడు కొత్త యాప్ ద్వారా చేయబడతాయి. దీని వలన ప్రయాణీకులు కొత్త వ్యవస్థకు అనుగుణంగా మారవలసి ఉంటుంది. ప్రారంభంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తవచ్చు, కానీ కొత్త వ్యవస్థ వేగంగా, సురక్షితంగా, మరింత యూజర్ ఫ్రెండ్లీగా ఉంటుందని రైల్వేలు చెబుతున్నాయి.

## మూడోత్రైమాసికంలో భారత్ జిడిపి వృద్ధిరేటు 7.8%

వాణిజ్యం

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 27:** భారత్ ఆర్థికవృద్ధి అక్టోబరు డిసెంబరు మధ్యకాలంలో 7.8శాతంగా ఉందని కేంద్రం ప్రకటించింది. ఆర్థిక నిపుణుల అంచనాలనుసైతం జిడిపి వృద్ధి బ్రేక్‌చేసింది. నిపుణుల అంచనాలు 7.6శాతం మాత్రమే ఉన్నాయి. వివిధ దేశాలమధ్య నెలకొన్న వాణిజ్య ఆంక్షలు ఉన్నప్పటికీ భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నా భారత్ ఆర్థికవృద్ధి కొనసాగుతోందని చెపుతున్నారు. ప్రభుత్వం జిడిపి బేస్ ఇయర్‌ను 2011–12 నుంచి 2022–23కు మార్చేసింది. ఆర్థికవ్యవస్థపరిధిలనే ఉత్పత్తిరంగ డిమాండ్‌ల శ్రేణి మారుతుండటంతో బేస్ ఇయర్‌ను కూడా మార్చింది. సవరించిన మందస్తు అంచనాలప్రకారం 2026 ఆర్థికసంవత్సరంలో జిడిపి వ1ద్ధి 7.6శాతంగా ఉంటుంది. అంతకుముందు 7.4శాతంగా మాత్రమే ఉంది. ఆర్థికసర్వేలో భారత్ ఆర్థికవృద్ధి 2027లో పైపైకి వెళుతుందని 7 నుంచి 7.4శాతంగా ఉంటుందని వెల్లడించింది. పాత సిరీస్‌లో 6.8 నుంచి 7.2శాతంగా మాత్రమే ఉందని ప్రధాన ఆర్థికసలహాదారు వి అనంతనాగేశ్వరన్ మీడియాకు తెలిపారు. రెండో త్రైమాసికంలో ఆర్థికవ1ద్ధి 8.2శాతంగా ఉంది. అమెరికా ట్యారిఫ్‌లు 50శాతం సుంకాలు విధించినా ఆర్థికవృద్ధి పెరిగిందని భారత్ చెపుతోంది. 2026–27కల్లా భారత్ జిడిపి నాలుగు లక్షలకోట్ల డాలర్ల మార్కును దాటుతుందని అనంతనాగేశ్వరన్ తెలిపారు. అలాగే ద్రవ్యోల్బణం దిగువస్థాయిలోనే ఉంది. నామినల్ జిడిపి వ1ద్ధి డిసెంబరు త్రైమాసికంలో 8.9శాతంగా ఉంది.

## లాకర్ ఛార్జీలు పెంచిన హెచ్‌డిఎఫ్‌సి

**ముంబయి, ఫిబ్రవరి 27:** బ్యాంకుల్లో దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ బ్యాంకుల్లో లాకర్ యాక్సెస్ రూల్స్ కఠినతరం చేసినట్లు తెలిపింది. యాక్సెస్ మంజూరు చేసే ముందే అన్ని లాకర్ హోల్డర్లకు ఆధార్ బయోమెట్రిక్ ఆథెంటికేషన్ తప్పనిసరి చేసినట్లు తెలిపింది. అలాగే ప్రతి లాకర్ సరిగ్గా సురక్షితంగా ఉందని నిర్ధారించుకునేందుకు ఇకపై బ్యాంకు ప్రతినిధిని లాకర్ గది బయటే ఉంచుతారని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. లాకర్ ప్రాంగణంలో ఎండ్‌టుఎండ్ పర్యవేక్షణ ఉండేలా ఈ మేరకు చర్యలు తీసుకునట్లు వెల్లడించారు. కార్యకలాపాలను క్రమబద్ధీకరించేందుకు మా డిజిటల్ విధానంలో మార్పులు చేస్తున్నాం. ఇందులో భాగంగా లాకర్ యాక్సెస్ కోసం కాగిత రహిత ప్రయాణంలోకి మారుతున్నామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రకటించింది.




కస్టమర్లు ఇప్పుడు ఆధార్ అనుసంధాన బయోమెట్రిక్ ఆథెంటికేషన్ ద్వారా మాత్రమే తమ లాకర్లను యాక్సెస్ చేసేందుకు వీలు కలుగుతుంది. లాకర్ సదుపాయాన్ని మరింత సురక్షితంగా, సమర్థవంతంగా చేస్తుందని బ్యాంక్ తెలిపింది. మెట్రో, అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక లాకర్ ఫీజులు గణనీయంగా పెంచినట్లు హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. పెంచిన ఛార్జీలు ఏప్రిల్ 1 నుంచే అమలులోకి వస్తాయి. మెట్రో నగరంలో చిన్న లాకర్‌కు వార్షిక ఫీజు రూ. 5,000గా నిర్ణయించింది. ఇది ప్రస్తుత రూ. 2,250గా ఉండదా దానినిరెట్టింపుచేసింది. పెద్ద లాకర్ ఛార్జీలు రూ. 10,000 నుంచి రూ. 15,000కి పెంచారు. ప్రస్తుత మార్కెట్ రేట్లకు అనుగుణంగా దశాబ్దం తర్వాత లాకర్ రేట్లను సవరించినట్లు బ్యాంకు తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త మార్గదర్శకాల ప్రకారం లాకర్ ఛార్జీలను పెంచినట్లు సోషల్ మీడియా వేదికగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించింది. కొత్త పెంచిన ఛార్జీలు అధిక భద్రతా ప్రమాణాలు, భీమా, సాంకేతిక నవీకరణల కోసం ఖర్చులను కవర్ చేస్తాయని పేర్కొంది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకుగా కొనసాగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా చూసుకుంటే 10వ స్థానంలో ఉంది. దేశ్యాప్తంగా 9 వేలకు పైగా బ్రాంచీలు ఉన్నాయి.

## స్టాక్ మార్కెట్లలో అమ్మకాల సునామీ! - నష్టాల్లో ముగిసినసెన్సెక్స్ నిఫ్టీలు

**ముంబయి, ఫిబ్రవరి 27:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలను చవిచూశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా అమ్మకాలకు పాల్పడటం, అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు వెలువడటంతో సూచీలు కుప్పకూలాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గ చూపడంతో రోజంతా మార్కెట్లలో ఒత్తిడి కొనసాగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 961 పాయింట్లు నష్టపోయి 81,287 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 317.90 పాయింట్లు క్షీణించి 25,178 వద్ద ముగిసింది. మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు కూడా దాదాపు 1.10 శాతం చొప్పున నష్టపోయాయి. మార్కెట్ మొత్తం మీద 1,515 షేర్లు లాభపడగా, 2,300 షేర్లు నష్టాల్లో ముగియడం అమ్మకాల తీవ్రతను సూచిస్తోంది. రంగాల వారీగా చూస్తే ఐటీ, మీడియా, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ మినహా మిగిలినవన్నీ నష్టాల్లోనే ట్రేడయ్యాయి. నిఫ్టీ రియల్టీ అత్యధికంగా 2.26 శాతం పతనం కాగా, ఆటో, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా 1.69 శాతం వరకు నష్టపోయాయి. బ్యాంక్ నిఫ్టీ సైతం 1.08 శాతం క్షీణించింది. అమెరికాఇరాన్ అణు చర్చల్లో పురోగతి లేకపోవడంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతాయనే ఆందోళనలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని విశ్లేషకులు చెబుతున్నారు. నిఫ్టీ కీలకమైన 25,350 మద్దతు స్థాయిని కోల్పోవడం సమీప భవిష్యత్తులో మార్కెట్ ధోరణి మారబోతోందనడానికి సంకేతమని వారు పేర్కొన్నారు. మొత్తం మీద, అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ నిధుల ప్రవాహంపై ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ స్వల్పంగా క్షీణించి 90.06 వద్ద ముగిసింది.



## మళ్లీ పెరిగిన గోల్డ్, సిల్వర్ ఫ్యూచర్స్

**ముంబయి, ఫిబ్రవరి 27:** బంగారం వెండిధరలు శుక్రవారం మళ్లీపెరిగాయి. అమెరికా ఇరాన్‌లమధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, అమెరికా డాలర్ స్వల్పంగా క్షీణించడం వంటి వాటితో బంగారంధరలు మళ్లీపెరిగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఏప్రిల్ ఫ్యూచర్‌ట్రేడ్స్ 0.43శాంపెరిగి పదిగ్రాములు రూ.1,60,399కి చేరింది. ఇంట్రడే బేసిస్‌లో ఈ ధరలునమోదయ్యాయి. ఎంసిఎక్స్‌లో వెండి మార్చి ఫ్యూచర్లు కూడా 3.05శాతం లాభపడి కిలోకు రూ.2,67,600నమోదయ్యాయి. అమెరికా ఇరాన్‌లమధ్య జరిగిన అణు చర్చలు కొలిక్కిరాకుండానేముగిసాయి. ఎలాంటి ప్రగతి కనిపించలేదు. దీనితో భౌగోళిక ఉద్రిక్తతలు మళ్లీపెరిగాయి. అమెరికా దళాలు చుట్టుముడితే రెండుదేశాలు ఒకరిపై ఒకరు హెచ్చరికలు చేసుకోవడంతో ఈప్రభావం అటు బులియన్, ఇటు ఈక్విటీ మార్కెట్లపై పడింది. అమెరికా ఆర్థికవ్యవస్థ పటిష్టతకు కొంతమేర రేట్ కట్ ఉంటుందన్న అంచనాలతో అమెరికా ఆర్థికవ్యవస్థ పెరిగింది. సెబీ ఇటీవలే మొత్తంమూచువల్‌ఫండ్స్ ట్రేడింగ్ వ్యవస్థలను మార్చింది. గోల్డ్‌సిల్వర్ ఇటిఎఫ్‌లలో సమూలమార్పులు తెచ్చింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు రూ.1,55 వేలనుంచి రూ.1.65 వేలకు పెరిగాయి. ఒకదశలో రూ.1.80 లక్షలనుంచి రూ.1.81 లక్షలవరక వెళ్లినవి తర్వాత క్రమంలో సర్దుబాటయ్యాయి. ఎంసిఎక్స్‌లో వెండి కూడా కిలోకు రూ.2.25 లక్షలు నుంచి రూ.2.35 లక్షలుగా నడిచింది. ఒకదశలో రూ.3 లక్షలనుంచి రూ.3.25 లక్షలవరకూ చేరుతుందన్న అంచనాలున్నాయి. అయితే హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారంధర రూ.1,61,830కాగా 22 కేరట్ల ధర రూ.1,48,350గా ఉంది. ముంబయిలో 24 క్యారెట్లు రూ.1,61,830గాను 22 క్యారెట్లు రూ.1,48,350గాను నమోదయింది. ఇవేధరలు బెంగళూరులో కూడా కొనసాగితే చెన్నైలో మాత్రం 24 క్యారెట్ల బంగారం రూ.1,63,130గాను, 22 క్యారెట్ల బంగారం సుమారు రూ.1,49,600గాను ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.